అపరాధ పరిశోధన

రూ.6 జూలై '85



Blank Page

సంపుటి: 40
సంచిక: 6

ఫోన్ నెం:
64843

PARA ASHOKKUMAR

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 72 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

జూలై, 1985

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-202

[ఫలితాలు]

మే '85 నెల "అపరాధ పరిశోధన పోటీ - 202" కి సరియైన సమాధానాలు:

1 రెండవసారి.
2. పోరు.
3. సిమెంట్.
4. పెరుగుతుంది.
5. సోమరులుగా.

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి ఆగస్టు '85 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ కె. నాగభూషణ,
టెలిఫోన్ ఎక్స్చేంజ్,
దేవనహళ్లి — 562 110,
బెంగుళూరు జిల్లా,
(కర్ణాటక రాష్ట్రము).

(2) శ్రీ ఎన్ శివానంద్,
మెయిన్ రోడ్,
బెల్లంపల్లి — 504 251,
(ఆదిలాబాదు జిల్లా).

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. విలువైన క్షణాలు—జొన్నలగడ్డ రామలక్ష్మి
25. ఈనాటి దొంగలు—సరసి
51. అస్థిపంజరం—కాకిశెట్టి భానుమూర్తి
69. నన్ను ఖైదు చెయ్యండి—శివరామ్
85. నిషా అబద్ధమాడదు—వసుంధర
107. రాంగ్ నంబరు కేసు—శివరామ్
125. సాక్ష్యం ఎక్కడ?—అంధాన భగవతిరావు
139. హత్య-ఆత్మహత్య—జి.వి.జి.
159. అమాయక చక్రవర్తి—ఎమ్.వి.వి. సత్యనారాయణ
171. వీర తిలకం—సరసి
182. కాంచన శిఖరం (సీరియల్)—ఏ. వీ. మోహన్రావ్

నవలలు (సప్లిమెంట్)

3. మాయా సంసారం—వసుంధర
51. అమ్మాయి పెళ్ళి—చంద్రశేఖర అజాద్
90. దాగని నేరం—టెంపోరావ్
126. అగ్ని కిరీటం (సీరియల్)—ప్రతాప రవిశంకర్
141. విషకన్య (సీరియల్ ప్రారంభం)
—బొమ్మిడి అచ్చారావు

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

విలువైన క్షణాలు

జొన్నలగడ్డ రామలక్ష్మి

ఆనందరావు చిరుద్యోగి. అతడింకా పెళ్ళి చేసుకోలేదు.

సంబంధాలు చాలా వస్తున్నాయి కానీ అతడే అంగీకరించడంలేదు. అలాగని అతడు పెళ్ళికి విముఖుడూ కాదు. వైవాహిక జీవితం గురించి అతడికెన్నో కలలున్నాయి. ఆ కలలన్నీ తీరాలంటే డబ్బు కావాలి. ఆ డబ్బు సంపాదించడంకోసం ఏమైనా చేయాలని అతడనుకుంటున్న సందర్భంలో శ్రీహరి పరిచయం జరిగింది.

శ్రీహరికో అందమైన చెల్లెలుంది. ఆమె పేరు దీప్తి. ఆమె శ్రీహరికి ప్రాణం.

శ్రీహరికీ ఆనందరావుకీ బస్‌స్టాపులో పరిచయమైంది. శ్రీహరి కూడా తనవంటి చిరుద్యోగేనని తెలిసేక ఆనంద రావు కతడంటే మరింత ఆకర్షణ పెరిగింది.

శ్రీహరికి చెల్లెలు తప్ప యెవ్వరూ లేరు. ఆమెకు పెళ్ళి చేశాక తను చేసుకోవాలనుకుంటున్నాడు. సహృదయుడు, సంస్కారి అయిన యువకుడి కోసం శ్రీహరి వెతుకు తున్నాడు. అతడికి ఆనందరావు నచ్చాడు.

"నా చెల్లెల్ని పెళ్ళి చేసుకోకూడదూ?" అన్నాడో రోజున శ్రీహరి.

అప్పుడానందరావు పెళ్ళి గురించిన తన ఆశలూ, ఆశ యాలూ చెప్పాడు.

శ్రీహరి నవ్వి—"షాపులో అద్దాల వెనుకనున్న మిఠాయిలను చూసి అవి తినని జన్మ వ్యర్థమని భావించి ఇంట్లో పచ్చడి మెతుకులు తినలేకపోవడం దురదృష్టం. రోజూ మిఠాయిలు తినేవాడికి ఎప్పుడైనా తింటే పచ్చడిమెతుకులు అమృతంగా వుంటాయి తినడానికి రుచికి మించి ప్రధాన మైనది ఆకలి. అలాగే బ్రతకడానికీ సుఖపడ్డానికీ డబ్బొ క్కటే ప్రధానం కాదు అవకాశం, అదృష్టం ఉండాలి" అన్నాడు.

ఆనందరావుకి అర్థంకాలేదు. శ్రీహరి వివరించాడు.

ప్రతి మనిషికీ కనీసావసరాలు తిండి, బట్ట, నీడ. ఆకలి నుంచి రక్షించేటంత తిండి. మానాన్ని కాపాడ్డానికి సరిపడ బట్ట. ఎండవానల్నుంచి కాపాడగల యిల్లు వుంటే చాలు— మిగతా జీవితం సుఖంగా బ్రతికేయొచ్చు. జీవితంలో కనీసావసరాలను మించి అవసరమైనది ప్రేమ. ఇచ్చి పుచ్చు

కోవడంలో ప్రేమను మించి యేదీ తృప్తినివ్వలేదు. డబ్బు యితర సుఖాలనెన్నిటినో యిస్తుంది కానీ అందుకు ప్రేమ గురించి వెచ్చించాల్సిన ముఖ్యమైన కాలం వెచ్చించాలి. డబ్బు సంపాదించేవాడికి ప్రేమించే సమయముండదు. ఉన్నదానితో సరిపెట్టుకునేవాడికే ఆ అవకాశం.

"అటువైన మంచి యిల్లాలు దొరకడం అదృష్టం. భర్తతో కలిసి తిరగడం లోనూ, అతడితో ఏకాంతంలోనూ ఆనందం పొందగల ఇల్లాలు భర్తకు వరం. చాలామంది చీరలనో, నగలనో భర్తను వేధించడం తప్ప—సమత మాధురి ననుభవించలేరు. నా చెల్లెలు నన్ను నగలడగదు. బట్టలడగదు. అటువంటి వాటికి డబ్బు వృధా చెయ్యనివ్వదు. మనిషిని మనిషిగా అర్థంచేసుకుని ప్రేమించడంలో మా యిరువురికీ సంతృప్తి వుంది. నీ వంటి అవకాశం వున్న యువకుడికి నా చెల్లెలు అరుదైన అదృష్టం కాగలదు...." అని చెప్పాడు శ్రీహరి.

ఆనంధరావుకు నిజమే ననిపించింది. అతడు దీప్తిని వివాహం చేసుకోవాలనే అనుకున్నాడు. మనసులు కలిసిన జంట కాలినడకన పోతున్నా అది విమానయానంలా గుంటుంది. పూరిగుడిసెలో వున్నా అది రమ్య హర్మ్య మవుతుంది. గంజితిన్నా పాయసమవుతుంది.

ఈ విధంగా అతడాలోచిస్తున్న సమయంలో శోధన్ పరిచయమయ్యాడు. శోధన్ దృష్టి శ్రీహరి దృష్టికి పూర్తిగా భిన్నం.

శోధన్ కూడా కావడానికి చిరుద్యోగి. కానీ బంగాళాలో వుంటున్నాడు. స్కూటర్ కొన్నాడు ఇంకా పెళ్ళి చేసుకో లేదు. ఎందుకంటే పెళ్ళి అంటే యువకుడి జీవితాన్ని ఒకే యువతికి పరిమితం చేసేది. స్కూటరున్న బ్రహ్మచారులు

కొన్నాళ్ళపాటైనా రోజుకో అమ్మాయిని స్కూటరువెనుక షికారుకు తీసుకెళ్ళ గలగాలి అందుకు కొంత ఖర్చవుతుంది. రోజంతా అందుకు శ్రమపడితే—ఆ తర్వాత లైఫ్ ఎంజాయి చేయొచ్చు.

"అన్నం రుచి తెలియాలంటే రోజంతా కష్టపడి పని చేయాలి. అప్పు డాకలి పుడుతుంది. పని చేయడంవల్ల నాలుగు డబ్బులూ దొరుకుతాయి. దాంతో సుఖంగా కావల సింది కొనుక్కొని తినొచ్చు. అలాగే డబ్బు విషయమూను. ఉన్న తీరుబడినంతా ప్రేమకోసం ఖర్చుపెట్టేవాడికి కొన్నా ళ్ళకు ప్రేమంటే వెగటు పుడుతుంది. ఆ తీరుబడిలో కొంత సమయాన్ని ధన సంపాదనకు వినియోగిస్తే ప్రేమంటే ఆకర్షణ పెరుగుతుంది. ఆ డబ్బుతో ప్రేమక్కూడా విలువ పెరుగుతుంది ...." అన్నాడు శోధన్.

"అంటే ఏమంటావ్?" అన్నాడు ఆనందరావు.

"ఈ ప్రపంచంలో డబ్బును మించింది లేదు. డబ్బుతో ఏమైనా సాధించవచ్చు. అందువల్ల డబ్బుకోసం ఏమైనా చేయాలి ..." అన్నాడు శోధన్.

"డబ్బుకోసం ఏమైనా చేయాలి!" ఇదే ఆనందరావు మనసులో చాలా కాలంగా వున్న అభిప్రాయం కూడా. అతడిలో యిప్పుడు కొత్త ఉత్సాహం పుట్టింది.

"ఏమైనా చేయాలనే నేనూ అనుకున్నాను. కానీ యేం చేయాలో నాకు తెలియడంలేదు ..." అన్నాడు ఆనంద రావు.

"నేనడిగిన సమాచారమిస్తే చాలు...." అన్నాడు శోధన్.

"ఏమిటది?"

శ్రీహరి ఇన్‌కంటాక్సు డిపార్టుమెంట్లో పని చేస్తు

న్నాడు. దేశంలో డబ్బు సంపాదిస్తున్నవాళ్ళ జాతకాలు చాలావరకూ అతడి చేతిలో వున్నాయి. బ్లాక్ మనీని పట్టి పన్ను లెగేసేవాళ్ళ ప్రాణాలు తీయడానికి ఇన్‌కంటాక్సు డిపార్ట్‌మెంటు మెరుపుదాడులు జరుపుతూంటుంది. ఆ దాడు లెప్పుడు జరుగుతాయో డిపార్ట్‌మెంట్లో తెలిసినవాడు శ్రీహరి ఒక్కడే కోడ్ భాషలో అతడినుంచి సమాచార మందగానే స్క్వాడ్స్ బయలుదేరుతాయి.

"దాడి జరుగబోవడానికి గంటముందు తెలుస్తే చాలు. వాళ్ళ వాళ్ళ జాగ్రత్తలో వాళ్ళుంటారు. అందుకు ప్రతి ఫలం యాభై వేలనుంచి లక్ష రూపాయలదాకా ఉంటుంది" అన్నాడు శోధన్.

"లక్షరూపాయలే...." అన్నాడు ఆనంద రావాశ్చ ర్యంగా.

"అవును...." అన్నాడు శోధన్.

"అయితే నేను ప్రయత్నిస్తాను...." అన్నాడు ఆనంద రావు.

"అదంత సులభం కాదు. శ్రీహరి బాగా నిజాయితీ పరుడు. అతడు డబ్బుకి లొంగడంలేదు. లొంగితే నీవల్లనే లొంగాలి. నీకు తన చెల్లెల్నిచ్చి పెళ్ళి చేయాలనుకుంటు న్నాడు కదా...." అన్నాడు శోధన్.

"ఇదంతా నీకెలా తెలుసు?"

"డబ్బు సంపాదించేవాడికి లక్ష మార్గా లుంటాయి. శ్రీహరిమీద బోలెడు నిఘా వుంది...."

"లక్షరూపాయలంటే కూడా శ్రీహరి లొంగలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు ఆనందరావు.

"లక్షరూపాయలంటే అదే జీవితమనుకుంటున్నావా? మేమిస్తామన్నది కేసుకు లక్షరూపాయలు....శ్రీహరి చాలా

కేసులు వదులుకున్నాడు.

ఆనందరావుకు గుండె ఆగినంత పనయింది.

"శ్రీహరి ప్రమాదకరమైన మనిషి కూడా. తనవద్దకు రాయబారాలు పంపినవాడి గురించి పోలీసు రిపోర్టులుకూడా యిచ్చేవాడు. అందుకే అతడినెవ్వరం డైరెక్టుగా కలుసుకో లేకపోతున్నాం...." అన్నాడు శోధన్.

ఆనందరావు అనుమానంగా—"అయినా యిందులో నీ ఆసక్తి ఏమిటి? నీకు మరీ ఇన్‌కంటాక్సు డిపార్టుమెంటుకి భయపడేటంత డబ్బేం లేదుకదా ..." అన్నాడు.

"చూడు....దేశంలో నీతికీ, అవినీతికీ కూడా యెన్నో సంస్థలున్నాయి. ఓ పెద్ద సంస్థలో నేనూ వున్నాను. మా సంస్థ కార్యక్రమాల్లో—ఇన్‌కంటాక్సు రెయిడ్స్ గురించి డబ్బున్నవాళ్ళని ముందుగా హెచ్చరించడం ముఖ్యమైనదిగా చెప్పుకోవచ్చు. అందుకు మేము కమీషన్ తీసుకుంటాం. అందులో కొంత మీ కిస్తాం ..." అన్నాడు శోధన్.

ఆనందరావు ఆశ్చర్యపడి—"ఇలాంటి సంస్థలో స్థానం సంపాదించాలంటే ఏం చేయాలి?" అన్నాడు.

"లైఫ్ ఇన్సూరెన్సులాగే ముందు కొంత బిజినెస్ చేసి చూపించాలి. సంస్థకు నీ కారణంగా పదిలక్షల రూపాయలు ఆదాయం వచ్చిందంటే నువ్వు నెల జీతంమీద సంస్థలో శాశ్వత సభ్యుడివి కావచ్చు...." అన్నాడు శోధన్.

శ్రీహరి బంగారుగుడ్లు పెట్టే బాతు—అని అప్పటి కర్థమైంది ఆనందరావుకి. అంతకాలం అతడి పరిచయాన్ని మామూలుగా తీసుకుంటూ వచ్చాడతడు.

"నేను శ్రీహరిని లొంగదీస్తాను...." అన్నాడు ఆనంద రావు.

"నీ నిర్ణయానికి చాలా సంతోషం. కానీ అది నువ్వను

కున్నంత సులభం కాదు. శ్రీహరి మొండిమనిషి. అతడిని లొంగదీయాలంటే మోసగించాలి...."

"ఎలా?"

"అతడి చెల్లెల్నె అందు కుపయోగించుకో. ఎలాగో మాయమాటలు చెప్పి ఆమెను లొంగదీసుకో. పెళ్ళికి ముందే శారీరక సంబంధం యేర్పరచుకో. అటుపైన పెళ్ళి చేసుకోనని. అప్పుడు శ్రీహరి నువ్వు చెప్పినట్లు వింటాడు" అన్నాడు శోధన్.

"అది సరేకానీ...." అన్నా డానందరావు అనుమానంగా—"ఈ పనికి నన్నే యెందుకెన్నుకున్నట్లు?"

"ఎందుకేమిటి? నువ్వు శ్రీహరికి నచ్చావు...."అన్నాడు శోధన్ నవ్వుతూ.

2

ఆరంభంలోనే ఆనందరావు చిన్నపొరపాటు చేశాడు. అతడు శ్రీహరిని కలుసుకుని దేశాన్నేలే నాయకులు కూడా అవినీతికి లోనవుతున్న ఈ దేశంలో—సామాన్యులు నీతి, అవినీతి అంటూ ప్రాకులాడరాదని ఓ చిన్న ఉపన్యాసమిచ్చి—"నీకు నీతిపైన మోజుండవచ్చు. కానీ నీ చెల్లెలి కోసం కొన్నాళ్ళు నాకు సహకరిస్తే నేను సుఖంగా జీవించ డాని కవసరమైనంత డబ్బు సంపాదించుకుంటాను...." అని చెప్పాడు.

దీనికి శ్రీహరి మండిపడలేదు. తాపీగానే అతడుచెప్పిన మాటలు ఆనందరావులో మంటలు పుట్టించాయి.

దేశాన్నేలే నాయకులు స్వార్థపరులు కావచ్చు. కానీ దేశం ముందుకు పోతూనే వుంది. మన మంచితనాన్నితరుల స్వార్థానికి ముడిపెట్టకుండా వున్నంత కాలం—మనం దేశాన్ని వెనక్కు లాగడం లేదన్న తృప్తి

వుంటుంది.

నీతిగా బ్రతకడంలో వున్న తృప్తి—అవినీతికి లోనయ్యేవరకూ తెలియదు. ఒకసారి అవినీతికి లోనైన వాడు క్రమంగా అధఃపాతాళానికి పతనమై పోతాడు.

ఒకసారి అవినీతికి పాల్పడి పదిలక్షలు సంపాదించు కున్నాక—తర్వాత మడికట్టుకుని కూర్చుందుకు వీలుపడదు చిన్న తప్పుతో ప్రారంభించినవాడు పెద్ద తప్పుతో అంత మవుతాడు.

దీప్తిని వివాహం చేసుకునేవాడికి ధనకాంక్ష వుండ కూడదు అందువల్ల చెల్లెలికోసం డబ్బు సంపాదించవ మన్న ప్రసక్తి లేనేలేదు. ఏ రూపేణా అయితేనేం—ధన సంపాదన భార్యద్వారా సాధించా లనుకునేవాళ్ళంటే శ్రీహరికి అసహ్యం.

అన్నిటికంటె ఆఖరున అతడు—"నువ్వంటే నా కభి మానముంది. ఎవరి మాటలో వినడంవల్ల నీ బుద్ధి తప్పు దారులు తొక్కుతోంది తప్పితే స్వతహాగా నువ్వు మంచి వాడివి. అందుకే నిన్ను క్షమించాను. ఇంకొకసారిలాంటి ప్రసక్తి తెచ్చావంటే నిన్ను పోలీసుల కప్పగించగలను" అన్నాడు.

ఆనందరావు బాగా దెబ్బతిన్నాడు. శోధన్‌కు జరిగింది చెబితే—"నువ్వలా ఎందుకు చేశావు....అతడికిప్పుడు నీ మీద అనుమానం కలిగిందంటే నిన్ను దరిదాపులక్కూడా రానివ్వడు...." అని మందలించాడు.

శోధన్ సలహామేరకు ఆనందరావు శ్రీహరిని కలుసు కుని—"నువ్వెలాంటి వాడివోనని పరీక్షించాను తప్పితే నాకు డబ్బుమీద వ్యామోహం లేదు. అన్నింటికీ మించి విలువయినది నీ స్నేహం. దాన్ని వదులుకోలేను...."

అన్నాడు.

శ్రీహరి నవ్వి—"నువ్వు నిజంగానే నన్ను పరీక్షించి వుంటావని నమ్ముతున్నాను. ఒకవేళ అది అబద్ధమే అయినప్పటికీ—అప్పటి నీ ప్రవర్తనకు సిగ్గుపడి—ఆ అబద్ధం చెప్పావని అనుకుంటున్నాను...." అన్నాడు.

"చాలా తెలివైనవాడు...." అనుకున్నాడు ఆనందరావు.

ఆ తర్వాతనుంచి అతడు పొరపాటున కూడా శ్రీహరి వద్ద అవినీతి ప్రస్తావన తీసుకుని రాలేదు. అతడితో బాగా చనువుగా వుండడానికి అత్త ఇంటికి తరుచు వచ్చి రావడం మొదలుపెట్టాడు.

దీప్తికి ఆనందరావు నచ్చినట్లే వున్నాడు. ఆమె అతడితో ఎంతో ఉత్సాహంగా మాట్లాడేది. ఎంతసేపటికీ చిరాకుపడేది కాదు.

ఇద్దరూ అప్పుడప్పుడు పార్కులకూ, నది ఒడ్డుకూ వెళ్ళివస్తూండేవారు. శ్రీహరి ఆమెకా స్వేచ్ఛ నివ్వడమే కాక—"ఆడపిల్లను అదుపుచేయాలనుకోవడం—అవమానించడమే అవుతుంది...." అనేవాడు.

ఏకాంతంలో వాళ్ళు ప్రణయం గురించి మాట్లాడుకునేవారు కాదు. దీప్తికి అన్నగారంటే ఆరాధన. అతడి గురించి యే మాటలు చెప్పినా ఆమె కళ్ళలో వెలుగు కనపడేది.

"శ్రీహరి సామాన్యుడు కాదు. తలచుకుంటే అతడు బంగళాల్లో వుండగలడు. కార్లలో తిరగ్గలడు. దాసదాసీజనాల సేవ లందుకోగలడు ...కానీ అతడు నీతికి నిలబడి సామాన్య జీవితం గడుపుతున్నాడు...." అని మెచ్చుకున్నాడు ఆనందరావు.

"మీరు చెప్పింది నిజమేకానీ ఈ మాటలు నా దగ్గరైతే

అన్నారుకానీ అన్నయ్య దగ్గరనొద్దు...." అంది దీప్తి.

"ఎందుకని?" అన్నాడు ఆనందరావాశ్చర్యంగా.

"అవినీతిని గర్హించాలి. శిక్షించాలి. అది అన్నయ్య అనుమతిస్తాడు. నీతిని పాటించడం సామాన్యుడికర్తవ్యం. నీతిని అభినందిస్తే అది నీతికే అవమానమంటాడన్నయ్య" అని—"మనిషి బ్రతకడానికి గాలి పీలుస్తాడు, దాహానికి నీళ్ళు తాగుతాడు. వాటిని మనం విశేషంగా చెప్పుకుంటున్నామా....నీతి విషయమూ అంతేనంటాడన్నయ్య...." అంది దీప్తి.

ఆనందరావుకు మతిపోయినట్లయింది. ఆమె చెప్పే ప్రతిమాటా అతడిని అంతులేని నిరాశకు గురిచేస్తోంది. ఎలాంటి మనిషి దొరికాడు తనకు? అవతల లక్షల్లో ఆదాయం....ఇవతల శ్రీహరి....ఒక్క శ్రీహరి కారణంగా ఆ ఆదాయమంతా ఆగిపోతోంది.

"అవునవును....నాకు తట్టనేలేదు...." అన్నాడానందరావు.

దీప్తిని సంపదలవైపూ, సౌఖ్యాలవైపూ మళ్ళించాలని అతడు చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి.

చివరికతడు శోధన్ చెప్పిన ఆఖరి ఉపాయం ప్రయోగించాలనుకున్నాడు.

3

ఆ రోజు ఉన్నపళంగా ఆఫీసుకు సెలవుపెట్టి శ్రీహరి యింటికి వెళ్ళాడు ఆనందరావు.

అప్పుడు దీప్తి మాత్రమే యింట్లో వుంది. శ్రీహరి ఆఫీసుకు వెళ్ళాడు.

"మీరా?" అంది దీప్తి ఆశ్చర్యంగా.

"నీతో మాట్లాడాలని వచ్చాను...."

"అర్జంటా?"

"ఏం?" అన్నాడు ఆనందరావు.

"ఏమీలేదు. అవతల స్నానానికన్నీ ఏర్పాట్లూ చేసుకుని వచ్చాను. మీరు కాసేపు కూర్చోగలరా?"

"ష్యూర్...." అన్నాడు ఆనందరావు వుత్సాహంగా.

అతడు ఇండియా టుడే మాగజైన్ చూస్తూ కూర్చున్నాడు. ఈలోగా దీప్తి స్నానం చేసి వచ్చింది.

దీప్తి తలంటుకుని వచ్చింది. డ్రైయర్‌తో ఆరబెట్టుకుందేమో జుత్తు పాయలు పాయలుగా విడి ఎగురుతోంది. ఆమె జడ వేసుకోలేదు. వదులు వదులుగా వదిలేసింది. నుదుట ఎర్రని బొట్టు. లేత గులాబీరంగు చీర. అదేరంగు జాకెట్....

మనిషి దేవతలావుంది.

"ఈ లోకంలో అందం ఆడదానిదే...." అనుకున్నాడు ఆనందరావామెను చూస్తూ.

"చెప్పండి ..." అందామె అతడి కెదురుగా కూర్చుని.

"నువ్వంటే నాకెంతో యిష్టం...." అన్నాడు ఆనందరావు.

"థాంక్స్!" అంది దీప్తి.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను...." అన్నాడు ఆనందరావు.

"థాంక్స్!" అంది దీప్తి.

"ఉత్త థాంక్సేనా?"

"మరేం చెప్పాలి...." అంది దీప్తి అమాయకంగా.

"నేను నీ గురించిన నా అభిప్రాయాలు చెప్పాను. నువ్వూ నా గురించిన నీ అభిప్రాయాలు చెప్పాలి...." అన్నాడు ఆనందరావు.

"అన్నయ్యనడిగి చెబుతాను...." అంది దీప్తి.

"నేనంటే నీ కిష్టంలేదా?"

"అన్నయ్య నడగాలి...."

"నేనంటే నీకు ప్రేమలేదా?"

"అన్నయ్య నడగాలి...."

ఆనందరావు చిరాకును మనసులోనే అణచుకుని— "నీకంటూ అభిప్రాయాలుండవా?" అన్నాడు.

"ఉన్నాయి. కానీ అన్నయ్యనడిగికానీ చెప్పలేను...."

"ఎందుకని?"

"ఎన్నో విషయాలపైనా కెన్నో అభిప్రాయాలుండేవి. వాటిని అన్నయ్యకు చెప్పేదాన్ని. కొన్నింటితో అన్నయ్య అంగీకరించేవాడు కొన్నింటిని ఖండించేవాడు. నేను గ్రహించినదేమిటంటే అన్నయ్య అభిప్రాయాల్లో తప్పుండదు. అన్నయ్య అభిప్రాయాలతో సరిపోయినప్పుడే నా అభిప్రాయాలు రైటవుతాయి....అప్పట్నించీ నాకే అభిప్రాయమేర్పడినా అన్నయ్య నడక్కుండా ఇతరులకు చెప్పడం మానేశాను. అంటే ఏ విషయంలోనైనా అన్నయ్య అభిప్రాయమే నా అభిప్రాయం. మీ గురించి నేనేమనుకుంటున్నానో తెలుసుకోవాలనుకుంటే అన్నయ్య నడగండి—చెబుతాడు. నానుంచే వినాలనుకుంటే-ముందు నన్నన్నయ్యతో మాట్లాడనివ్వండి అప్పుడు చెబుతాను...."

"ప్రతిదానికీ అన్నయ్య అన్నయ్యంటే....రేపు పెళ్ళైతే ఎలా?"

దీప్తినవ్వి—"ఎవరైనా మొక్కకే నీళ్ళుపోస్తారు. చెట్టు తన నీరు తనే సంపాదించుకుంటుంది. పెళ్ళైన ఆడపిల్ల చెట్టులాంటిదని అన్నయ్య అభిప్రాయం ..." అంది.

"అన్నయ్య.... అన్నయ్య...." అని మనసులో విసు

క్కని— "ఇప్పుడు నేను చాలా ముఖ్యమైన పనిమీద వచ్చాను...." అన్నాడు,

"ఏమిటది?"

"పెళ్ళికి ముందు సీతో అనుభవం పంచుకోవాలనిపించింది...." అనేసి తన ధైర్యానికి తనే ఆశ్చర్యపోయాడు ఆనందరావు.

దీప్తి అతడివంక అదోలా చూస్తోంది.

ఆమె తనవంక గుడ్లురిమి చూస్తోందనీ—తనను తూర్పారబెడుతుందనీ భావించాడతడు. అందుకే—"నువ్వు నన్ను తిట్టకూడదు. అన్నయ్యనడిగి అప్పుడు తిట్టాలి...." అన్నాడు. తను చాలా తెలివిగా మాట్లాడేననే అనుకున్నాడతను.

దీప్తి తాపీగా—"రైటే చెప్పారు. మీరన్నమాటలు అన్నయ్యకు చెబుతాను. అన్నయ్యెలా చెబితే అలాచేస్తాను" అంది.

ఆనందరావు తెల్లబోయాడు. శ్రీహరిలాగే దీప్తి కూడా అసాధారణ యువతి అని అతడు గ్రహించాడు.

"సరే—నీ పద్ధతి నీది. నేనిప్పుడు నిన్ను బలవంతం చేస్తాను. అన్నయ్య నడగలేదు కాబట్టి నువ్వు అరవకూడదు. ప్రతిఘటించకూడదు...." అన్నాడతడు.

దీప్తిముఖం ఎర్రబడింది— "అన్నయ్య నడక్కుండా నేను కొన్ని పనులు చేశాను. మీరు తెలుసుకోవడం మంచిది...."

"చెప్పు...."

"దొడ్లో పాము కనబడింది. అది బుస్సుమంటూ నా మీదకు లేచింది. అప్పుడు నా చేతిలో కర్రవుంది. దాంతో పాముని చంపేశాను. తర్వాత అన్నయ్యకు చెప్పాను.

అన్నయ్య నన్ను మెచ్చుకున్నాడు...."

ఆనందరావులిక్కిపడ్డాడు.

"తర్వాత నడిబజార్లో ఒకడు నా చేతిలోంచి పర్సు లాక్కొని పరుగెడుతూంటే కేకలువేసి పరుగెత్తి వాడి నందుకున్నాను. నేను తన్నకపోయినా పదిమందీ వాడిని తన్నారు. నా పర్సు నాకు దక్కింది. ఒక్కపైసా కూడా పోలేదు.... అప్పుడూ అన్నయ్య నన్ను మెచ్చుకున్నాడు...."

ఆనందరావు కంగారుపడుతూనే... "ఇంకా...." అన్నాడు.

"ఇప్పుడేదో బలవంతం అన్నారుకదా.... అదేంటో చూపి అప్పుడు చెబుతాను...." అంది దీప్తి.

"ఇప్పుడే చెప్పొచ్చుగా!"

"అవసరమైనవి తప్ప చెప్పకూడదని అన్నయ్య చెప్పాడు. మీరు నన్ను బలవంతం చెయ్యరని నా నమ్మకం. తప్పు చేయబోయేవాడు తను తప్పు చేస్తానని చెప్పి చేయడని అన్నయ్యన్నాడు...."

ఆనందరావుకోపం వచ్చింది—"నా గురించి నువ్వే మనుకుంటున్నావో తెలియదు నేను సరదాకా మాటలు అనలేను." అంటూ లేచి ఆమెను సమీపించి చేయిపట్టుకుని లేపాడు.

ఆమె లేచింది. నిలబడింది.

అతడిచేయి ఆమె చేతిలో వుంది ఆమె ఒక్కక్షణం ఆగింది. అతడాస్పర్శలోని ఆనందాన్ననుభవిస్తున్నాడు.

ఆమె ఒక్కసారి అతణ్ణి ముందుకు లాగింది. తనామె పై పడుతున్నానని ఆనందరావనుకున్నాడు. కానీ ఆమె పక్కకు తప్పుకోవడంతో నేలకరిచాడతడు.

ఆ తర్వాత ఆమె అతడిని ఫుట్‌బాల్‌ను చేసి ఆడింది. అతడికి వళ్ళంతా నొప్పులు, దెబ్బలు....

"ఇందాకా నీకు చెప్పని విశేషమిదే: ఒకసారి ఓ రౌడీ నా చేయి పట్టుకుంటే ఇదేపని చేశాను. పాముల్ని కొట్టడానికి కర్రఉన్నట్లే—మనుషుల్లో పాముల్లాంటి వాళ్ళున్నప్పుడుపయోగ పడుతుందని అన్నయ్య నాకు కరాటే నేర్పించాడు—" అంది దీప్తి.

ఆనందరావుకు వళ్ళంతా హూనమైపోయింది. లేచి నిలబడడానికే అతడికి చాలాసేపు పట్టింది.

"ఇంతటితో నిన్ను వదిలిపెట్టను. నీలో రాక్షసుడున్నాడు. అందుకు శిక్ష అనుభవించాలి. అతివపై అత్యాచారం చేయబోయావని నీకు జైలుశిక్ష పడుతుంది. అన్నయ్యకు తెలిసిన పోలీసాఫీసురున్నాడు ...ప్రస్తుతానికి వెళ్ళు...."

ఆనందరావక్కణ్ణించి పారిపోయాడనే చెప్పాలి.

4

శోధన్ అతడిని తిట్టని తిట్టులేదు. నువ్వు మునిగడమే కాక నమ్ముకున్నవాళ్ళను కూడా నట్టేట్లో ముంచేస్తావని తిట్టాడు. అలాంటివాడు జైల్లో మగ్గి చావడమే మేలన్నాడు.

ఆడపిల్లను మానభంగం చేయబోయి—తనే భంగపడ్డ మగవాడిగా ఆనందరావు చరిత్ర పేపర్లలో కెక్కుతుంది. అతడి ఉద్యోగం ఊడుతుంది. పరువు గంగపాలవుతుంది. ఇంతకాలం వున్న చిరుద్యోగ సుఖజీవితం కూడా పోయి భవిష్యతులో శూన్యాంధకారం మిగుల్తుంది.

"నేను చచ్చిపోతాను ..." అన్నాడు ఆనందరావు

"నిజంగా చావాలని నీకుంటే ముందు పగతీర్చుకో. శ్రీహరిని చంపేసెయ్. దీప్తికి మానభంగంచేయ్. అప్పుడు

నువ్వు చచ్చినా ఆ చావుకో అర్థముంటుంది...."అన్నాడు శోధన్.

"అలాంటి పనులు నావల్లకాదు. చచ్చి మరో జన్మెత్తితే ఏమో చెప్పలేను...." అన్నాడు ఆనందరావు.

"పోనీ ఆ పనే చేయి...."

"అంటే ముందు నేను చావాలి....ఒక్క నిముషం.... నువ్విక్కడే వుండు..." అని బయటకు వెళ్ళాడు ఆనందరావు.

శోధన్ చిరాగ్గా అక్కడే కూర్చున్నాడు. ఓ అరగంటలో వచ్చాడానందరావు. లోపలకు వస్తూనే—"ఇవి నిద్ర మాత్రలు... కొనుక్కుని వచ్చాను...." అన్నాడు.

"నిజంగా నువ్వు చద్దామనుకుంటున్నావా?" అన్నాడు శోధన్.

"అవును...."

"అయితే ఆ మాత్రలన్నీ వేసుకుని చావు....చచ్చే ముందో చీటీ కూడా రాసిపెట్టు." అని వెళ్ళిపోయాడు శోధన్. అతడక్కణ్ణించి తిన్నగా ఓ నగర ప్రముఖుడింటికి వెళ్ళి మొత్తం జరిగినదంతా చెప్పాడు.

నగర ప్రముఖుడుత్సాహంగా—"వెరీగుడ్! ఈ దెబ్బతో శ్రీహరి ఫినిష్!" అన్నాడు.

"అదెలా?"

"ఆనందరావు చస్తాడు. పేరున్న డాక్టరుచేత పరీక్ష చేయించు. ఆయన చచ్చినట్లు సర్టిఫికెట్టిస్తాడు. ఆ తర్వాత మన డాక్టరు రంగంలోకి దిగుతాడు...."

"మన డాక్టరంటే?"

"డాక్టర్ రంగారావు. ఆయనో గొప్ప ఇంజక్షన్ కని

పెట్టాడు. మనిషి చచ్చేక కూడా ఒకటి రెండు గంటలు తిరిగి బ్రతికించగలదది. ఆ సమయంలో ఆ హతుడు తానే మైనా పూర్తి చేయాలనుకున్న పనులు చేసుకోగలడు. తన కున్న జీవితకాలం పరిమితమని అతడికి తెలుస్తుంది. అందు వల్ల పుట్టిన తెగింపుతో అతడి కసాధ్యమైనదేమీ వుండదు. ఆనందరావుకు శ్రీహరిమీద ద్వేషమూ, దీప్తిపై కసీ ఏర్పడి ఉంటాయి. అన్న ఎదుట చెల్లెలికి మానభంగం. అదే శ్రీహరిని సగానికి సగం చంపేస్తుంది. ఆ మిగతా సగం కూడా ఆనందరావే చూసుకుంటాడు....'' అన్నాడు నగర ప్రముఖుడు.

"మనిషి చచ్చి బ్రతకడమా?'' అన్నాడు శోధన్ ఆశ్చ ర్యంగా.

"ఇందులో ఆశ్చర్యమేమీలేదు. విదేశాల్లో మరణ వాఙ్మూలమివ్వకుండా పోయిన వాళ్ళనూ, విల్లు వ్రాయని వాళ్ళనూ ఈ విధంగా బ్రతికించడానికి కొన్ని ప్రయత్నాలు జయప్రదంగా జరిగాయి. మన డాక్టరు వాళ్ళకంటే ఓ మెట్టు పైకి వెళ్ళాడు. అక్కడ మనిషికి మాట్లాడగలగడం మాత్రమే జరుగుతుంది. ఇక్కడ మనిషి నార్మల్‌గా లేచి తిరుగుతాడు. ఎటొచ్చీ రెండు గంటలకు మించి బ్రతకడు. కనీసం గంటైనా బ్రతికి తీరుతాడు....'' అన్నాడు నగర ప్రముఖుడు.

5

"నువ్వు చచ్చి బ్రతికావు. .'' అన్నాడు శోధన్. ఆనంద రావులో తిరిగి చలనం రావడమూ, అతడు కళ్ళు తెరవ డమూ శోధన్ కాశ్చర్యంగావుంది. ఎందుకంటే సరిగ్గా అర గంటకు ముందు—నగర ప్రముఖుడు పంపిన ఓ గొప్ప

డాక్టరు అతడు మరణించినట్లు ధృవపరిచి పోలీసులకు ఫిర్యాదు చేయమని చెప్పి వెళ్లాడు. ఆ విధంగా ఆయన కాగితం రాపిచ్చాడు కూడా.

డాక్టరు రంగారావు ఇంజక్షన్ చేసి—"సరిగ్గా అర గంటలో ఇతడి శరీరంలో చలనం పుడుతుంది—" అనేసి వెళ్ళిపోయాడు.

సరిగ్గా అలాగే జరిగింది.

జరిగినదంతా విని ఆనందరావు కూడా ఆశ్చర్యపడ్డాడు.

"చూడు — నీ కిప్పుడు ఎదురులేదు. ప్రపంచమంటే భయంలేదు. అవునా?" అన్నాడు శోధన్.

"అవును...." అన్నాడు ఆనందరావు ఉత్సాహంగా.

"ఈ పిస్టల్ దగ్గరుంచుకో. శ్రీహరి, దీప్తి—వాళ్ళిద్దర్నీ నువ్వేం చేయాలనుకుంటే అది చేయి. నీ జీవిత లక్ష్యం నెరవేర్చుకో. ఆ తృప్తితో హాయిగా కళ్ళు మూస్తావు. అది నీ అదృష్టం...."

"నాకేమిటోలావుంది. చాలా ఉత్సాహంగావుంది. కొత్త జీవితం నాలో సంతోషాన్ని నింపుతోంది శోధన్....నీకు చాలా చాలా థాంక్స్!" అన్నాడు ఆనందరావు.

"అవన్నీ తర్వాత....ఇప్పుడు ప్రతిక్షణమూ నీ కెంతో విలువైనది. ఈ విలువైన క్షణాలను థాంక్స్ చెప్పడానికీ, కులాసా కబుర్లకూ వృథాచేయకు. వెళ్ళు నీ జీవిత లక్ష్యం నెరవేర్చుకో...." అన్నాడు శోధన్.

"అవును. నా ముందున్నవి విలువైన క్షణాలు. ఒక్కటి కూడా వృథా చేసుకోకూడదు...." అన్నాడు ఆనందరావు. అతడి కనులలో దృఢనిశ్చయం కనబడుతోంది.

ఆనందరావు బయల్దేరగానే శోధన్ పోలీస్ స్టేషనుకు

వెళ్ళాడు. ఆనందరావు ఆత్మహత్య చేసుకున్న విషయ మతడు పోలీస్‌స్టేషన్లో రిపోర్టు చేయవలసివుంది.

6

దీప్తి నెమ్మదిగా —"అతడు మళ్ళీ మనింటికిరాడు...." అంది.

"అలాగని నే ననుకోను. మనుషుల్లో మంచితనముండి తీరాలన్నది నా నమ్మకం. ఆనందరావు స్వతహాగా దుర్మార్గుడు కాదు. ఇతరుల ప్రభావం, తన దురాశా—అతడినీ విధంగా మార్చాయి. ఏదో ఒక రోజున అతడు పశ్చాత్తాప పడతాడు. అప్పుడు మనదగ్గరకు వస్తాడు...." అన్నాడు శ్రీహరి.

అతడింకా ఏదో అనాల్సిందే....ఈలోగా ఎవరో తలుపు తట్టారు.

దీప్తివెళ్ళి తలుపుతీసి—"మీరా?" అంది.

ఆనందరావు జేబులోంచి పిస్టల్‌తీసి—"నీకు తెలిసిన ఆనందరావు చచ్చిపోయాడు. నువ్వు చూస్తున్నవాడు కొత్త ఆనందరావు. లోపలికినడు...." అన్నాడు.

అతడు తలుపులు మూసేసరికి శ్రీహరి అక్కడకు వచ్చాడు. ఆనందరావు చేతిలోని పిస్టల్ చూసి—"ఏమిటి దంతా" అన్నాడు.

ఆనందరావు క్లుప్తంగా తనెలా చనిపోయాడో, ఎలా బ్రతికాడో చెప్పి—"నే నిప్పుడెవరికీ భయపడను. నన్నెవ్వరూ ఏమీ చేయలేరు. ఏం కావాలంటే అది సాధించ గలను. అయితే నాకున్న సమయం బహుకొద్ది. ఇప్పుడు నాకు మిగిలిన ప్రతిక్షణమూ విలువైనది. అవి ఉపయోగించుకోవాలని వచ్చాను...." అన్నాడు.

"దీప్తికి మానభంగం నీకు ప్రాణభంగం—ఇందుకే

నేను బ్రతికింది....” మళ్ళీ అన్నా డానందరావదోలా నవ్వుతూ.

ఆ అన్నా చెల్లెళ్ళిద్దరికీ నోటమాట రాలేదు. వాళ్ళిద్దరూ అతడినీ అతడి చేతిలోని పిస్టల్‌నూ భయం భయంగా చూడ సాగారు. అతడి మాటలు నిజమని వారు నమ్మలేదు.

“ప్లీజ్ అలా చూడవద్దు....” అన్నాడు ఆనందరావు— “దీప్తి చేతిలోని పరాభవం నాలో పరివర్తన తీసుకొచ్చింది. మీ అన్నా చెల్లెళ్ళిద్దరూ భగవత్స్వరూపులు. మీ ముందు భగవంతుడికి కూడా ఓటమి తప్పదు నేనోడిపోయానంటే ఆశ్చర్యంలేదు. కానీ మీ యిద్దరికాళ్ళమీదా పడి క్షమార్పణ వేడుకోవాలన్న కోరిక నాలో మిగిలిపోయింది. అయితే మిమ్మల్ని కలుసుకునే ధైర్యం చేయలేకపోయాను. బ్రతి కుండగా నా కోరిక తీరదనుకున్నాను. కానీ నా కోరిక తీరడం కోసమే మళ్ళీ బ్రతికినట్లున్నాను. నన్ను తప్పు దారిన నడిపించిన శోధన్‌ని అంతంచేయాలన్న ఆవేశం కూడా నాకు తిరిగి బ్రతగ్గానే కలిగింది. కానీ నాకు మిగిలిన విలువైన క్షణాలు కొత్తనేరం చేయడానికికాక—పాత నేరాలకు ప్రాయశ్చిత్తం చేసుకుందు కుపయోగించాలనుకుని మీ దగ్గరకు వచ్చాను....”

ఆనందరావు పిస్టల్ విసిరేసి శ్రీహరి కాళ్ళమీదపడ్డాడు. అతడు బ్రాన్పడి చూస్తూండగా లేచి తిరిగి దీప్తి కాళ్ళ మీద పడ్డాడు.

ఆ తర్వాత అతడు మరి లేవలేదు.

ఆనందరావు చనిపోయాడని అర్థం కావడానికి వారిద్దరికీ ఎంతోసేపు పట్టలేదు. ఇద్దరికిద్దరూ ఉన్నపళంగా పోలీస్ స్టేషన్‌కు పరుగెత్తారు....

జరిగిన విశేషం వార్తాపత్రికల్లో మొదటి పేజీల

కెక్కింది. ఆ సంచలనవార్త గురించి మనకనవసరం. ఈ సంఘటన గురించి శ్రీహరి చెల్లెలితో—"జీవితంలో ప్రతి క్షణం విలువైనది. తెలియనివాడవి వృధా చేసుకుంటాడు. ఆనందరావు జీవితంలోనూ అంతే జరిగింది. జీవితంలో అతడు—చచ్చి బ్రతికిన ఆ కాసిని క్షణాలను మాత్రమే సక్రమంగా ఉపయోగించుకో గలిగాడు. ఎవరికే క్షణంలో చావు రాసిపెట్టి ఉందో తెలియదు. అందుకని ఆనందరావు కథను మనం హెచ్చరికగా తీసుకుని—ప్రతిక్షణాన్నీ అపురూపంగా చూసుకుంటూ సక్రమంగా ఉపయోగించుకోవాలి." అని చెప్పిన విశేషాన్ని మాత్రం—మన మందరం హెచ్చరికగా తీసుకోవలసి ఉంటుంది. □

పరిచయస్తులు !



ఈనాటి దొంగలు

సరసి

సింహద్వారం వద్ద తచ్చాడుతూ నిలబడ్డ ఉమాపతి ఓసారి అటూ ఇటూ చూపి జేబులోంచి రుమాలుతీసి మొహం తుడుచుకున్నాడు.

ఆ సంకేతాన్నందుకున్న రామారావు నిశ్శబ్దంగా అడుగులో అడుగేసుకుంటూ ముందుకెళ్ళి తనముందు నిల్చున్న ఓ వ్యక్తి నోరు హఠాత్తుగా మూపి పట్టుకున్నాడు వెనక నించి. ఆ దగ్గరలోనే సిదంగా నిలబడ్డ శ్రీరాం శశి

కుమార్‌లు అరక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా ఒక్క ఉదటున ముందుకు దూకి అదణ్ణి ఒడిసిపట్టుకుని చీకటిలోకి లాక్కుపోయారు.

అసలే అర్భకుడు. పైగా వృద్ధుడు!

మెడ నరంమీద పడిన బలమైన రామారావు కరాటే దెబ్బకి గింజుకోవడం మానేసి తల పక్కకి వాల్చేశాడు! అతడి భుజానికి వేలాడుతున్న వీడియో కెమేరాని మెల్లగా తీసి భుజానికి తగిలించుకున్నాడు శ్రీరాం. ఈలోగా దెబ్బ తిన్న వ్యక్తిని జాగ్రత్తగా నేలమీద పడుకోబెట్టి ముక్కు దగ్గిర వేలుపెట్టి పరీక్షించాడు శశికుమార్.

"చచ్చిపోలేదు కదా సన్నాసి?"

"ఛస్తే చావడు! నీకా భయమక్కర్లేదు" అన్నాడు రామారావు చెమటలు తుడుచుకుంటూ.

శశికుమార్ జేబులోంచి రుమాలుతీసి ముసలాడి నోట్లో కుక్కడం చూసి చిరాగ్గా అన్నాడు రామారావు.

"ఎందుకదీ?"

"అరవకుండానూ! చేతులూ కాళ్ళూ కూడా కట్టి పడేద్దాం ఒకవేళ ఇప్పట్లో స్పృహవచ్చినా కదలకుండా!"

"అటువంటి పిచ్చిపనులు చెయ్యకు! మనం ఇక్కడ్నించి పోయేవరకూ వాడు కదలకూడదు—అంతే! నోరు దగ్గిర్నించి పూర్తిగా కట్టిపడేస్తే ఈ చీకట్లో ఎన్నాళ్ళయినా ఇలానే పడుంటాడు. ఆ తర్వాత 'హరీ' మన్నాడంటే హత్యానేరం కూడా పడుతుంది మన నెత్తిమీద. రా త్వరగా కర్చీఫ్ తీసుకుని! లేకపోతే చివరికి ఆ జేబు రుమాలే ఆధారం అవుతుంది పోలీసులకి! వీ డెలాగూ

రెండు మూడు గంటలదాకా లేవడు! ఈలోగా మనం జారుకోవాలి! రండి పోదాం! క్విక్!!”

* * *

ఉమాపతీ, శ్రీరాం, రామారావు, శశికుమార్—నలుగురూ పెంటపాడు కాలేజీ స్టూడెంట్స్.

క్రిస్మస్ సెలవులు ఎంజాయ్‌చేసే నిమిత్తం సరదాగా అజంతా, ఎల్లోరా, బొంబే, అగ్రా, ఢిల్లీ చుట్టబెట్టి రావాలని బయల్దేరి మొట్టమొదట ఔరంగాబాద్‌లో దిగి అక్కడి నించి బస్సుమీద ఎల్లోరా చేరుకున్నారు.

అజంతా ఎల్లోరాలకు దగ్గరున్న పట్నం ఔరంగాబాద్. సందర్శకులంతా అక్కడే మకాంవేసి అజంతా ఎల్లోరాలు చూసొస్తారు సాధారణంగా.

ఎల్లోరా శిల్పసంపద నిజంగా హృద్యంగమం!

ఒక్కో గుహే ఒక బ్రహ్మాండమైన గది. అందులో ఉన్నత ప్రమాణంలో—అంటే సుమారు తాడిచెట్టంత ఎత్తులో బుద్ధభగవానుడి సుందర శిల్పం. ఒక్కొక్క గుహలో ఒక్కొక్క భంగిమ. ఆ శిల్పాలు మలచిన తీరు ప్రతి యాత్రికుని గుండెనూ దోచుకునే విధంగా ఉంటుంది.

విచారించవలసిన విషయం ఏమిటంటే ఆ శిల్ప సౌందర్యాన్ని ఆమూలాగ్రంగా వీక్షించే అదృష్టం యాత్రీకులకి లేకపోవడమే! కారణం—ఆ గుహలన్నీ అంధకార బంధురం! కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి!!

స్వదేశీయులనే కాక విదేశీ యాత్రీకులని సైతం అమితంగా ఆకర్షించి విశేషంగా విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న ఆ కళాఖండాలని తనివితీరా చూసుకునే భాగ్యం కల్పించేందుకు ఎల్లవేళలా విద్యుద్దీపాలు వెలిగించి ఉంచే

ఏర్పాటు చేయకపోవడం నిజంగా శోచనీయం! ఐదో పదో చెల్లించినవారికోసం మాత్రమే కొద్దిసేపు దీపాలు వెలిగించి మిగతా సమయంలో 'కరెంటు దండగ' అని లైట్లువేయడం లేదని యాత్రీకులంతా నిరుత్సాహంగా చెప్పుకుంటున్నారు.

గుంపులు గుంపులుగా విడివిడిగా ఎవరికి వారు ఒక్కొక్క గుహలోకీపోయి మసక వెల్తురులో కనిపించింది చూసి తిరిగివస్తున్నారు యాత్రీకులంతా.

తోటివాళ్ళంతా ఆ శిల్ప సంపదను కొనియాడుతోంటే శ్రీరాం మనసు మాత్రం వేరేచోట లగ్నమై ఉంది. అతని హృదయాన్ని దోచుకున్నది—ఓ విదేశీ యాత్రికుడి భుజానికి వేలాడుతున్న ఓ వీడియో కెమేరా!!

చిన్నప్పట్నించీ అతనికి ఫొటోగ్రఫీమీద మక్కువెక్కువ. డబ్బున్నప్పుడల్లా క్లిక్ త్రీ కెమేరాతో లెక్కలేనన్ని ఫొటోలు తీసేవాడు. కలర్ ఫొటోలంటే ఇంక చెప్పక్కర్లేదు పడి చచ్చిపోతాడు. ఫ్లాష్ ఎరేంజ్మెంట్ ఉన్న ఓ చిన్న విదేశీ కెమేరాని అతని చేతిలో పెట్టి 'రాక్షసి బొగ్గు కలర్'లో ఉన్న ఓ గున్న ఏనుగు సైజు కన్యకామణిని చూపించి చేసుకోమంటే మారుపలక్కుండా పుస్తె కట్టేస్తాడు. ఫొటోగ్రఫీ అంటే అంత పిచ్చి అతనికి.

రామారావు పక్కకి చేరి మెల్లగా అన్నాడు శ్రీరాం.

"ఈ గుహలు చూడు ఎంత చీకటిగా భయంకరంగా ఉన్నాయో! ఇక్కడ ఏం చేసినా పక్కవాడిక్కూడా తెలియదు. అవునా? నాకైతే ఇప్పుడేమనిపిస్తోందో తెల్సా?"

"నాకు తెల్సులే నీ కేమనిపిస్తోందో! ఇదే మన కాలేజీ అమ్మాయిల్తో ఎక్స్‌కర్షన్‌కి వచ్చుంటే చక్కగా ఈ చీకటిని సద్వినియోగ పరుచుకునేవాడివి! అవునా?" అన్నాడు రామారావు.

"నిజమేరోయ్! బ్రహ్మాండమైన అయిడియా! కాని ప్రస్తుతం నేను ఆలోచించేది మాత్రం అదికాదురా."

"చెప్పేడువ్ త్వరగా! వాళ్ళంతా పోతున్నారు ముందు"

"మరి నువ్వు నాకో సహాయం చేస్తానంటే చెబుతా, కాదనకూడదు. పని చాలా సింపుల్!"

"ఒరే! రోజూ అడిగినప్పుడల్లా సిగరెట్టిచ్చేవాడివి, నువ్వడిగితే కాదంటానా? ఏమిటి చెప్పు!"

"ఆ ముసలాడ్ని చూశావా ఎలా ఉన్నాడో ఎండు నక్కలాగా! ఊ త్తే పడిపోయేలావున్నాడు. పైగా ఏ క్షణంలోనైనా ప్రాణా లొదిలేసేలాగా వున్నాడు. ఎక్కడ లేని ఓపికా తెచ్చేసుకుని ఇక్కడేదో పెద్ద పడిపోతున్నట్టు వాళ్ళ దేశంనించి ఇండియాకి పరిగెట్టుకొచ్చేశాడు పోటు గాడిలాగా."

అయోమయంగా చూశాడు రామారావు.

"వాడి దగ్గరున్న వీడియో కెమేరా చూశావా ఎంత ముద్దొస్తోందో! పది పన్నెండువేలన్నా పోస్తేగాని అది దొరుకుతుందంటావా? అరగంటనించి చూస్తున్నాదాన్ని. అది నా స్వంతం కాకపోతే ఈ బ్రతుకెందుకూ అనిపిస్తోంది. ఒరే బ్రదర్! ఎలాగైనా అది నాకు దక్కేట్టు చెయ్యరా!" ప్రాధేయపూర్వకంగా అడిగేడు శ్రీరాం.

రామారావు కర్థమయిం దిప్పుడు

"అంటే నీ వుద్దేశ్యం - వీణ్ణి చడీ చప్పుడు కాకుండా చీకట్లో 'సఫా' చేసేసి. దాన్ని నీ చేతుల్లో పెట్టాలంటావ్!"

" 'సఫా' చెయక్కర్లేదురా! వాణ్ణి బెదిరించో లేకపోతే కొద్దిసేపు కిక్కురుమనకుండా ఉండేలా ఓ 'హస్తం మార్కు బిస్కెట్టిచ్చో అది కొట్టెయ్యాలి! పరాయిదేశం వాడు కదా వాడి ఏడుపెక్కడ ఎవరి కర్థమవుతుంది

కనక!"

"అదేం పెద్ద బ్రహ్మవిద్య కాదనుకో. అయినా మన వాళ్ళతో కూడా సంప్రదించాలిగా! కెమేరా విలువైంది కదా. నా సంగతొదిలెయ్. మరా వెధవలకి ఏదో కొంత ముట్టజెబితేగాని మనకి సహకరించరు. పైగా పిరికిమందు నూరిపోస్తారు. ఎ ఫ్రెండిన్నీడ్ ఈజె ఫ్రెండిండీడ్! అని చెప్పినా వీళ్ళ చెవికెక్కి ఏడవదు కదా!"

"మనూరెళ్ళాక చెరో అయిదు వందలూ పడేస్తామందాం. ఏం?"

"నాకేం అభ్యంతరం లేదు."

రామారావు ఉమాపతినీ, శశికుమార్నీ పిలిచి విషయమంతా వివరించి చెప్పేడు. ఒకళ్ళు వునన్నారు. మరొకరు కాదన్నారు. కొంప మునుగుతుందన్నారు. చివరి కెలాగో 'సరే' అన్నారు డబ్బుకక్కుర్తిపడి.

ఆ పథకంలో భాగంగానే ఆ ముసలాడిపై దాడిచేసి కెమేరా స్వాధీనం చేసుకున్నారు.

అతడొక అమెరికన్. అరవయ్యోపడిలో పడ్డాడు. ఒంటరిగా వచ్చాడు ఎల్లోరాకి. పెళ్ళాం పిల్లల్ని ఔరంగాబాద్ లోనో అమెరికాలోనో వదిలేసి వచ్చుండాలి.

ఎవరూ రావడంలేదని ఉమాపతిచ్చిన సంకేతాన్ని అందుకుని ముసలాణ్ణి కిక్కురు మనకుండాచేసి అతని వద్దనుంచి కెమేరా లాక్కున్నారు స్నేహ్న చతుష్టయం.

అరుద్దామనుకున్నాడు—సాధ్యం కాలేదు. గింజుకున్నాడు. ప్రయోజనం లేకపోయింది. కనీసం వాళ్ళెవరో పరీక్షగా చూద్దామనుకున్నాడు. వీలు కాలేదు. అంతా అంధకార బంధురం! అగమ్యగోచరం!!

చిమ్మ చీకటి చోరకళకీ, మసక చీకటి మదనకేళికీ శ్రేష్ఠమైన సమయాలు కదా!

2

అది ఔరంగాబాద్‌లో హోటల్ 'చైతన్యం'లో ఒక రూమ్.

"ఒరే శ్రీరాం నీ కెమేరా కాదు గానీ అజంతా చిత్రాలు చూసే అదృష్టం లేకుండా చేశావ్ గదరా!" ఉమాపతి బాధపడ్డాడు.

"నిజవేరా నాకూ బాధగానే వుంది. ఏం చేస్తాం చెప్పు! మనం ఎల్లోరానించి అజంతాకి కూడా వెళ్ళామనుకో. ఈలోగా ముసలి పీనుక్కి స్పృహొచ్చి ఏ పోలీస్ రిపోర్టన్నా ఇస్తే మనం దొరికిపోవడం ఖాయం. ఈ కెమేరా మనది కావాలిగానీ మిమ్మల్నందర్నీ మరోసారి సావకాశంగా అజంతాకి తీసుకురాకపోతానా నా ఖర్చుమీద!" అన్నాడు శ్రీరాం.

ఇంతలో హడావుడిగా ఆయాసపడుతూ వచ్చాడు శశి.

"ఒరే మనం భయపడినంతా అయ్యింది! పోలీసులు మనకోసం వెతుకుతున్నారు. బస్టాండు దగ్గరున్న కిళ్ళీబడ్డీ దగ్గర సిగరెట్లు కొంటూ చూశాను. అక్కడ బస్సెక్కే ప్రతి ప్రయాణీకుడి సామానూ సోదా చేస్తున్నారు పోలీసులు."

రాజు గుండె దడదడా కొట్టుకోవడం ప్రారంభించింది.

"అందరి సామాన్లూ సోదా చేస్తున్నారా? అంటే ముసలి పీనుగ మన గురించి సరైన సమాచారం ఇవ్వలేకపోయాడన్నమాట పోలీసులకి. 'కుర్రకారు' అని స్పష్టంగా వాడు చెప్పివుంటే పోలీసులు ముఖ్యంగా మన వయసువాళ్ళనే అనుమానిస్తారు. అలాక్కాకుండా ఆడా మగా అందరి

బుట్టల్లోనూ చేతులు పెడుతున్నారంటే ఎల్లోరాలో ముస లాడు మనల్ని పరిశీలనగా చూడలేదన్న మాట. వాడికి కళారాధనమీదున్న ఏకాగ్రతకి జోహార్లు! గుడ్డిలో మెల్ల లాగా కొంతవరకూ మనం అదృష్టవంతులం!!" అన్నాడు రామారావు.

"రాత్రి తొమ్మిదింటికి సికిందరాబాద్ మన్మాడ్ పాసింజ రుంది. అంటే ఇంకా మూడు గంట లుంది. ఈలోగా మనం పోలీసుల కళ్ళబడకుండా ఇక్కడ్నించి తప్పించు కునే మార్గం గురించి ఆలోచించాలి. బస్‌స్టాండ్‌లో సోదా చేసిన పోలీసులు రైల్వేస్టేషన్ వొదిలిపెట్టరు కదా!" అని శ్రీరాం అనగానే ఉమాపతి వేరే సలహా యిచ్చాడు.

"నిజమే అనుకో. మనం ఈ వూళ్ళోనే మరో రెండు రోజులు మకాంవేస్తే ఈలోపు పోలీసుల హడావుడీ తగ్గు తుంది. మనం అజంతా కూడా చూసినట్టూ అవుతుంది?"

"అదీ పాయింటే. ..కానీ ఒకవేళ పోలీసులు హోటళ్లు కూడా సోదా చెయ్యడం ప్రారంభిస్తే రిస్కులో పడిపోతాం. అంతగా అయితే దానిక్కూడా ఓ ఉపాయం వుందనుకో. పోలీసులు యింతకుముందే సోదా చేసిన హోటల్‌కి మన మకాం మార్చెయ్యడమే. కానీ....మన అదృష్టం గుడ్డి దయితే వాళ్ళు ముందు మన హోటల్నించే చెక్ చెయ్యడం ప్రారంభించవచ్చు. కాబట్టి ఈ వూళ్ళో మరి వుండడం మంచి పద్ధతికాదు. అదీగాక ముసలాడు ఏ అజంతాలోనో మన్ని చూసి గుర్తుపట్టేడంటే యిక యింతే సంగతులు! కాబట్టి తక్షణమే యిక్కడినుంచి బిచాణా ఎత్తివేయడం బుద్ధికి లక్షణం" అన్నాడు రామారావు కన్యాశుల్కంలో గిరీశంలా.

"ఇంచక్కా మనకి వూళ్ళోఎవరైనా ఫ్రెండ్స్‌గానీ

చుట్టాలుగానీ వుంటే బావుణ్ను. వాళ్ళింట్లో కెమేరా దాచి పెట్టమనిచ్చేసి హాయిగా తర్వా తెప్పుడో వొచ్చి పట్టికెళ్ళే వాళ్ళం. ఏరా మీ రెవరికైనా చుట్టాలుగానీ ఫ్రెండ్సగానీ వున్నారా ఈ వూళ్ళో?"

"ఒరేయ్ వెధవ జోకు లెయ్యకురా సీరియస్‌గా డిస్కస్ చేస్తోంటే." శ్రీరాం కసురుకునేసరికి నోరు మూసేసుకున్నాడు శశి.

"ప్రస్తుతం మనం మహారాష్ట్రంలో ఉన్నాం. ఇక్కడ పుట్టిన మహానుభావుడు ఛత్రపతి శివాజీ ఏం చేశాడో తెల్సా ఓ సారి? తినుబండారాల గంపలో దాక్కుని జైలునుంచి తప్పించుకు పారిపోయాడు? ఆ టెక్నిక్ మనం కూడా వాడుకుంటే సరి! మరమరాలో వేరుశనక్కాయలో పోసు కునే 'జంగిడీ'—అదే—బుట్ట ఒకటి సంపాదించి దాని అడుగు భాగంలో కెమేరాని పెట్టేద్దాం.

నిండుగా వేరుశనక్కాయలు పోసేసి మనలో ఒకడు వాటిని అమ్ముకునే వాడిలాగా నటిస్తూ మనతోబాటు రైల్లో వచ్చేస్తాడు. ప్రయాణీకుల్ని సోదా చేస్తారుగానీ వేరుశన క్కాయ అమ్ముకునే కూలీగాణ్ణి అనుమానించరు కదా! అలా ఈవూరు దాటేశామంటే మరి బెంగలేదు! ఇంతకీ పోలీసులకి కూడా అనుమానం రాకుండా చక్కగా నటించ గలిగేవాడు ఎవడు మనలో? నల్లగా వున్నవాళ్ళకి ప్రిఫ రెన్స్" అంటూ కొంటెగా చూశాడు రామారావు ఉమా పతి వంక.

"ఒరే ఛంపేస్తా(న్రోయ్! నాది సాణ్యమైన నలుపు!" ఉమాపతి గర్వంగా ఫోజు పెట్టాడు.

"గుడ్ అయిడియా!" రామారావు అయిడియాని మెచ్చు

కున్నాడు శ్రీరాం.

"బానే వుంది కానీ ఓ చిన్న ఎమెండుమెంట్! మనం నటించాల్సిన ఖర్మేవిటీ? నిజంగా వేరుశనక్కాయలమ్ముకునే సన్నాసిగాణ్ణి ఎవణ్ణో బేరమాడి తీసుకెళ్ళి రెండు మూడు స్టేషన్ల తర్వాత వొదిలేస్తే పోయె!" అన్నాడు శశి.

3

శ్రీరాం, ఉమాపతి, శశికుమార్లు ముగ్గురూ లగేజీ చేత్తో పట్టుకుని నడుస్తున్నారు స్టేషన్లో.

ఇరవై అడుగుల దూరంలో వాళ్ళతో సంబంధం లేనట్టు నడుస్తున్నాడొక వేరుశనక్కాయ అమ్ముకునే వ్యక్తి బుట్ట పట్టుకుని. అతడో అవిటివాడు. ఎడమచెయ్యి సగం లేదు. అతడికి పది అడుగుల వెనక రామారావు వస్తున్నాడు అతణ్ణి కాపలాకాస్తూ.

చూసేవాళ్ళెవరికీ 'వాళ్ళంతా ఒకటే' అన్న అనుమానం ఏమాత్రం కలక్కుండా ఉండాలని యెవరిపరిధిలో వాళ్ళు మహానటుల్లా వ్యవహరిస్తున్నారు.

ఊళ్ళో యెక్కడో వేరుశనక్కాయలమ్ముకునే 'పన్నాలాల్' అనే మనిషిని తీసుకొచ్చి యాభై రూపాయలకు బేరమాడేరు. వాడు చూడకుండా న్యూస్ పేపర్లతో చుట్టేసిన కెమేరాని వాడి బుట్ట అడుగున పెట్టి కనబడకుండా పైన వేరుశనక్కాయలు సర్దేసి వాడెప్పుడెలాగ ప్రవర్తించాలో క్షుణ్ణంగా ఉపదేశించారు.

పైగా వాడికి తాము మఫ్టీలో వున్న 'పోలీసు'ల మనీ ఓ హత్యకేసు దర్యాప్తు కోసం ఈ వూరు వచ్చినట్టూ 'మంచిగుంటు' పామాను కొంత స్వాధీనం చేసుకుని రహస్యంగా వెంట తీసికెడుతున్నామనీ ఏమాత్రం తేడాగా ప్రవర్తించినా పీకలదాకా వస్తుందనీ బెదిరించాడు రామా

రావు.

అలా చెప్పడం వల్ల రెండులాభాలు. ఒకటి—దొంగ వస్తువు ఏదో పట్టుకెడుతున్నట్టు అనుమానం రాదు. రెండు-విలువైన వస్తువు ఏదో వుందనుకుని బుట్ట పట్టుకుని పారిపోయే పిచ్చిపిచ్చి పనులేవీ చెయ్యడు.

"ఒకవేళ పోలీసులు యెందుకైనా ప్రయాణీకులందర్నీ సోదా చేస్తే పోలీసుల మయినప్పటికీ మమ్మల్ని సోదా చేస్తారు. ఎందుకంటే ప్లాట్ ఫారం మీదున్న మిగతా ప్రయాణీకులందరికీ మేము మామూలు ప్రయాణీకుల్లాగానే కనిపించాలి గానీ పోలీసులమని తెలియకూడదు. కాబట్టి అలాంటప్పుడు నువ్వేమీ భయపడనక్కర్లేదు. కొంచెం దూరంలో మాతో సంబంధం లేనట్లుండు" అని జాగ్రత్తలన్నీ నూరిపోశారతనికి.

స్టేషన్ చేరుకున్నారు.

బండి రావడానికి కింకా పావుగంట టైముంది.

కోలాహలంగా వుంది ప్లాట్ఫారం అంతా. కొందరు ప్రయాణీకులు అటూ ఇటూ పరుగులెడుతున్నారు లగేజీలు పట్టుకుని.

బండి వస్తున్నట్టు అనౌన్స్‌మెంట్ చేశారు.

తినుబండారాలమ్ముకునే కుర్రాళ్ళు, పుస్తకాలు, కూల్ డ్రింకు లమ్మేవాళ్ళూ 'రెడీ'గా నిలబడున్నారు.

ఇంతలో ఓ సర్దార్జీ పన్నాలాల్‌ని సమీపించి "ఓ అర్ధరూపాయి వేరుకనక్కాయలివ్వు" అన్నాడు జేబులో చిల్లర కోసం వెతుక్కుంటూ.

"ఇవి అమ్మకానిక్కాదు సార్!" అన్నాడు పన్నాలాల్ కొంచెం నిర్లక్ష్యంగా.

"మరెందుకిక్కడ పెట్టుకూర్చున్నావ్?"

"ఎందుకంటే నా ఇష్టం! అమ్మితే అమ్ముతాను లేక పోతే లేదు నువ్వెవడివి అడగడానికీ?"

"నే నెవడ్నా? చెప్తా! కిషన్ ఇలారా!" అని ఓ పోర్టర్ని పిలిచి "వీడు ఇక్కడివాడేనా? లైసెన్సుందా?" అని అడిగాడు వాడ్ని.

"లేదు సార్! మనోడు కాదు వీడు"

నలుగురైదుగురు పోర్టర్లు గుమిగూడేరక్కడ.

"ఏంటి సార్ ఏవయిందీ?" అన్నాడు రామారావు ఒక్క అంగలో అక్కడికి దూకి కొత్తవాడిలాగా.

గట్టిగా గదమాయిస్తూ ఓ పోర్టరు బుట్ట లాక్కో బోయాడు పన్నాలాల్‌నించి. గింజుకుంటున్నాడు పన్నాలాల్ బుట్ట వదలకుండా గట్టిగా పట్టుకుని.

"ఏంటయ్యా ఇదీ? మా అయ్య పోయాడని కబురొస్తే. 'లాసూర్'కి పోతున్నా! ఇదిగో టిక్కెట్టు. ఒక పక్క తండ్రి పోయి నేనేడుస్తూంటే లైసెన్సు లేకండా యాపారం చేస్తున్నానని పైగా మీ గొడవొకటా? స్టేషన్లో ఎవరికీ పదిపైసల శనక్కాయలు కూడా అమ్మిన పాపాన పోలేదు. ఇంతన్నాయం ఇంకెక్కడన్నా వుంటుందా?" అంటూ భుజంమీది తువ్వాలుతో కళ్ళు తుడుచుకున్నాడు పన్నాలాల్.

ఈ వ్యవహారం చెడిపోతే తనకి శ్రమపడకుండా వచ్చే ఆ యాభై రూపాయలూ ఎక్కడ పోతాయోనన్న బెంగ కలిగేసరికి నిజంగానే అతని కళ్ళల్లో నీళ్ళు చిమ్మేయి.

అక్కడ పోగయిన మనుషులందరూ సర్దార్జీని మెత్తగా చీవాట్లు వేసి వెళ్ళిపోయారు.

ఇదంతా చూస్తున్న స్నేహితులు నలుగురూ 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నారు పన్నాలాల్ నటనా

సామర్థ్యానికి మనసులోనే జోహార్లర్పిస్తూ.

అయిదు నిమిషాలు పైగా గడిచింది.

ఎప్పుడు రైలొస్తుందా ఎప్పుడు దాటిపోదామా—అని సెకండ్లు లెక్కపెడుతున్నారంతా.

"ఏయ్ మిస్టర్!" రైల్వే టైంటేబిల్ దీక్షగా చూస్తున్న ఉమాపతిని చేత్తో తట్టి పిలిచారెవరో వెనకనించి.

తలతిప్పి వెనక్కి చూసిన ఉమాపతి గుండెలు జారి పోయాయి.

ఓ సబిన్స్పెక్టరూ ఇద్దరు కానిస్టేబిల్స్ నిలబడున్నారు!!

"వేరార్యూ గోయింగ్ బాయిస్?"

అందరికాళ్ళూ వొణకడం ప్రారంభించాయి.

"బాంబేసర్! మన్మాడ్ నించి వేరే ట్రైన్ కాచ్ చెయ్యాలి!" హడావుడిలో అవసరమైన దానికంటే ఎక్కువ వివరణ ఇచ్చాడు ఉమాపతి.

"అజంతా ఎల్లోరాలు చూసుకునే వెడుతున్నారను కుంటా....యామై కరెక్ట్?" అందరి కళ్ళల్లోకీ తీక్షణంగా చూస్తూ అడిగేడు యస్సై.

"య....యస్ సార్!" అంటూ రామలింగేశ్వర స్వామికి అభిషేకం, ఆంజనేయస్వామికి తమలపాకు పూజ మొక్కుకున్నారు శ్రీరాం మనసులో.

"చూడండీ మేమొక కేస్ ఇన్వెస్టిగేట్ చేస్తున్నాం! మీ లగేజి చెక్ చెయ్యాలి."

"విత్ ప్లెషర్....తప్పకుండా"

అందరూ స్యూట్కేసులూ తెరిచారు. బ్యాగ్లు జిప్స్ తీశారు. కానిస్టేబిల్స్ ఇద్దరూ మొత్తం అన్నీ వెతికేరు చేతులు పెట్టి. గట్టిగా తగిలిన సామాన్లు బైటికి లాగి చూశారు.

ఈ సోదా జరుగుతున్న సమయంలో పన్నాలాల్ వేరు శనక్కాయల బుట్ట చేతికి తగిలించుకుని ఎవరో తెలిసున్న మనిషితో అతి సహజంగా ముచ్చటలాడుతున్నాడు కొంచెం దూరంలో.

ఇంతలో పెద్దగా చప్పుడు చేసుకుంటూ స్టేషన్లోకి రైలొచ్చి ఆగింది.

"థాంక్యూ ఫ్రెండ్స్! విష్యూ ఎ ప్లజంట్ జర్నీ" నలుగురికీ చేతులు కలిపి వెళ్ళిపోయాడు సబిన్స్పెక్టర్ కానిస్టేబిల్స్ని వెంటపెట్టుకుని.

అందరూ గాఢంగా నిట్టూర్చారు. గుండెల్లో తుఫాను వెలిసి నిర్మలంగా ఆనందం వెల్లివిరిసింది. ఒకరినొకరు కళ్ళతోనే పలకరించుకుని హుషారుగా రైలెక్కేరు పన్నాలాల్‌తో సహా.

బండి కదిలిన పది నిమిషాలదాకా శ్రీరాం మనసు కుదుట పడలేదు. అప్పటిగ్గానీ నమ్మకం కుదరలేదు పదిహేను వేల రూపాయల కెమేరాకి తాను అధిపతినని. కెమేరా స్వంత మయిందన్న భావన కలగ్గానే అతని మనస్సు సంతోషంతో ఉరకలు వేసింది.

4

అదృష్టవశాత్తూ కంపార్ట్‌మెంట్ రద్దీగా లేదు. అందరికీ కూర్చోడానికి చోటు దొరికింది.

కిటికీ దగ్గర ఓ ముప్పై ఏళ్ళావిడ 'ఫిల్మ్‌స్టార్' చదువు కుంటోంది.

రామారావు, పన్నాలాల్, శ్రీరాం కూర్చున్నాక ఆమె పక్కన మిగిలిన చోట్లో కూర్చోడానికి సంశయిస్తున్న ఉమాపతిని 'ఫరవాలేదు కూర్చోండి' అని సర్దుక్కూర్చుం దామె కిటికీ వారగా జరిగి.

ఆమె పక్కన కూర్చునే అదృష్టం నలుగురిలోనూ తనకే లభించినందుకు తనని తానే అభినందించుకున్నాడు ఉమాపతి

ఎదుటి బెంచీమీద శశికుమార్ కాక మరో వ్యక్తి కూర్చున్నాడు. ఆ ఇద్దరూ కాక మరో ప్రయాణీకుడు మూడంకె వేసి పడుకున్నాడు వారి పక్కనే.

ఇక పన్నాలాల్‌కి కెమేరా బుట్టమీద బాధ్యత, అధికారం పోయాయి. ప్రస్తుతం అది శ్రీరాం కాళ్ళకింద బెంచీ నీడలో వుంది.

బండి వేగం పుంజుకుంది మెల్లగా.

కుర్రవాళ్ళ గుండె దడదడ వేగం తగ్గింది క్రమంగా.

కానీ—బుట్టలో ఏదో విలువైన వస్తువొకటి వుందని ఊహించిన పన్నాలాల్, దానిని సంగ్రహించడానికి పథకాలు వేస్తున్నాడన్న సంగతి విజయోత్సాహంలో వున్న ఆ నలుగురిలో ఒక్కరుకూడా ఊహించలేకపోయారు.

బండి దౌలతాబాద్‌లో కొద్దిసేపాగి మళ్ళీ బయల్దేరింది.

మొదట్నించీ పన్నాలాల్‌కి అనుమానంగానే వుంది వీళ్లు పోలీసులు కారనీ, ఏదో వస్తువు రహస్యంగా పట్టుకెడుతున్నారనీనూ. తనకి యాభై రూపాయలిచ్చి తీసికెడుతున్నారంటే పైగా రైలు ఖర్చులుకూడా తామే భరిస్తున్నారంటే లోపలున్న వస్తువు తక్కువ ఖరీదుదై వుండదని ఊహించాడు. స్టేషన్లో పోలీసులు సోదా చేస్తున్నప్పుడు వారి అవస్థ చూసినప్పుడే నిర్ధారణ చేసుకున్నాడు వీళ్ళు మఫ్టీలో వున్న పోలీసులెంతమాత్రం కాదనీ.

పోలీసులు కానీ కాకపోనీ తనకొక్కవలసింది బుట్టలో వున్న వస్తువు మాత్రమే!

మొదట్నించీ ఒక్క క్షణంకూడా ఏమరుపాటు లేకుండా

వెన్నాడుతూ వచ్చాడు రామూరావు పన్నాలాల్‌ని. రైలు ఎక్కడానికి ముందు సాధ్యం కాని అతని ప్రయత్నం రైలెక్కాక మరింత క్లిష్టమయ్యింది. పైగా బుట్ట తన అధీనంలో కూడా లేదు. పోనీ ఏదైనా దుస్సాహసం చేసి కాజేద్దామన్నా జెమా జెట్టీల్లాగా వున్నారు నలుగురూ. దానికి తోడు అవిటివాడయిపోయాడు తను.

టాయిలెట్‌కి వెడుతున్నట్టు సంజ్ఞచేసి లేచి వెళ్ళాడు పన్నాలాల్.

కంపార్ట్‌మెంట్ చివరికి వెళ్ళి తనకి పనికొచ్చే వాళ్ళెవరైనా కనిపిస్తారేమోనని ఆత్రంగా చూశాడు.

తలుపు దగ్గిర చిరుగుల తువ్వాలు కప్పుకుని మాసిపోయిన గుడ్డలు కట్టుకుని కునికిపాట్లు పడుతున్న ఓ చింపిరి జుట్టు కుర్రాణ్ణి లేపి వాడితో ఏదో గుసగుసలాడేడు.

వాడొకసారి పన్నాలాల్‌ని ఎగాదిగా చూసి నమ్మకం కుదిరేక యిప్పుడే వస్తానని చెప్పి కిటికీ ఊచలు పట్టుకుని వేళ్ళాడుతూ పక్క కంపార్ట్‌మెంట్ వైపు వెళ్ళాడు చీకట్లోనే. అయిదు నిముషాల్లో మరొక వ్యక్తితో వచ్చి పన్నాలాల్‌కి పరిచయం చేశాడు.

అతడి పేరు 'అన్సారీ'. మాసిపోయిన కోటూ, పైజమా, మెడలో మఫ్లర్.

బీడీ వెలిగించి పన్నాలాల్ చెప్పిందంతా విన్నాడు.

వ్యవహారాన్ని 'పక్కా' చేసుకున్నాక జేబులన్నీ వెతికి నాలుగు మసిపర్సులు బైటికి తీశాడు అన్సారీ. వాటిలో ఉండే డబ్బంతా లెక్కపెడితే రెండువందల అరవై మూడు రూపాయలుంది. వందరూపాయలు తీసి పన్నాలాల్ చేతిలో పెట్టి ఇన్‌ఫర్మేషన్ యిచ్చిన కుర్రాడి చేతికి అయిదు

కాయితం అందించి 'చలో' అంటూ పన్నాలాల్‌ని అనుస రించాడు.

5

పాసింజర్ లాసూర్‌కి చేరేసరికి రాత్రి పదిదాటింది.

తిరుగు ప్రయాణం నిమిత్తం రామారావు నుంచి మరో అయిదురూపాయలు తీసుకుని సలాంకొట్టి దిగిపోయాడు పన్నాలాల్.

స్నేహితుల ఆధీనంలో వున్న వేరుశనక్కాయల బుట్ట పన్నాలాల్ వందరూపాయలకి అన్సారీకి అమ్మేసిన సంగతి మూడోకంటి వాడికక్కూడా తెలియదు. కానీ పన్నాలాల్ డ్యూటీ దిగిపోతూ అన్సారీని డ్యూటీకెక్కించిన సంగతి మాత్రం ఓ రెండు కళ్లు గమనించాయి.

బండి వేగంగా పోతోంది. కంపార్ట్‌మెంట్ దాదాపు అంతా నిద్రాదేవి విసిరిన వల కింద పడిపోయింది.

ఎందుకో తృళ్ళిపడి లేచిన శ్రీరాం ఒళ్లు తెలియకుండా నిద్రపోయినందుకు ఆత్మనిందకు పాల్పడి బుట్టని చూసు కున్నాడు. క్షేమంగానే వుంది కాళ్ళదగ్గర.

కళ్ళు మూసుకునే వున్నా నిద్రపోవడం లేదు రామా రావు.

ఇక ఉమాపతి పరిస్థితి — తన పక్కనున్నావిడ ఒడిలో ఒదలు మరిచి నిద్రపోతున్నాడు చూసేవారికి వారిద్దరూ ఆదర్శ దంపతులనిపించేలాగా. ఆమెకూడా అతనికి అను కూలమైన భంగిమలో కూర్చుని తల వెనక్కి వాల్చి ఒక చెయ్యి ఉమాపతి గుండెలమీద వేసి గ్రీకు శిల్పంలా నిద్ర పోతోంది.

శశికుమార్ తన పక్కనున్న జంటిల్మన్‌తో రాజ కీయాలు మాట్లాడుతున్నాడు ధారావాహికంగా.

వేరే కిటికీ దగ్గర సింగల్ సీటులో కూర్చున్న అన్సారీకి మనసు ఏమాత్రం స్థిమితంగా లేదు. నిద్రపోతున్నట్టూ మధ్యలో మెళకువ వచ్చినట్టూ మళ్ళీ నిద్రకుపక్రమిస్తున్నట్టూ నటిస్తున్నాడు.

'బుట్ట నీ స్వంతం అయ్యేదాకా నీకు మనశ్శాంతి లేదు'-అని అతడి అంతరాత్మ పదేపదే హెచ్చరిస్తోంది.

'పార్వోడా' స్టేషన్ దాటింది. అక్కడ బండి ఆగదు. తర్వాతి హాల్ట్ 'రోహెగాంవ్' చేరడానికింకా సుమారు ఇరవై నిమిషాలు పట్టొచ్చు. అంటే తన ప్రయత్నం ఫలించడానికి ఇరవై నిమిషాలుంది—అనుకుని మరోసారి బుట్టకేసి చూశాడు. సులభంగా పట్టుకోవడాన్కి బుట్టకి వంచిన వెదురుబద్ద వుంది. బయటపడడానికి పదిహేనడుగుల దూరంలో తలుపుంది.

లేచివెళ్ళి తలుపుతీసి బైటకి చూస్తూ నిలబడ్డాడు.

'రోహెగాంవ్' స్టేషన్లో బండి ఆగగానే తలుపుతీసి వుంచి వచ్చి తన సీట్లో కూర్చున్నాడు.

తన అదృష్టం బాగుంది. రామారావు లేచివెళ్ళి అవతలి వైపు కిటికీలోంచి బైటకు తొంగి చూస్తున్నాడు.

బండి మెల్లగా కదిలింది.

శ్రీరాం రామారావు వైపు తలతిప్పి కొంచెం ఏమరుపాటుగా వున్నాడు.

అదే అదను అనుకున్నాడు అన్సారీ.

కనురెప్ప పాటులో ఒక్క దూకు దూకి బుట్టని చేజిక్కించుకుని మెరుపులా బైటికి దూకేసి మాయమైపోయాడు చీకట్లో.

ఏదో చప్పుడైతే యిటు తిరిగిన శ్రీరాం చటుక్కున ప్రమాదం పసిగట్టి అన్సారీమీద దూకి పట్టుకోబోయాడు.

ఇంతలో రైలు వేగానికి మూసుకోబోతున్న తలుపు రివ్వున వచ్చి తలకి తగిలింది బలంగా.

చిన్నగా మూలిగి కూలిపోయాడు శ్రీరాం. మరొక్క అడుగు ముందుకు వేసుంటే రైల్లోంచి పడిపోయేవాడే!

వెనకనే వచ్చిన రామారావు, శశీ—అతన్ని లేవదీసి బెంచీమీద పడుకోబెట్టి రక్తం కారుతున్న తలకి కట్టుకట్టేరు.

6

ఇంత కష్టపడి సంపాదించిన కెమేరా దొంగ పాలయినందుకు రామారావు, శశీ డీలాపడిపోతే శ్రీరాంకి గాయం తాలూకు బాధకూడా తోడై అతన్ని మరింత క్రుంగదీసింది. పైగా ఆ బాధని పైకి వ్యక్తం చేసుకునే అవకాశం లేదు. ఎందుకంటే శశికుమార్ పక్కన వున్న వ్యక్తి అపరిచితుడు.

ముగ్గురూ లోపల్లోపలే మధనపడసాగేరు. తమ అసమర్థతనీ దురదృష్టాన్నీ నిందించుకున్నారు.

ఇంత హడావుడి జరిగినా ఉమాపతిగాని, ఆమెగానీ లేవనే లేదు. అన్యోన్యతకి నిర్వచనం లాగా మరింత సన్నిహితంగా ఆదమరచి నిద్రపోతున్న ఉమాపతిని చూసేపరికి రామారావుకి పట్టలేనంత కోపం వచ్చింది. కాని మరుక్షణం నిగ్రహించుకున్నాడు! ముగ్గురు మెళుకువగా వుండికూడా దొంగతనం జరక్కుండా ఆపలేకపోయాం. మెళుకువగా లేడని అతడ్ని నిందించి ప్రయోజనం ఏమిటీ? కనీసం అతడికైనా మనశ్శాంతి వుంటుంది తెల్లారేవరకూ—అనుకున్నాడు.

పది నిముషాల అనంతరం మెల్లిగా లేచి కూర్చున్నాడు శ్రీరాం తల పట్టుకుని.

"అఫ్టరాల్ కిలో వేరుశనక్కాయల కోసం ఎందుకండీ ఆ వెధవని వెంబడించి దెబ్బ తగుల్చుకొన్నారూ?" అన్నాడు

శశి పక్కన కూర్చునున్న వ్యక్తి.

ఎవరూ ఏం మాట్లాడలేదు. ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు మౌనంగా.

"నేనప్పుడే అనుకున్నా వాడు పదే పదే బుట్టకేసి దొంగచూపులు చూస్తూంటే...."

"మరప్పుడే చెప్పకపోయారా మాకు?" అన్నాడు రామారావు వెటకారంగా. పరిచయం లేని ఒక వ్యక్తి తమ వ్యవహారంలో తలదూర్చడం ఇష్టంలేదతనికి.

"చెప్పొచ్చు. కానీ ఆ దొంగ వెధవకి తగిన గుణపాఠం నేర్పాలిగా! నేను ముందుగా చెప్పివుంటే మీరేం చేసేవారో ఆ పని నేనే చేశా! ఇదిగో మీ కెమేరా!!" తన బ్యాగ్‌లోంచి కెమేరా తీపిస్తున్న ఆ వ్యక్తికేసి నమ్మలేనట్టు చూశారు రామారావు, శ్రీరాం, శశికుమార్లు.

ఆ క్షణంలో పట్టరాని ఆనందం కలిగిందా ముగ్గురికీ.

శశికుమార్‌కైతే ఆశ్చర్యాని కంతులేదు. తను ఒక్క క్షణం కూడా నిద్రపోకుండా అతనితో మాట్లాడుతూనే వున్నాడు. తనకి తెలియకుండా ఎప్పుడు తీసి జాగ్రత్త పెట్టేడు కెమేరాని?!

"వెరీమెనీ థాంక్సండీ! మీ మేలు ఈ జన్మకి మరచిపోలేం!" అన్నాడు శ్రీరాం ఆనందాతిశయంతో.

'వేరుశనక్కాయల బుట్టలో కెమేరా ఎందుకు పెట్టి తెస్తున్నారూ?' అని ఆ వ్యక్తి అడుగుతా డేమోనని సందేహించి ముందుగానే సమర్థించుకోబోయాడు రామారావు.

"ఈమధ్య రైళ్ళలో దొంగతనాలు చూశారా యెంత దారుణంగా అవుతున్నాయో! అందుకనే సేఫ్టీ కోసం యెవరికీ అనుమానం కలక్కుండా ఈ బుట్టలో పెట్టి తీసు

కొచ్చాం."

"మంచి పనిచేశారు. ఒక్క రైళ్ళలో ఏవిటీ యెక్కడ పడితే అక్కడ జరుగుతున్నాయి చోరీలు. ఈవాళ్టికీ వేళ మిట్టమధ్యాహ్న ఎల్లోరాలో ఓ విదేశీయాత్రికుణ్ణి గొంతు నులిమి చంపేసి అతని దగ్గరున్న డబ్బూ దస్కం అన్నీ దోచుకుపోయారెవరో దొంగలు. వెధవది ఆ కేసు నా కప్ప గించారు యిన్వెష్టిగేట్ చెయ్యమనీ" అన్నాడా వ్యక్తి తాపీగా.

ఆ మాట వింటూనే కరెంట్షాక్ తిన్నవాళ్ళలాగా కంపించిపోయారు ముగ్గురూ.

"చచ్చిపోయాడా?" అప్రయత్నంగా ముగ్గురి నోటి నుంచి ఒకేసారి వచ్చింది శబ్దం. వెంటనే తమాయించుకుని గుటకలు మింగేరు.

"అవును చచ్చిపోయాడు! డెబ్బైయేళ్ళ పండు ముస కెంత కావాలండీ! ఉప్పంటే చచ్చిపోయే అర్భకుణ్ణి పట్టు కుని పీక నులిమి పారేస్తే చావట్టండీ! అవునూ మీ రెందు కంత ఆందోళనపడుతున్నారూ యేదో మీరే ఆ హత్య చేసినట్టుగా?" నిశ్శబ్దంగా గాలిలాంటి నవ్వొకటి నవ్వే డతను.

"మీ రా కేసుని ఇన్వెష్టిగేట్ చెయ్యడమేమిటీ!" ధైర్యం తెచ్చుకు నడిగేడు రామారావు.

"తప్పుతుందామరీ! ఆ పరిధి సర్కిల్ ఇన్స్పెక్టర్ని నేనాయే!" జేబులోంచి అయిడెంటిటీకార్డు చూపిస్తూ అన్నాడా మనిషి.

"హెచ్. కే. దల్బీర్పింగ్, సర్కిల్ ఇనస్పెక్టరాఫ్ పోలీస్, ఔరంగాబాద్" కార్డు అందుకుని చదివేడు శశి కుమార్.

బావురుమని ఏడవాలనిపించింది ముగ్గురికీ.

గుండెలు గొంతుకల్లో కొచ్చేశాయి. కాళ్ళల్లోంచి చలి పుట్టుకొస్తున్నట్లుంది.

"అంటే దల్బీర్‌సింగ్‌కి తామే ఆ హంతకులమని తెలుసునన్నమాట. అందుకనే తమను కావాలని అనుసరించి వచ్చేడు. వెంటబడి రావడమెందుకూ అనుమానం రాగానే అక్కడే అరెస్టు ఎందుకు చెయ్యలేదూ? సోదా చేసినప్పుడు కెమెరా దొరకలేదు కాబట్టి దాని ఆచూకీ తెలుసుకోవడానికే వెన్నంటివచ్చేడా? అసలు తమమీద పోలీసుల దృష్టిపడ డానికి కారణం ఏమై వుంటుందీ? ఎక్కడ పప్పులో కాలేశాం? లేక తమలోనే ఎవడైనా పోలీసులకి ఉప్పం దించేడా? అలాంటి వెధవ పనులు చేసే గుణం యెవరికీ లేదే!"

రకరకాల ఆలోచనలతో తల వేడెక్కిపోతోంది ఒక్కొక్కరికీ.

"ఒక చిన్న కెమేరాకోసం కక్కుర్తి పడితే యెంత ప్రమాదం ముంచుకొచ్చిందీ! చివరికి హంతకులుగా జైల్లో గడిపే ఖర్మ పట్టిందా? తల్లిదండ్రులూ, చుట్టాలూ, స్నేహితులూ—అందరికీ మొహం యెలా చూపించడం? జీవితం చేజేతులా నాశనం చేసుకున్నట్టయిందే!" ముగ్గురికీ ఆత్మహత్య చేసుకోవాలన్నంత విరక్తి కలిగింది. ఎంత దాచుకోడానికి ప్రయత్నించినా వాళ్ళ గుండెల్లో చెలరేగే ఘర్షణ, బాధ, ఆవేదనా, భయం కళ్ళల్లో ప్రతిబింబిస్తున్నాయి.

"పరిస్థితులు మనిషిని ఎంత పనికైనా చేయిస్తాయి. యెంతటి మొనగాడయినా పరిస్థితుల ప్రభావానికి తలవంచక తప్పదు. భయపడకండి. నాకంతా తెలుసు. మీకు సహాయం

చేయడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. జరిగింది జరిగినట్టుగా చెప్పెయ్యండి" అన్నాడు గీతలో కృష్ణుడి లాగా దల్బీర్‌సింగ్.

కబళించబోయిన కర్ణపిశాచి కామధేనువుగా మారిపోయి భక్షించడానికి బదులు రక్షించి, పైగా వరాలుకూడా ఇచ్చేస్తోంటే ఆ మానవుడి పరిస్థితి యెలా వుంటుంది? అతడి ఆనందాన్ని వర్ణించడానికి భాష సరిపోతుందా?

సరిగ్గా అటువంటి పరిస్థితే యేర్పడిందక్కడ కూడా. ఆ క్షణంలో దల్బీర్‌సింగ్ సాక్షాత్తూ శ్రీమన్ మహావిష్ణువులా కనిపించాడు వారికి.

గొంతుకలు జీరబోతోంటే కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు వేస్తోంటే జరిగిన సంగతంతా పూసగుచ్చినట్టు చెప్పి కెమేరా పదిలంగా అతని కరకమలాల మధ్య వుంచి 'నీదే భారం' అన్నట్టు ప్రాధేయపూర్వకంగా చూశారు.

దల్బీర్‌సింగ్ మళ్ళీ నవ్వేడు శబ్దం లేకుండా.

"చూడండి. ఎంతో అనుభవం వుంటేకానీ హత్యగానీ దొంగతనంగానీ చేసి తప్పించుకోలేరు. కెమెరా వేరుశనక్కాయల బుట్టలో రహస్యంగా తీసికెళ్లే ఆలోచన మంచిదేగానీ మీలాంటి చదువుకునే కుర్రాళ్ళ దగ్గర అటువంటి బుట్ట ఉంటే చూసేవారికి అనుమానం కలుగుతుందని మీరూహించలేదా? అయినా యెటువంటి నేరస్థులయినా పోలీసుల కళ్ళు కప్పలేరు కదా!" అని నేరస్థుల కళ్ళలోకి సూటిగా చూశాడు దల్బీర్.

వాళ్ళ కళ్ళలో ప్రాధేయపడుతున్న భావం కనిపించింది.

"ఇంతకి నేను చెప్పేదేమంటే—మీరు నేరస్థులన్న సంగతి నాకు తప్పితే మరెవ్వరికీ తెలియదు. అది మీ

అదృష్టమనే చెప్పాలి. నా చేతుల్లో ఉంది కాబట్టి ఫైలు క్లోజ్ చేయించడం పెద్ద కష్టంకాదు. ఎటొచ్చీ కొంత ఎక్స్‌పెన్సస్ కింద అవుతుంది."

రామారావు ధైర్యం తెచ్చుకున్నాడు.

"సార్! కొంచెం మా పరిస్థితి అర్థంచేసుకోండి. బొంబే, ఆగ్రా, ఢిల్లీ చూద్దామని తలో నాలుగువందలూ వేసుకుని రైల్వే కన్సెషన్‌మీద బయల్దేరాం. మధ్యలో అనవసరంగా ఈ తల నొప్పొకటి తెచ్చిపెట్టుకున్నాం. ఈ వ్యవహారం మీద ఇప్పటికి వందరూపాయలు పైగా ఖర్చుచేశాం. ఇటు కెమేరా దక్కలేదు. అటు అజంతా కూడా చూడలేదు. ఇప్పటికే ఈ లోటు భర్తీ చెయ్యడానికి వాచీలు తాకట్టు పెట్టక తప్పదనిపిస్తోంది. మీరు కెమేరాతో సరిపెట్టుకుని మమ్మల్ని వదిలేస్తే మాకు ఎంతో సహాయం చేసినవారవుతారు. కాదు ఇంకా డబ్బుకూడా కట్టాలంటే—ఇక్కడితో మా ప్రయాణానికి స్వస్తి చెప్పి ఏడుస్తూ వెనక్కిపోతాం. మీరేం చెయ్యమంటే అదిచేస్తాం." అన్నాడు శ్రీరాంకేసి 'అంతేకదా' అన్నట్టుచూస్తూ.

రెండు నిమిషాలు మౌనం వహించి "సరే! ప్రొసీడ్! మిమ్మల్ని కష్టపెట్టడం నా అభిమతం కాదు" అన్నాడు దల్బీర్. "ఈ సంగతులిక ఎక్కడా ప్రస్తావించకండి. కెమేరా నా కిచ్చినసంగతి మరిచిపోండి. ఓ హత్య కేసును మాఫీచెయ్యడం అంత సులభంకాదు అయినా మీ కోసం చేస్తా."

"చాలా థాంక్స్‌సర్" ముక్తకంఠంతో పలికేరు ముగ్గురూ.

ఈ తతంగం ముగిసేసరికి బండి మన్మాడ్ చేరింది. ఆ బండికదే ఆఖరిస్టాప్.

అందరికీ చేతులు కలిపి హుందాగా దిగిపోయాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ దల్బీర్ పింగ్।

ఉమాపతీ అతని ప్రియురాలూ ఇంకా స్వర్గంలోనే వున్నారు. వారిద్దర్నీ తప్పని పరిస్థితుల్లో భూలోకంలోకి రప్పించి పాపం మూట గట్టుకున్నాడు శశి.

ఆమె హడావుడిగా లేచి బట్ట నిండుగా కప్పుకుని సిగ్గు పడుతూ దిగి చీకట్లో కలిసిపోయింది.

క్రిందకి దిగేక—జరిగిన రసాభాస ఏమీ ఎరగని ఉమాపతి "వేరుశనక్కాయల బుట్టేదీ?" అన్నాడు సామానుతో బాటు అది కనబడకపోయేసరికి.

అంతవరకూ కోపాన్ని దిగమింగుకున్న రామారావు—చెంప పగిలేటట్టు సాచిపెట్టి ఒక్కటిచ్చాడు ఉమాపతి దవడ మీద.

జరిగిందంతా తెలుసుకుని ఉమాపతి నాలిక్కరుచుకున్నాడు.

"అంతా భగవంతుడిదయ" అంటూ మెడలో వెంకటేశ్వరస్వామి కోసం చెయ్యిపెట్టి "ఓర్నాయనోయ్। అది నా మెళ్ళో గొలుసు కొట్టేసిందిరోయ్" అని ఒక్క గావుకేకపెట్టి తల పట్టుకుని కూర్చుండి పోయాడు.

ఉమాపతిని లాలనగా ఎందుకు చేరదీసిందో ఇప్పుడర్థమైంది అందరికీ.

"బాధపడకు ప్రియుడి కిచ్చిన సుఖానికి వెలకట్టిందా ప్రియురాలు।" అన్నాడు ముసి ముసి నవ్వులమధ్య శశి.

7

బొంబేనించి ఆగ్రా చేరుకుని తాజ్‌మహల్ అందాల్ని తిలకిస్తున్న స్నేహ చతుష్టయం అక్కడ ఒకచోట కనపడ్డ

దృశ్యం చూపి నోళ్ళు వెళ్ళబెట్టేరు!

తాజ్‌మహాల్ సోయగాలని ఇండియన్ మేడ్ డబ్బా కెమేరాతో క్లిక్ చేసేస్తున్నాడు "ముసలాడు" వరసగా.

పరీక్షగాచూశారు నమ్మశక్యంకాక. సందేహంలేదువాడే!

"ఎంత మోసం చేశాడు దబ్బీర్‌గాడు! ముసిలాడు పోయాడని చెప్పి భయపెట్టి పదిహేనువేల రూపాయల కెమేరా లాక్కున్నాడు. పైగా కేసు తనే ఇన్‌వెస్టిగేట్ చేస్తున్నానని కోశేశాడు. అసలు వాడు సర్కిలేనా?"

"అయిడెంటిటీ కార్డులో చూశాంగా!"

"లోకల్ పోలీసువాడు కాబట్టి కెమేరా దొంగతనం గురించి అక్కడే వినుంటాడు. మిగిలిన వివరాలన్నీ మన దగ్గిర్నించే రాబట్టేడు. అయినా అందరికీ అనుమానం వచ్చేలాగా ప్రవర్తించడం మనదే బుద్ధి తక్కువ."

"నిక్షేపంలా చేతికి చిక్కిన కెమేరా జారిపోయింది" మళ్ళీ శ్రీరాంకి కెమేరా గుర్తుకొచ్చి తల పట్టుకున్నాడు. □

చూసే అందాలు!

అస్థిపంజరం

— కాశీభట్ల భానుమూర్తి



"మీ గురించి అన్ని వివరాలు తెలుసుకొని మిమ్మల్ని పిలిచాను. మీరు నాకో సహాయం చేసిపెట్టాలి. అది. అది." అని నీళ్ళు నమలసాగాడు శ్యామలరావు. సింహాచలం పగలపడి నవ్వాడు.

"అమ్మగారు ఊళ్ళో లేనట్టున్నారు. కొంపతీసి పిట్ట ఏమన్నా కావాలేమిటండీ? హైక్లాసు సరుకు వచ్చింది

కనకవల్లి కంపెనీకి." అన్నాడు సింహాచలం.

"ఛ. అదికాదు. అమ్మగారిని నేనే ఊళ్ళోనుంచి పంపించాను. నాకు ఒక అస్థిపంజరం కావాలి." అన్నాడు శ్యామలరావు చిన్నగా.

"అస్థిపంజరమా? విడ్డూరంగా వుందే. హత్యలు చేయటానికి మమ్మల్ని పిలిపించేవారు. కిడ్నాపులు చేయటానికి కేకేసేవారు. అంతేగాని ఇలా అస్థిపంజరాలూ, అస్థికలూ తేవటానికి ఎవరూ మమ్మల్ని కేకేయలేదు. యింతకీ ఆ అస్థిపంజరం మీకెందుకు? ఎవరిది తేవాలి?" ప్రశ్నించాడు మస్తాన్.

"నా అంతే ఒడ్డూ పొడుగూ వున్న అస్థిపంజరాన్ని తీసుకొచ్చి రేపు రాత్రిలోగా నాకివ్వు. వివరాలు అడక్కు." అన్నాడు శ్యామలరావు గంభీరంగా.

"పనిలోని కష్టసుఖాలు తెలుసుకుందామని అడిగాము. ఆల్‌రైట్ మీకు అస్థిపంజరం కావాలి, అంతే కదా. సాధించి తీసుకొని వస్తాం" అన్నాడు సింహాచలం నవ్వుతూ.

"రేపు సాయంత్రానికిగాని, రాత్రికిగాని కావాలి. దానికి ఎంతకావాలో చెప్పు." అన్నాడు శ్యామలరావు సిగరెట్టు పొగ గాలిలోకి వదులుతూ.

"వెయ్యి రూపాయలు యిప్పించండి." అన్నాడు సింహాచలం.

"ఏమిటి? వెధవ అస్థిపంజరం తెచ్చి యిచ్చినందుకు వెయ్యి రూపాయలా? మరీ దారుణంగా వుందే." అన్నాడు శ్యామలరావు విసుగ్గా.

"ఈ దేశంలో మనిషి ప్రాణాలకన్నా శవాలకే విలువ ఎక్కువ. వంద రూపాయలకి నిండుప్రాణం తీసేవాళ్ళు

వున్నారు. కాని పోలీసులు బ్రతిమాలినా పోస్టుమార్టంకి ఒప్పుకోనివాళ్ళు వున్నారు. మేము అడిగింది చాలా తక్కువ. కాటికాపరికి లంచంగా యివ్వటానికీ మీరిచ్చే దాంట్లో చాలా పోతుంది. పైగా అక్కడనుంచి యిక్కడికి తెచ్చియివ్వాలి. రిస్కుతో కూడుకొన్న పని యిది." అన్నాడు మస్తాన్.

"ఆల్‌రైట్. అయితే ఒకటి. యిలా మీరు అస్థిపంజరం తెచ్చి నాకు యిస్తున్నట్టు ఎవ్వరికీ చెప్పకూడదు. గుట్టుచప్పుడు కాకుండా అస్థిపంజరం నాకు అప్పగించి, మీ వెయ్యి రూపాయలూ మీరు పట్టుకొనిపొండి. ఈ విషయం బయటికి తెలిపింవా, క్షమించేది లేదు." అన్నాడు శ్యామలరావు గంభీరంగా.

"బ్లాకుమెయిల్ చేసే బుద్ధి మాకులేదు. పని ఒప్పుకున్నాక చేసి ఫీజు తీసుకొనిపోవటమేగాని, దాని వివరాలు మాకు అనవసరం. అడ్వాన్సుగా ఐదువందలు యివ్వండి. ఖర్చులకి కావాలి." అడిగాడు సింహాచలం.

జేబులోంచి డబ్బుతీసి ఐదువందలు లెక్కపెట్టి సింహాచలానికి యిచ్చాడు శ్యామలరావు. సింహాచలం ఆ డబ్బుని జేబులో పెట్టుకొన్నాడు.

"రేపు చీకటిపడ్డాక వస్తాము మిగిలిన డబ్బు రెడీగా వుంచండి." అని శ్యామలరావుకి చెప్పి, బయటకి నడిచారు సింహాచలం, మస్తాన్.

వాళ్ళు వెళ్ళిపోయాక టైము చూసాడు శ్యామలరావు. తొమ్మిది అయింది. తలుపు దగ్గరగావేసి సోఫాలో కూలబడ్డాడు శ్యామలరావు.

చేతిని ముందుకి చాపాడు శ్యామలరావు. టీపాయిమీద వున్న ఏప్రెల్ 'అపరాధ పరిశోధన' చేతికి అందింది. అది

తీసుకొని పేజీలు తిప్పాడు శ్యామలరావు. అతని కళ్ళు కె. వి. రమణ వ్రాసిన "అసాధారణ హంతకులు" దగ్గర ఆగాయి. ఆ కథ యిప్పటికి పదిసార్లు చదివాడు శ్యామల రావు. తన సమస్యలకి పరిష్కారం చెప్పగల ఆ కథని పదకొండవసారి చదువుతూ ఆలోచనలలో పడ్డాడు శ్యామల రావు.

2

"సార్! ఆముదాలవలస నుంచి శ్రీహరిగారు, వెంకట రాయపురంనుంచి సుబ్బారావుగారు, వారి కుటుంబ సభ్యులు అడుగుతున్నారు? ఏమిటి, ఈమధ్య మీ పరిశోధనలు ఉండ టంలేదు అపరాధ పరిశోధనలో. ఒకవేళ వున్నా చప్పగా వుంటున్నాయి, కారణం చెప్పగలరు—అని అడుగు తున్నారు సార్!" అన్నాడు శ్రీకారం.

"అపరాధ పరిశోధనలో మా పరిశోధనలు వుండటం లేదంటే అందుకు కారణం కేసులు రాకపోవటమే. కేసులు రావటంలేదంటే నేరాలు తగ్గుతున్నట్టేకదా. ఫీజు విష యంలో బాధగావున్నా, నేరాలు తగ్గుతున్నందుకు మన స్ఫూర్తిగా ఆనందిస్తున్నా. అదీకాక కేసునిబట్టే పరిశోధన. చప్పటి కేసులకి చప్పటి పరిశోధన. ఏమైనా మీ ఆదరాభి మానాలే మాకు ముఖ్యం —అని వ్రాయి." అన్నాడు పరి శోధనరావు.

"బాగుంది సార్! బాగా జవాబిచ్చారు." అన్నాడు శ్రీకారం నవ్వుతూ.

"గుడివాడనుంచి శ్రీ మార్కండేయులుగారు, నల్గొండ నుంచి మల్లిఖార్జునరావుగారు, హిందూపూరు నుంచి రెడ్డి పాయిగారు అడుగుతున్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎన్టీ రామారావుగారు మా మా నియోజక వర్గాలనుంచి గెలవటం

మీద మీ అభిప్రాయం ఏమిటి? ఇంతకీ మీది ఏపార్టీ అని." అన్నాడు ఓంకారం నవ్వుతూ.

"అది ప్రజలు యిచ్చిన తీర్పు. యిక పోతే రహస్య ఓటింగ్ విధానాన్ని నేను గౌరవిస్తాను. మన మనస్సులో ఏ పార్టీమీద నమ్మకముంటే ఆ పార్టీకి ఓటు వేయాలి." అన్నాడు పరిశోధనరావు హుందాగా. శ్రీకారం చప్పట్లు కొట్టాడు.

"నీ చేతిలో యింకో ఉత్తరం వుంది. అదేమిటి?" ప్రశ్నించాడు పరిశోధనరావు. వయస్సు పైబడుతున్నకొద్ది పరిశోధనరావుకి అనుమానాలు ఎక్కువౌతున్నాయి.

"యిదా. యిది. ఆ మధ్య ఏదో పత్రికలో "కలం స్నేహం" శీర్షిక చూసి, అందులో లావణ్య అని ఆడపేరు కనపడి ఉత్తరం వ్రాసాను బాసు. దానికి సమాధానం వచ్చింది. అసలు పేరు లావణ్య కాదట. లవకుమార్ అట. ఆడపేరుతో ఆ శీర్షికలో ఆడవాళ్ళని ఆకట్టుకోవచ్చని పంపాడట. అయితే వచ్చింది నా ఒక్కడి మగవుత్తరమే అట. బాధపడుతూ వ్రాసాడు." అన్నాడు ఓంకారం బాధగా.

"నయం యిప్పటికైనా చెప్పాడు. మీ పరిచయం బాగా పెరిగి పెళ్ళిదాకా వెళ్ళాక చెప్పలేదు. గుండాగి చచ్చేవాడివి." అన్నాడు శ్రీకారం నవ్వుతూ.

"శ్రీకారం ఏమిటి నాకు కాకా పడుతున్నాడు. నాకేదో అనుమానంగా వుంది." అన్నాడు పరిశోధనరావు అనుమానంగా శ్రీకారంకేసి చూస్తూ.

"ఈరోజు ఫస్టు తారీఖు కదా బాసు. జీతం కోసం. పెళ్ళి అయినవాడు కదా, అవసరాలుంటాయి మరి." అన్నాడు ఓంకారం పరిస్థితి వివరిస్తూ.

"కేసువచ్చి, ఫీజు చిక్కేవరకు జీతాలు లేవు, వేత నాలూ లేవు. ఆంధ్రాబ్యాంకులో మన అకౌంటు నిల్ బేలన్స్‌లో వుంది. చేతిలో పైసాలేదు. కేసురావాలి. ఫీజు తీసుకోవాలి. అప్పుడే మిగిలిన సంగతులు." అన్నాడు పరి శోధనరావు. శుభసూచకంగా కాలింగ్‌బెల్ మ్రోగింది.

"బాసు-కేసు" అంటూ పరిగెత్తాడు శ్రీకారం. పరిశో ధనరావు. ఓంకారం తమ తమ సీట్లల్లో సర్దుకుని కూర్చు న్నారు ఖంగారుగా.

శ్రీకారం ఒక మనిషిని వెంటబెట్టుకొని వచ్చాడు. పరి శోధనరావు తన కెదురుగావున్న సీటు చూపించాడు. ఆ మనిషి సర్దుకొని కూర్చున్నాడు.

"ఆ! చెప్పండి. ఎవరు మీరు? మీరు వచ్చిన పనేమిటి? అన్నీ వివరంగా చెప్పండి." అన్నాడు పరిశోధనరావు, ఖాళీ పైలు మూసేస్తూ.

"సార్! నాపేరు శ్యామలరావు. "తెలుగు కిరణం" దినపత్రికకి జర్నలిస్టుని. ఈమధ్య కొంతకాలంగా నన్ను ఎవరో చంపుతారని భయంగావుంది. అందుకనే మీదగ్గరికి వచ్చాను." అన్నాడు శ్యామలరావు తడబడుతూ.

"ఆ అనుమానం మీకెందుకు వచ్చింది. అంటే ఎవ రైనా మీమీద హత్యాప్రయత్నం చేస్తున్నారా? వివరంగా చెప్పండి." అని అడిగాడు ఓంకారం.

"వివరంగా అంటే చెప్పలేను. అనుమానం అంతే. అదీకాక నిన్న నేను బజారునుంచి వస్తుంటే, అప్పటిదాకా రోడ్డుపక్కన ఆగివున్న లారీ ఒకటి విసురుగా నావైపుకి దూసుకొని వచ్చింది. అయితే ఒక సైకిలిస్టు లారీకి, నాకు మధ్యగా రావటంతో లారీ పక్కకితిరిగి వెళ్ళిపోయింది. అంతేకాక నిన్న నేను బజారునుంచి యింటికి వచ్చేసరికి

తాళం కప్పకి కరెంటు కనెక్షన్ యిచ్చివుంది. ఆ సమయా నికి కరెంటు లేకపోబట్టి బ్రతికిపోయాను. లేదంటే తాళం కప్ప ముట్టుకోగానే నాలో "హంస" ఎగిరిపోను. అయితే విచిత్రం ఆ కరెంటుతీగ గాలికి వచ్చి తాళంకప్పని తాకిందో, లేక ఎవరైనా కావాలని తాకించారో మాత్రం తెలియలేదు." అన్నాడు శ్యామలరావు చిన్నగా వణుకుతూ.

"మీ యింట్లో ఎవరూ లేరా?" ప్రశ్నించాడు శ్రీకారం.

"నాభార్య సుశీల పుట్టింటికి వెళ్ళింది. ఇంట్లో ప్రస్తుతా నికి నేను తప్ప ఎవరూలేరు. అందుకనే భయంగా వుంది. అన్నాడు శ్యామలరావు.

"ఇది హత్యా ప్రయత్నమని మీరనుకుంటున్నట్టు అయితే ఎవరు చేసివుంటారని మీ అభిప్రాయం. అయిమీన్ మీరు ఈ మధ్యకాలంలో ఎవరితోనైనా గొడవపడ్డారా? ఏమైనా ఆస్థి తగాదాలా, అదికాక వృత్తిపరమైన గొడవలా? ఎందుకంటే మీరు జర్నలిస్టు కదా." అన్నాడు పరిశోధన రావు.

"కరెక్టు సార్! వృత్తిపరమైన గొడవలే. సాధారణంగా నేను ఎవరితోను గొడవలు పడను. ఇక పోతే నాకు ఆస్థి అంటూ ఏదీలేదు. ఆస్థే లేకపోతే గొడవలువచ్చే అవకా శమే లేదుకదా. వృత్తిపరమైన గొడవలవల్లనే నా ప్రాణా నికి హాని రావచ్చని అనుకొంటున్నాను సార్!" అన్నాడు శ్యామలరావు.

"ఎవరని మీ అభిప్రాయం." అడిగాడు ఓంకారం హుందాగా.

"ఇది నా అనుమానమే సుమండీ. "ఆంధ్ర దీపం" దినపత్రిం జర్నలిస్టు కాళిదాసుకి నేనంటే పడదుసార్! అతనికి బద్ధకం ఎక్కువ. నేను కష్టపడి వివరాలు సేక

రించి నా పత్రికకి పంపుకొంటాను సార్. అతనేమో ఏపీ సరిగ్గా పంపడు. దాంతో వాళ్ళ ఎడిటర్ ఒకటికి రెండు సార్లు మందలించాడు కాళిదాసుని దాంతో నేనంటే మండిపడుతున్నాడు. నేను చస్తేగాని పీడ విరగడ అవదని చాలాసార్లు అన్నాడని విన్నవాళ్ళు చెబుతున్నారు. దాంతో నా అనుమానం కాళిదాసుమీదకి పోయింది." అన్నాడు శ్యామలరావు.

"మరి పోలీసురిపోర్టు యివ్వకపోయారా?" అని ప్రశ్నించాడు ఓంకారం

"చెప్పేను కదా సార్! నాది అనుమానమే అని. ఒక వేళ నేను ఊహిస్తున్నది కరెక్టు కాకపోతే కాళిదాసు అనవసరంగా నామీద పగపడతాడు. అందుకనే ఈ కేసు మీకు అప్పగిస్తున్నా. మీ పరిశోధనలో నిజంగా కాళిదాసు అనుమానితుడే అని తేలితే అప్పుడే పోలీసు రిపోర్టు యివ్వవచ్చు." అన్నాడు శ్యామలరావు చిన్నగా.

"అల్ రైట్. ఈ కేసు మేం పరిశోధిస్తాం. పోతే మీ ఎడ్రస్సు, కాళిదాసు యింటి ఎడ్రస్సు యివ్వండి." అన్నాడు పరిశోధనరావు ఏదో ఆలోచిస్తూ.

శ్యామలరావు ఒక కాగితంమీద తన ఎడ్రస్సు, కాళిదాసు ఎడ్రస్సు వ్రాసి పరిశోధనరావు చేతికిచ్చాడు. పరిశోధనరావు ఆ కాగితాన్ని ఒకసారి చూసి ఓంకారానికి యిచ్చాడు. ఓంకారం ఆ కాగితాన్ని జాగ్రత్త చేసాడు.

"మరి మీ ఫీజు విషయం." అని నసిగాడు శ్యామలరావు చిన్నగా.

"ఇది అనుమానం కేసు. కొంచెం కష్టపడాలి. ఐదు వందలు ఇవ్వండి" అన్నాడు పరిశోధనరావు. ఓంకారం, శ్రీకారం సంతోషించారు.

శ్యామలరావు మాట్లాడకుండా ఐదువందల రూపాయలూ తీపి పరిశోధనరావుకి యిచ్చాడు. పరిశోధనరావు ఆ డబ్బుని ఆనందంగా అందుకొన్నాడు.

"మరి నేను వెళ్ళివస్తానుసార్." అని లేచాడు శ్యామల రావు.

"వెళ్ళిరండి. నాకు కాస్త పనివుంది. అది ముగించు కొని మీ పరిశోధనలోపడతాను." అన్నాడు పరిశోధనరావు డబ్బుని జేబులో దాచుకుంటూ.

ఓంకారానికి, శ్రీకారానికి చెప్పి బయటకి నడిచాడు శ్యామలరావు ఆనందంగా. శ్రీకారం వెళ్ళి తలుపులువేసి వచ్చాడు సంతోషంగా.

"బాసు, ఈ శ్యామలరావుగాడు చాలా పిరికివాడు. ఎప్పుడూ ఎవరోఒకరు తనని చంపుతారని భయపడి చస్తూ వుంటాడు. లేకపోతే ఒక సాధారణ జర్నలిస్టుని మరొక సాధారణ జర్నలిస్టు చంపటమేమిటి? ఏవో కాకతాళీయంగా రెండు సంఘటనలు జరిగితే హత్య అని బెదిరిపో తున్నాడు" అన్నాడు ఓంకారం.

"అసలు అలాంటప్పుడు వెయ్యిరూపాయలు అడిగినా ఇచ్చేవాడు. బాసు మరీ ఘోరంగా ఐదువందలే అడిగారు." అన్నాడు శ్రీకారం బాధగా.

"ఎంతచెట్టుకి అంతేగాలి. ఎక్కువ అడిగితే పారి పోతాడు." అన్నాడు పరిశోధనరావు నవ్వుతూ.

"అంత డబ్బు మీ దగ్గర వుండటం మంచిదికాదు బాసు. ప్రమాదం. మాకు ఇవ్వండి జీతాలుగా సరిపెట్టుకుంటాం." అన్నాడు శ్రీకారం నవ్వుతూ.

"అవును బాసు." అన్నాడు ఓంకారం దగ్గరకి వస్తూ.

"జీతాలు ఇవ్వటం తప్ప నాకు వేరే పనీ పాటలు లేవను

కొన్నారా. తీర్చవలసిన అప్పులు చాలా వున్నాయి. అవన్నీ చూసుకోవాలి. అయితే ఏది ముందు తీర్చాలో, ఏది వెనక తీర్చాలో తెలియటంలేదు." అని అప్పులవిషయమై ఆలోచనలో పడ్డాడు ప్రఖ్యాత డిటెక్టివ్ పరిశోధనరావు.

3

"నీ ప్లాను నాకేం అర్థంకాలేదు. కాని యిది చాలా రిస్కుతో కూడుకొన్న పనిలా కనపడుతోంది" అన్నాడు గురు చిన్నగా దగ్గుతూ.

"ఏం లేదు. ఈ రాత్రికి మా యింటికి అస్థిపంజరం వస్తుంది. ఆ అస్థిపంజరాన్ని నేను పడుకొనే మంచంమీద పెట్టి, నేను తొడుక్కునే లుంగీ ఒకటి దానికి చుట్టబెడతాను. తలుపులు దగ్గరగా వేసిసి రూమ్‌కి వచ్చేస్తాను. ఉదయం ఆరుగంటలు అయ్యేసరికి నా భార్య వస్తుంది. తలుపులు తీసి లోపలకి వెళ్ళి బావురుమంటుంది దాంతో పోలీసులు వస్తారు. నేను చనిపోయానని తేలుస్తారు. దట్సాల్" అన్నాడు శ్యామలరావు పెద్దగా నవ్వుతూ.

"నీ భార్య మంచంమీద పడుకొనివున్న నీ అస్థిపంజరాన్ని చూసి గుండె ఆగి చస్తుందేమో, ఆ విషయాన్ని పరిశీలించావా?" ప్రశ్నించాడు గురు.

"నా భార్యకి నా ప్లాను అంతా తెలుసు. అన్నీ వివరంగా చెప్పి, పుట్టింటికి పంపించాను. దాని గురించి నాకు చింత లేదు" అన్నాడు శ్యామలరావు.

"అసలు ఈ ప్లాను నీకెలా తెలిసింది. అస్థింజరమూ అవి సంపాదించటం కష్టం కదా!" అన్నాడు గురు. శ్యామలరావు చిన్నగా నవ్వాడు.

"ఏప్రెల్, 'అపరాధ పరిశోధన'లో కె. వి. రమణ వ్రాసిన 'అసాధారణ హంతకులు' చదివాక నాకు యీ

ప్లాను తోచింది. నేను జర్నలిస్టుని కదా. ఒక రాజకీయ నాయకుడి మీటింగుకి వెళ్ళినప్పుడు అక్కడ కిరాయి మనుష్యులైన సింహాచలం, మస్తాన్ తగిలారు. వాళ్ళకి అస్థిపంజరం తెచ్చే బాధ్యత అప్పగించాను. అఫ్‌కోర్స్ దానికి వెయ్యిరూపాయలు ఖర్చు అయిందనుకో. అయితే మాత్రం పని చాలా ఖచ్చితంగా చేస్తారు" అన్నాడు శ్యామల రావు ధీమాగా.

"మరి దీనివలన నీకు వచ్చే లాభం మాటేమిటి? ఇంత రిస్కు తీసుకొంటుంటే చాలా లాభం వుండాలికదా" అన్నాడు గురు అనుమానంగు.

"నేను చనిపోయినట్టు తెలియగానే ఇన్సూరెన్సువాళ్ళు షవ్వల్లో పెట్టి నా భార్యకి డబ్బు యిస్తారు. నేను కర్తవ్య నిర్వహణలో వుండగానే పోతున్నాను కాబట్టి నా పేపర్ వాళ్ళు మరికొంత మొత్తాన్ని నా భార్యకి యిస్తారు. దాంతో ఈ ఊరు వదలిపెట్టి వేరే చోటుకి వెళ్ళి హాయిగా యే వ్యాపారమో చేసుకుంటూ జీవిస్తాం. అదీకాక నేను వేసిన ప్లానువలన పాపం ఆ కాళీదాసుగాడు ఏడుస్తూ ఊచలు లెక్కపెట్టుకొంటాడు" అన్నాడు శ్యామలరావు కసిగా.

"ఏమిటా ప్లాను?...." అడిగాడు గురు సందేహంగా.

"నేను లేనప్పుడు నా కోసం మా యింటికి వచ్చాడు కాళీదాసుగాడు. అప్పుడు నా భార్య వంటరిగా వుంది. పిచ్చి పిచ్చి వేషాలు వేయబోయాడు నా భార్య వాడిని వదిలించు కొని ఏడుస్తూ నాకు చెప్పింది. ఒకవేళ అడిగినా లేదని బుకాయిస్తాడు. అందుకే వాడిని అడగదలచుకోలేదు. అయితే నా భార్యమీద చేయివేసినందుకు వాడు శిక్ష అనుభ వించవలసిందే. అందుకనే నా ప్లానులో వాడిని యిరికించి

జైలుకి పంపుతున్నాను" అన్నాడు శ్యామలరావు

"అదే యెలా అని అడుగుతున్నా" అన్నాడు గురు.

"ఇందాక డిటెక్టివ్ పరిశోధనరావుగారి ఆఫీసుకి వెళ్ళాను. నన్ను యెవరో చంపుతారేమో అని భయంగా వుందని అన్నాను. 'ఎవరిని అనుమానిస్తున్నారో చెప్పండి' అన్నారు ఆయన. నేను కాళీదాసు పేరు చెప్పాను. అఫ్ కోర్స్ ఐదువందలు చేతిచమురు వదిలిందనుకో. నా భార్య లబోదిబోమని నా మంచంమీద వున్న అస్థిపంజరాన్ని పోలీసులకి చూపెడుతుంది. పోలీసులతోపాటు డిటెక్టివ్ పరిశోధనరావు బృందం కూడా వస్తారు కదా. అయితే నేను యెలా అస్థిపంజరంగా మారానో యెవరికీ అర్థం కాదు.

పరిశోధనరావు అనుమానం కాళీదాసుమీదకి పోతుంది. కాళీదాసు చూడకుండా ఏప్రెల్ అపరాధ పరిశోధన వాళ్ళింటిలో పడేయి "సాధారణ హంతకులు" పేజీ దగ్గర మడతపెట్టు. పరిశోధనరావు బృందం పోలీసుల్ని తీసుకొని ఎలాగూ కాళీదాసు యింటికి వెడతారు. అక్కడ దొరికిన అపరాధపరిశోధన బట్టి, నేను చెప్పిన మాటలనిబట్టి కాళిదాసే హంతకుడని చెప్పి పోలీసులు లాక్కుని పోతారు" వివరంగా చెప్పాడు శ్యామలరావు.

"మరి యిందులో నేను చేయవలసిన పాత్ర యేమిటో కూడా చెప్పు. స్నేహితుడికి సాయం చేయటం నా ధర్మం కదా" అన్నాడు గురు.

"నీకు తెలుసుకదా, నాకు ఈ ఊర్నిండా అప్పులు వున్నాయని. ఈ అప్పులతో ఈ ఊర్లో వుండలేను. సాధ్యమైనంత రాబట్టుకొని యిక్కడనుంచి పోతాను. నా భార్యకి ఇన్సూరెన్సు డబ్బు, మా పేపర్ వాళ్ళు యిచ్చే

డబ్బు త్వరగా ఇప్పించు. నా స్నేహితుడివి కనుక పోలీసులు నీ దగ్గరకి వస్తారు. వాళ్ళతో కాళీదాసే హంతకుడేమో అన్నట్టు మాట్లాడు. ఇదీ నువ్వు చేయవలసిన సహాయం. ఇందుకు ప్రతి ఫలంగా నీకు వెయ్యి రూపాయలు ఇచ్చుకొంటాను" అన్నాడు శ్యామలరావు.

"డబ్బుకోసం కాకపోయినా, నీలాంటి మంచి మిత్రుడికి సహాయం చేయటం నా విధి. నువ్వేం బెంగపెట్టుకోకు. జరగవలసిన యేర్పాట్లన్నీ నేను దగ్గర వుండి జరిపిస్తాను" అన్నాడు గురు చిన్నగా నవ్వుతూ.

"మరి నేను వెడతాను. నాకు యింకా చాలా పనులున్నాయి. శ్యామలరావు అవతారం ఈ రాత్రినుంచి అంతం అవుతుంది కదా ఈలోగా యింకా యెవరైనా అప్పులు యివ్వగల దాతలుంటే ముక్కు పిండి వసూలు చేస్తాను" అన్నాడు శ్యామలరావు లేస్తూ.

గురుకి చెప్పి బయటపడ్డాడు శ్యామలరావు.

4

"నా సర్వీసులో ఇంతటి ఘోరమైన దృశ్యాన్ని ఇప్పటి వరకూ ఎప్పుడూ చూడలేదు" అన్నాడు ఇనస్పెక్టర్ శశికాంత్ బాధగా మంచంకేసి చూస్తూ.

"సార్! పోస్టుమార్టం చేయమంటారా?" అన్నాడు ఎస్సై ముకుందరావు.

"అస్థిపంజరాన్ని పోస్టుమార్టం యేం చేస్తావయ్యా! అయినా దానిని ఏం కదపకు. డిటెక్టివ్ పరిశోధనరావుగారు వస్తానని ఫోను చేశారు. ఆయన చూశాక మిగిలిన విషయాలు చూద్దాం...." అన్నాడు యిన్స్పెక్టర్ శశికాంత్.

ఇంతలో అక్కడకి డిటెక్టివ్ పరిశోధనరావు, ఓంకారం

శ్రీకారం హడావుడిగా వచ్చారు. శశికాంత్ వారిని లోప లకు ఆహ్వానించాడు.

"మైగాడ్! తనన ఎవరో చంపుతారని, కాళిదాసు భయం తనకుందని శ్యామలరావు చెప్పాడు. అయితే యింత ఘోరంగా రక్తమాంసాలు హరించి మరీ, యెలా చంపగలిగారో అర్థం కావటంలేదు" అన్నాడు పరిశోధన రావు.

"డిటెక్టివ్ పుస్తకాలు చదివి మరీ తెలివిమీరిపోతున్నారు బాసు. ఏప్రెల్ నెల అపరాధ పరిశోధనలో ప్రచురించబడిన 'అసాధారణ హంతకులు' అనే కథలో యింట్లో వాళ్ళ నందరినీ ఏవో చీమలద్వారా శరీరంలోని రక్తమాంసాలు హరింపజేసి అస్థిపంజరాలుగా మారుస్తాడు ఆ యింటి పని వాడు. అలాగే యిక్కడకూడా జరిగివుండవచ్చని నా అభి ప్రాయం" అన్నాడు ఓంకారం.

"అసలు ఈ అస్థిపంజరాన్ని ముందుగా చూసిందెవరు?" అని ప్రశ్నించాడు పరిశోధనరావు. అతనికి అంతా అయో మయంగా వుంది.

"శ్యామలరావు భార్య సుశీల పుట్టింటికి వెళ్ళి ఈ రోజు ఉదయం తిరిగివచ్చింది. రిక్షావాడికి డబ్బులిచ్చి లోపలకి వచ్చిన సుశీలకి మంచంమీద అస్థిపంజరం కనిపించిందట. దాంతో ఏడుస్తూ పక్కవాళ్ళకి చెప్పింది. పక్కింటివాళ్ళు నాకు ఫోన్ చేశారు. నేను మీకు ఫోన్ చేశాను. ఆ అస్థి పంజరం తన భర్తదే అని చెప్పి ఏడుస్తూ స్పృహతప్పి పడిపోయింది సుశీల. అందాకా ఆ గదిలో పడుకోబెట్టాము. ఒడ్డు, పొడుగు శ్యామలరావునే పోలివుంది ఈ అస్థి పంజరం. పైగా దీనికి ఉన్న లుంగీకూడా శ్యామలరావుదే" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

"అయితే యిక్కడ ఈ అస్థిపంజరాన్ని వుంచి చేసేది ఏమీలేదు. దీనిని పోస్టుమార్టంకి పంపించండి. ఈలోగా మనం కాళీదాసు అనే జర్నలిస్టు యింటికి వెళ్ళవద్దాం" అన్నాడు డిటెక్టివ్ పరిశోధనరావు.

"అంటే కాళీదాసే చంపాడని మీ ఉద్దేశ్యమా. ఒక జర్నలిస్టు ఈ విధంగా చంపగలడని నేను భావించటం లేదు" అన్నాడు శశికాంత్.

శ్యామలరావు తనదగ్గరకి రావటం దగ్గరనుంచి జరిగింది చెప్పి, "అగ్గిపుల్లకోసం, ఆడపిల్లకోసం కూడా హత్యలు జరుగుతాయి. ఎవరు ఎప్పుడు ఎవరిని చంపుతారో చెప్పటం కష్టం. మన మొదటి అనుమానితుడు కాళీదాసు. కాబట్టి ఆ కాళీదాసుని యెంక్వయిరీ చేద్దాం...." అన్నాడు పరిశోధన రావు.

"ఆల్‌రైట్. ఈ పోస్టుమార్టం గొడవ ఎప్పై మకుందరావు చూసుకొంటాడు. మనం కాళీదాసు దగ్గరకి వెడదాం" అని పరిశోధనరావుకి చెప్పి ముకుందరావుని పిలిచి చేయవలసిన యేర్పాట్లను గురించి చెప్పాడు శశి కాంత్.

ఇన్‌స్పెక్టర్ శశికాంత్, పరిశోధనరావు, ఓంకారం, శ్రీకారంలు పోలీసు జీపులో కాళీదాసు యింటికి బయలు దేరారు హుషారుగా.

5

తలుపు చప్పుడుకి ఉలిక్కిపడి గురు ఒళ్ళో నుంచి లేచింది సుశీల. గురు భయం లేదన్నట్టు సుశీలవంక చూసి నవ్వాడు.

"ఇంత రాత్రివేళ యెవరై వుంటారు" అని అడిగింది

సుశీల భయంతో.

"ఎవరైనా గుమ్మంలోనివాళ్ళని గుమ్మంలోనే మాట్లాడి పంపించేస్తాను. నువ్వేం భయపడకు" అని సుశీలకి చెప్పి, తలుపు దగ్గరకి నడిచాడు గురు.

మనస్సులో ఉన్న భయాన్ని అణచుకొని, తలుపు గడియతీశాడు గురు. ఛళ్ళున తెరుచుకొన్నాయి తలుపులు. ఆ విసురుకి రెండు పల్టీలుకొట్టి సుశీల కాళ్ళదగ్గర పడ్డాడు గురు. సుశీల భయంగా లేచినుంచుంది.

"మిష్టర్ గురూ! నీ ఆటలు యింక సాగవు. నీలాంటి చీడపురుగుల ఆటలు కట్టించటానికే మేం యిక్కడ డిటెక్టివ్ ఏజన్సీ పెట్టింది" అని ముందుకి ఉరికాడు డిటెక్టివ్ పరిశోధనరావు. అతనివెనక ఓంకారం, శ్రీకారం లోపలకి వచ్చారు. గురుకి కళ్ళు మసకలు బారాయి.

"ఏం! అలా ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డావు. నడు పోలీస్‌స్టేషన్‌కి" అని హుంకరించాడు డిటెక్టివ్ పరిశోధన రావు.

"నేనెందుకు రావాలి. నేనే నేరమూ చేయలేదు. పోలీస్ స్టేషన్‌కి రావాల్సిన అవసరమూ నాకు లేదు" అన్నాడు గురు మొండిగా.

"పోలీస్‌స్టేషన్‌కి వచ్చే అవసరం నీకు లేకపోతే,నిన్ను తీసుకొనివెళ్ళే కర్తవ్యం మాకుంది మిష్టర్ గురూ"అంటూ లోపలికి వచ్చాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్ ఆ వెనకే ఎస్సై ముకుందరావు, అరడజనుమంది కాన్‌స్టేబుల్స్ బిల బిల మంటూ లోపలకి దూసుకొని వచ్చారు ఆనందంగా.

"నువ్వు ఏ నేరమూ చేయలేదా! అవునులే యిదంతా శ్యామలరావు తెచ్చిపెట్టుకొన్నాడు స్వయంగా. ఈ ఊళ్ళో అప్పుల బాధ ఎక్కువయిందని అందినంత డబ్బు తీసుకొని

ఈ ఊరు వదలిపెట్టి పోవాలని ప్లాను వేశాడు. ఏప్రెల్ నెల "అపరాధ పరిశోధన" చదివి సింహాచలం, మస్తాన్‌లని నియమించి అస్థిపంజరం తెప్పించుకొన్నాడు. భార్యకి అన్ని వివరాలు చెప్పి, అస్థిపంజరాన్ని మంచంమీద ఉంచి మాయం అయ్యాడు శ్యామలరావు. శ్యామలరావు చెప్పిన విధంగా చక్కగా నటించింది సుశీల. అయితే శ్యామల రావు చెప్పినదానికన్నా, నువ్వు చెప్పినట్టే చక్కగా నటించింది సుశీల.

శ్యామలరావు చనిపోయినట్టు లోకానికి తెలుస్తుంది. ఇన్సూరెన్సు డబ్బూ, పేపర్‌వాళ్ళు యిచ్చిన డబ్బూ లక్ష రూపాయలవరకూ వస్తుంది. అనుమానం కాళీదాసుమీదకి పోతుంది. అదివరకే పరిచయమున్న అందమైన సుశీల నీ దవుతుంది. ఇలా ప్లాను వేశావు. అయితే శ్యామలరావు నా దగ్గరకి రావటంవల్ల నీ బండారం బయటపడింది.

కాళీదాసుమీద అనుమానం పుట్టిద్దామని శ్యామలరావు మా దగ్గరకి వచ్చాడు. అస్థిపంజరాన్ని చూడగానే కాళీదాసే ఈ పని చేసివుంటాడని కాళీదాసు యింటికి వెళ్ళాం. కాళీ దాసు అసలు సంగతి చెప్పాడు. ఆ రోజు కాళీదాసు శ్యామలరావు యింటికి వచ్చేసరికి నువ్వూ, సుశీలా మాంచి రసపట్టులో ఉన్నారట. అది చూసి కాళీదాసు తన భర్తకి ఎక్కడ చెబుతాడో అని భయపడి కాళీదాసుమీద కట్టుకథ అల్లింది అల్లింది సుశీల. పేరులోనే శీలం గల ఆడది.

శ్యామలరావు ప్లాను విన్నాక నీకు వచ్చిన ఆలోచన ప్రకారం, సుశీలతో సంప్రదించి శ్యామలరావుని నిజంగానే హత్యచేసి, వాళ్ళ యింటి పెరట్లో పాతిపెట్టావు. ఆ డబ్బు చేతికి అందాక సుశీలని తీసుకొని ఈ వూరు వదలి పారి పోదామని ప్లాను వేశావు. అంతేనా" అన్నాడు డిటెక్టివ్

పరిశోధనరావు,

"నో. నాకే పాపమూ తెలియదు. అనవసరంగా నన్ను హత్యకేసులో యిరికించాలని చూస్తున్నారు" అన్నాడు గురు కోపంగా.

"నువ్వు 'అపరాధ పరిశోధన' కిటికీలోంచి లోపలకి పడేసినప్పుడు అది కిటికీదగ్గర మంచం వేసుకొని పడుకొన్న కాశీదాసుమీద పడింది. దాంతో లేచి చూసేసరికి నువ్వు, నిన్ను ఫాలో చేశాడు. నువ్వు శ్యామలరావు శవాన్ని పాతి పెట్టటం చూశాడు. మేం కాశీదాసు యింటికి వెళ్లేసరికి భయపడుతూ అన్ని విషయాలూ చెప్పాడు" అన్నాడు శశి కాంత్.

చేసేదిలేక తన నేరాన్ని అంగీకరించాడు గురు. గురుని నమ్ముకొని భర్తనే పరలోకానికి పంపించినందుకు సిగ్గుతో తల దించుకొంది సుశీల. గురు, సుశీల చేతులకి బేడీలు బిగుసుకొన్నాయి. ▢

విగ్గుకోసం ?

నన్ను ఖైదు చేయండి

శివరామ్

నేను పోలీస్‌స్టేషన్ వెళ్ళేసరికి రెడ్డి తన సీట్లో తల పట్టుకొని కూర్చునున్నాడు.

అతనికి ఎదురుగ్గా కూర్చుని ఉన్నతను.

"సార్! సార్! దయచేసి నామాట వినండి! నన్ను ఖైదు చేయండి!" అంటున్నాడు దీనంగా.

అతని మాటలు వినగానే నాకు ఆశ్చర్యంవేసింది.

"ఏమిటి రెడ్డీ? ఏమిటి విషయం?"

కూల్‌గా ప్రశ్నించాను.

నన్ను చూడగానే రెడ్డిమొఖం వికసించింది

"సమయానికి వచ్చావ్ బ్రదర్! రా! ఈయన చూడు! గంట సేపట్నుంచి నా ప్రాణాలు తీస్తున్నాడు. నువ్వాన్నా చెప్పు!" అన్నాడు రెడ్డి విసుగ్గా.

ఎదురుగ్గా కూర్చున్నతని వేపు పరీక్షగా చూసాను.

అతని వయస్సు నలభై ఏళ్ళుండొచ్చు. మాంచి గట్టి శరీరం. చెయ్యెత్తుమనిషి. దుస్తులనుబట్టి, కూర్చున్న తీరునుబట్టి ధనవంతునిలా అన్పిస్తున్నాడు.

అతనివైపు తిరిగి, "ఏమిటండీ? మీ ప్రాబ్లెం!" అడిగాను విదానంగా.

అతను దిగులుగా, "చూడండి సార్! ఈ మధ్య నాకు తరచుగా కలలువస్తున్నాయి. నేను నా భార్యని హత్యచేసినట్టు—కత్తితో పొడవగానే రక్తం చిందినట్టు—ఓహ్! అది నేను భరించలేకున్నాను. నన్నరెస్ట్ చేయమనండి! ప్లీజ్!"

అతని మాటలు విచిత్రంగా అన్పించాయి.

"నా మాట విని మీరు సైకియాటిస్టుని కలవండి! పోలీసుల్ని కాదు!" అనునయంగా అన్నాను.

"అన్నీ అయినాయండీ! నా తమ్ముడు రామరాజు నగరంలోనే పేరున్న సైకియాటిస్ట్. పైగా హిప్నటిస్టు. వాడు కూడ నయం చేయలేకపోయాడు. ఏ క్షణాన నేను హత్య చేస్తానోనని భయంగావుంది. దయచేసి నన్ను ఖైదు చేయండి!"

రెడ్డివైపు నిస్సహాయంగా చూసాను.

విచిత్రమైన కేసిది!

"మిమ్మల్ని అరెస్ట్ చేయగానే మీకు కలలురావడం తగ్గుతాయా? సెల్‌లోనైనా రావచ్చుగా?"

"పర్లేదు"

ఉత్సాహంగా అన్నాడతను.

"సెల్‌లో ఉంటే కదలడానికి వీలుండదుగా! కేవలం రాత్రి పూట ఖైదులో ఉంచండి, చాలు! ప్లీజ్!"

అభ్యర్థనగా అడిగాడతను.

ఆయనకేం చెప్పాలో అర్థంకాలేదు.

చంపుతున్నట్టు కలలొస్తాయని ఖైదు చేయమనడం—నిజంగా వండర్‌ఫుల్ కేసిది.

ఇంతలో రెడ్డి ఉత్సాహంగా ముందుకు వంగి,

"ఓ పనిచేయండి! మీ గది తలుపులు గడియ వేసుకొండి! లేకుంటే గది బైట తాళం వేయండి!"

అతను నిస్పృహగా చూసాడు.

"నాకు నిద్రలో లేచి నడిచే అలవాటుంది. అందువల్ల నేను కిటికీలోనుంచైనా దూరి బైట రాగల అవకాశాలున్నాయి"

రెడ్డి నిరుత్సాహంగా కుర్చీలో వెనక్కి వాలాడు.

"పోనీ! ప్రతిరోజు రాత్రి ఓ మనిషిని కాపలా వుండమనండి!"

ఇవన్నీ వేస్టు అయిడియాలని—అసలు అతనితో మాట్లాడటమే టైమ్ వేస్టు అని నాకు అన్పిస్తున్నా పైకి ఓ సలహా ఇచ్చాను.

"ఊహూ!"

తల అడ్డంగా వూపాడతను.

"అది జరిగే పనికాదు. నేను కొద్దో, గొప్పో పరువు ప్రతిష్టలున్నవాడిని. పనివాడ్ని నియమించుకొని పరువు

పోగొట్టుకోలేను"

రెడ్డి ఇమ్మిడియట్‌గా అందుకొన్నాడు.

"అలా అయితే.... రోజూ రాత్రి మీరు జైలులో గడిపితే మీ పరువేం కావాలి?"

అతను చిక్కిపోయినట్టు చూసాడు.

అయితే అదీ ఓ రెండు నిమిషాలే!

"అయిడియా!"

అంటూ ఉత్సాహంగా చిటికవేసాడు.

"ప్రతిరోజు రాత్రి మారువేషంలో వస్తాను."

రెడ్డి అతనివైపు చూసాడు.

ఆ చూపులకే శక్తి వుంటే అతను నిలువునా బూడిదయ్యేవాడు.

విసుగ్గా తల విదిలించి, "ప్లీజ్! దయచేసి వెళ్ళండి!" అన్నాడు అభ్యర్థనగా.

అయినా, రెడ్డి స్వరంలో కాఠిన్యం కొట్టవచ్చినట్టు కన్పిస్తున్నది.

అతను సీరియస్‌గా లేచి నిల్చున్నాడు.

"అంతేనా?" బెదరిస్తున్నట్టుగా అడిగాడు.

రెడ్డి సమాధానం చెప్పలేదు.

"సరె. చెప్పవలసిన వారి దగ్గర్నుంచి చెప్పిస్తాను. వస్తాను" అంటూ విసురుగా బయటికి నడిచాడు.

"వెధవ ఉద్యోగం! ప్రతివాడికీ లోకువే!"

అంటూ విసుక్కున్నాడు రెడ్డి.

అతని భుజంమీద చేయివేసి చిన్నగా నవ్వాను.

"టేకిట్ ఈజ్! పద పోదాం!"

అంటూ లేచాను.

మా స్నేహితుడి పెళ్ళికి వెళ్ళడానికి స్టేషన్‌కి వచ్చాను.

ఆ స్నేహితుడు రెడ్డికీ స్నేహితుడే కనుక ఇద్దరంకల్సి బయల్దేరాం.

2

పెళ్ళి చాలా బాగా జరిగింది. ఈడు, జోడు ఇద్దరూ అతికినట్టుగా వున్నారు.

పెళ్ళి కాగానే తిరిగి బయల్దేరాం, మా స్నేహితుడు వుండమంటున్నా.

స్టేషన్ కెళ్ళేసరికి కాన్‌స్టేబుల్ ఎదురొచ్చాడు.

"సార్! సర్కిల్‌గారు ఇప్పటికే రెండుసార్లు ఫోన్ చేసారు. అర్జెంటట!"

రెడ్డి నా వైపు చూసాడు.

ఆ చూపుకర్థం 'భుజంగరావు ప్రాబ్లంకాదుగదా!" అని,

సారీ! భుజంగరావ్ ఎవ్వరో చెప్పలేదు కదా! రెండు గంటల క్రితం దాక నన్ను ఖైదు చేయండి; అంటూ గోల చేసిన వ్యక్తి.

అనుకున్నట్టుగా స్టేషన్‌లో భుజంగరావు కూర్చుని వున్నాడు.

రెడ్డి అతనివైపు విసుగ్గాచూసి, సి.ఐ. కి రింగ్ చేసాడు.

"హలో!"

అంటూ విషయం అడగబోయేసరికి.

"రెడ్డి! భుజంగరావుని ఖైదుచెయ్యి! పర్లేదు! అన్ అఫిషియల్‌గానేలే! ఏమన్నా జరిగితే నే వున్నానుగా!" అంటూ నవ్వాడు.

"యస్ సార్!" అంటూ ఫోన్ పెట్టేసి రెడ్డి నా వైపు నిస్పృహగా చూసాడు.

విషయం అర్థమైన నాకు అక్కడ వుండాలంటే మనస్కరించలేదు.

రెడ్డిలాంటి వ్యక్తులు ఈ వ్యవస్థలో పుండతగిన వాళ్ళు కాదు.

భుజంగరావు వైపు చూసాను.

చిన్నగా నవ్వాడతను.

తళక్‌మని మెరిసింది ముందు వరుసలో బంగారపు పన్ను.

రెడ్డి అతనివైపు తిరిగి, "ఎన్ని గంటలకి వస్తారో చెప్పండి?" అన్నాడు నీరసంగా.

"రోజు తొమ్మిదింటికంతా వచ్చేస్తాను ఇన్‌స్పెక్టర్ గారూ? తెల్లవారఝామునే ఐదుగంటలకి వదిలేయండి!"

"సరే! కానిస్టేబుల్‌కి చెబుతాను!" అంటూ కుర్చీలో వెనక్కివాలాడు రెడ్డి.

"వస్తాను ఇన్‌స్పెక్టర్! రాత్రి తొమ్మిదింటికల్లా వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు భుజంగరావ్.

"నేకూడ వస్తాను రెడ్డి!"

అంటూ వెస్పాని స్టార్ట్‌చేసి ఆఫీసువైపు పోనిచ్చాను.

"ఏమిటో? ఈ పై అధికారులు మెహర్బానికీ లొంగిపోవడం, క్రిందవాళ్ళను బాధించడం!"

అనుకొంటూ టర్నింగ్ తిప్పబోయాను.

సడన్‌గా ఓ పాప ఎదురొచ్చింది.

చప్పున బ్రేక్ నొక్కాను.

ఫర్‌గాడ్‌సేక్! ప్రమాదం జరగలేదు. కానీ కంగారు పడటంతో ఆ పాప క్రింద పడింది.

స్కూటర్ స్టాండ్‌వేసి, వెళ్ళి ఆ పాపను లేవదీసాను.

పెద్ద దెబ్బలేం తగల్లేదు. ఇంతలో ఆపాప తండ్రి వచ్చాడు.

రాగానే విసురుగా, "చూచి నడపాలండి స్కూటర్ని!

రోడ్లుండేది మనుష్యులు కూడా నడవడానికి....”అన్నాడు కోపంగా,

చుట్టూ వున్న జనం గుమికూడారు. తలొక కామెంట్ చేయసాగారు. వాళ్ళవరస చూస్తుంటే నాకే భయం వేసింది.

మన సంఘంలో గుంపులో వున్నప్పుడు ప్రతివాడూ న్యాయనిర్ణేతే! రౌడీనే!

ఇంతలో గుంపు నెట్టుకొని ఓ వ్యక్తి ప్రవేశించాడు.

గళ్ళలుంగీ, ఎర్రషర్టు—మనిషి తీరు చూడగానే 'రౌడీ' అన్పించేటట్టున్నాడు.

అతను పెద్దగా, “ఇదిగో! నేను చెపుతున్నాను ఈయన తప్పేంలేదు! ఆ పాపే రోడ్డుకు అడ్డంగా పరిగెత్తింది!” అన్నాడు బీడి వెలిగిస్తూ.

అతనివైపు కృతజ్ఞతగా చూసాను.

పాప తండ్రి గొణుక్కొంటూ వెళ్ళిపోయాడు.

చుట్టూవున్న జనం తప్పుకున్నారు.

“మీరు పదండి! గురూగారు!” అన్నాడు ఆ వ్యక్తి లుంగీని పైకి మడుస్తూ,

“థ్యాంక్స్!” అంటూ బయల్దేరాను.

సమయానికి వచ్చి అతను చెప్పకుంటే....మైగాడ్! రెచ్చిపోయిన జనం ఏమైనా చేసేవారు. చూడ్డానికి రౌడిలా వున్నా, అతనెవరో మంచివాడిలా వున్నాడు, అనుకొంటూ ఆఫీసుకు చేరాను.

3

రెండురోజుల తర్వాత, రెడ్డి దగ్గర్నుంచి ఫోన్‌కాల్ వచ్చింది.

“హలో!” అని, విషయం విని నిర్ఘాంతపోయాను.

భుజంగరావ్ భార్య హత్యచేయబడిందట!

వెంటనే వెస్పాలో పోలీస్‌స్టేషన్ ముందు ప్రత్యక్షం అయ్యాను.

నన్ను చూసిన రెడ్డి, "పద! పద! నీ కోసమే వెయిట్ చేస్తున్నాను."—అన్నాడు హడావిడిగా.

ఇద్దరం భుజంగరావ్ ఇంటికి బయల్దేరాం.

ఇంటికి చేరేసరికి భుజంగరావు వెక్కి-ళ్ళుపెట్టుతూ ఏడుస్తున్నాడు.

బెడ్‌రూమ్‌లో బాడీని చూసేసరికి 'కల' జ్ఞప్తికొచ్చింది.

కత్తి చివరంటా దిగబడివుంది పిడిదాక. రక్తంచింది బెడ్ అంతా తడిసిపోయివుంది ఆమె కళ్ళలో ఆశ్చర్యం కన్పిస్తున్నది.

భుజంగరావ్‌వైపు చూసాను.

అతని ముఖం నటన కాదన్పించింది.

మాతో వచ్చిన వేలిముద్రల నిపుణుడు కత్తిని పరీక్షగా చూపి పెదవి విరిచాడు.

అంటే! వేలిముద్రలు లేవన్నమాట:

ప్రక్క-నున్న గదిలోకి నడిచాము.

లోపల ఐరన్‌సేఫ్ తెరిచివుంది. అందులో భుజంగరావు, అతని భార్య ఫోటో ఒకటివుంది.

ఐరన్‌సేఫ్‌లో భార్యభర్తల ఫోటో!

దేవుడి ఫోటో వుండాల్సింది!

"విచిత్రం!"

ప్రక్క-నున్న డాక్టర్. హత్య బహుశ రాత్రి పది పన్నెండు మధ్య జరిగివుంటుందన్నాడు.

రెడ్డివైపు చూసి కళ్ళెగరేసాను.

"భుజంగరావ్ అప్పుడు సెల్‌లోనే వున్నాడుగురూ!"

అన్నాడు మెల్లిగా.

నా కంటే ముందుగానే తెల్సుకొని వున్నాడన్నమాట!

ఐరన్ సేఫ్ తెరిచివుంది కనుక దొంగతనం కోసంవచ్చి, చేయబడిన హత్య కాదుగదా!

భుజంగరావ్ కష్టడీలో వున్నాడు గనుక నా ఊహ పై విధంగా పరుగుతీయ సాగింది.

తీక్షణంగా ఆలోచించసాగాను.

ఐరన్ సేఫ్ మీద వేలిముద్రలుంటాయేమోనని చెక్ చేయబోయిన వేలిముద్రల నిపుణుడు

"సార్!" అంటూ ఆదుర్దగా పిల్చాడు.

"ఏమిటి?" ఆతృతగా అడిగాను.

ఐరన్ సేఫ్‌లో ఓ మూలనున్న కెమెరాను చూపించాడు. సేఫ్ తలుపుమూసి, తెర్చాను.

'చక్'మంటూ మెరుపు మెరిసింది.

జాగ్రత్తగా కెమెరాలోనుంచి ఫిల్మ్ తీసి రెడ్డికి అందించాను.

"క్విక్ రెడ్డి! నిమిషాల్లో డెవలప్ కావాలి?"

అ మాట అనడమే ఆలస్యం రెడ్డే స్వయంగా బయల్దేరి వెళ్ళాడు.

భుజంగరావును కదిలించడం వేస్టు!

ప్రక్కనున్న నౌఖర్ని పిల్చాను.

"శవాన్ని ముందు చూసింది నువ్వేనా?"

భయంగా తలాడించాడు.

"అవునండి! అయ్యగారు రాత్రల్లా లేరండి! తెల్లవారు ఝామునే వచ్చి అమ్మగార్ని పిలు! అన్నారండి! లోపలి కొచ్చి చూస్తే....అయ్య బాబోయ్! అంటూ కేకెట్టానండి! అంతేనండి! బాబుగారు పరిగెత్తుకుంటూ వచ్చి పెద్దగా

బావురుమన్నాడు. నేను పోలీసులకి ఫోన్ చేసానండి!"

చకచక చెప్పుకొచ్చాడు.

రాత్రి భుజంగరావ్ రాలేదని పోలీసులు, నౌఖరు యిద్దరూ కన్‌ఫర్మ్ చేసారు.

"రాత్రిపూట యింట్లో యెవరెవరుంటారు?"

నౌఖరు కళ్ళలో భయం చిందులేసింది.

"నేనూ, మా యావిడండి! అదేమో వంటమనిషండి! డ్రైవర్ ప్రొద్దుటొచ్చి, సాయంకాలం పోతాడండి!"

అతని గొంతు వణుకుతున్నది.

నౌఖరు భయం అర్థమైంది.

అతన్ని అనుమానిస్తున్నామని భయపడుతున్నాడు.

ఆలోచనలో వుండగానే రెడ్డొచ్చాడు.

అతని మొఖంలో ఆశ్చర్యం తాండవిస్తున్నది.

"నీకో సర్‌ప్రైజు న్యూస్ చెప్పనా? ఈ ఫోటోలో వ్యక్తిలానే భుజంగరావు 'మారువేషంలో' వచ్చి జైల్లో వుండేవాడు" అంటూ ఫోటో అందించాడు.

రెడ్డి వ్యాఖ్యానం పట్టించుకోలేదు.

ఫోటో చూసి ఆశ్చర్యపోయాను.

అందులో పెద్దగా నవ్వుతున్నట్టు స్టిల్.

మొన్న జరిగిన స్కూటర్ యాక్సిడెంట్ అందులో నన్ను సపోర్టు చేసిన వ్యక్తి. గళ్ళలుంగీ, ఎర్రపట్టు జుబ్బా జ్ఞప్తికి వచ్చింది.

"మైగాడ్! రెడ్డి, యితన్ని నేను మీ స్టేషన్ చౌరస్తా దగ్గర చూచాను" ఆశ్చర్యంగా అన్నాను.

రెడ్డి ఉత్సాహంగా ముందుకు వంగాడు.

"అయితే యికనేం! వాడి సంగతి తేలుద్దాం! పద!"

అంటూ కదిలాడు.

అతని వెనకనే వెస్పాతో నేనూ కదిలాను.

4

ఇద్దరం వెతుక్కుంటూ చౌరస్తా దగ్గరికొచ్చాము. వెను కనే పోలీస్ వ్యాన్. అతనెక్కడా కన్పించలేదు.

ఫోటో అందుకొని ప్రక్కనున్న కిళ్ళీ దుకాణం వేపు కదిలాను.

అతనికి ఫోటో అందించి,

"ఈ ఫోటోలో వ్యక్తి ఎక్కడుంటాడో చెప్పగలవా?"

అతను నావైపు చూపి, "ఎందుకు?" అన్నాడు నిర్ల క్ష్యంగా.

అప్పటిదాక ప్రక్కనున్న రెడ్డి, "పనుంది" అంటూ ముందుకొచ్చాడు.

పోలీస్‌లను చూడగానే అతను ఉలిక్కిపడ్డాడు.

"అదిగోండి సార్! ఆ టర్నింగ్‌లోనే అతనిల్లు. శామ్యుల్ అని అడిగితే చెపుతారు" అన్నాడు తడబాటుగా.

చిన్నగా నవ్వుకొన్నాను. ఈ సంఘంలో కొందరు 'అధికారానికి' తప్ప, మామూలుగా లొంగరు.

ఇద్దరం ఆవైపు నడిచాం.

ఇల్లు తేలిగ్గానే కనుక్కొన్నాము.

ఇంటిముందు నిలబడి, "శామ్యూల్" అని పెద్దగా పిల్చాడు రెడ్డి.

"ఎవరూ?"

అంటూ బయటికి వచ్చిన శామ్యుల్ రెడ్డిని చూడగానే ఉలిక్కిపడ్డట్టు అయిపోయాడు.

"ఏం సార్?"

అతని కంఠంలో గౌరవ భావం తొణికిసలాడుతున్నది.

"నిన్నరాత్రి యెక్కడున్నావ్?"

కరుకుగా అడిగాడు రెడ్డి.

అతను యిబ్బందిగా చూశాడు. "ఇంట్లోనే...." అంటూ గొణిగాడు.

"నిజం చెప్పు!"

రెడ్డి చేతిలో లాఠీ నెమ్మదిగా విన్యాసం చేయబోయింది.

అతను భయంగా చుట్టూ చూసాడు.

"సార్! నన్నేం చేయకండి! నిజం చెప్పేస్తాను! రాత్రి ఓ పెద్దమనిషొచ్చాడు. అతని బదులు నేను జైలులో వుంటే ఓ అయిదొందలిస్తానన్నాడు. ముందు భయపడ్డాను. ఆతను రేటు పెంచాడు. ఒప్పుకొనేసాను."

ఆ మాట వినగానే రెడ్డి మొహం వెల వెల పోయింది.

"రెడ్డీ! జ్ఞప్తికి తెచ్చుకో! భుజంగరావ్ ఐమీన్ శామ్యుల్ యెన్నిగంటలకి వచ్చాడు నీ దగ్గరికి?"

రెడ్డి, కాన్‌స్టేబుల్ని పిల్చాడు.

"రాత్రి తొమ్మిదింటికి వచ్చారు సార్!" అన్నాడు అతను అడగ్గానే.

"ఐసీ! శామ్యుల్ వేషం వేసుకొని రెండురోజులు పోలీస్‌వార్ని నమ్మించి, మూడోరోజు భుజంగరావ్ హత్య చేసుంటాడు. తను జైలులో వున్నాడు కనుక అనుమానం అతనిమీదికి రాదనికొని వుండొచ్చు."

నా ఆలోచన అన్ని రెడ్డికి చెప్పాను.

అతను పళ్లు పటపట కొరికాడు.

"బాస్టర్డ్! మా సాక్ష్యంతోనే హత్యకు ఎలీబీ సృష్టించుకోవాలనుకొన్నాడన్న మాట! రైట్! వాడి సంగతి తేలుస్తాను" అన్నాడు ఉద్రేకంగా.

శామ్యుల్ని తీసుకొని భుజంగరావు యింటికి బయల్దే

రాము.

ఈలోగా భుజంగరావు 'బాధ' లోనుంచి కొద్దిగా తేరు కున్నట్టున్నాడు.

శామ్యూల్ భుజంగరావ్‌ని చూడగానే, "అదిగో సార్! అతనే నాకు డబ్బిచ్చింది" అన్నాడు ఉత్సాహంగా.

ఆ మాటకు భుజంగరావ్ ఏ విధంగాను 'రియాక్టు' కాలేదు. అతను నిర్లిప్తంగా.

"ఎవరండి యితను?" అని అడిగాడు.

ఆ మాట వినగానే రెడ్డి మండిపడ్డాడు.

"డామిట్! పిచ్చివేషాలు వేయకు! శామ్యూల్‌లా మారు వేషంలో రెండురోజులు సెల్‌లో గడిపి మమ్మల్ని నమ్మిం చావ్! మూడోరోజు శామ్యూల్నే సెల్‌లో వుంచి హత్య చేసావ్ నీ భార్యని!"

"సార్! అసలే భార్యపోయిన దుఃఖంలో వున్నాను. నామీద జోకులేయకండి! నేనింతవరకు శామ్యూల్ అనే యితన్ని చూడలేదు."

శామ్యూల్ మటుకు "సార్! అబద్ధం చెపుతున్నాడు సార్! వెయ్యిరూపాయలు యిస్తాను, సెల్‌లో గడప మన్నాడు. నన్ను నమ్మండి! నేనీ హత్య చేయలేదు" అన్నాడు బెదురుగా.

ఇద్దరివంక అలానే చూడసాగాను.

ఎవరు చెప్పేది అబద్ధం?

ఎవరు నిజం చెబుతున్నారు?

భుజంగరావ్—నిజంగా యితను హత్య చేయాలను కొంటే, జైలులో ఉన్నట్టు నటించడం, శామ్యూల్ గుర్తు

పట్టేట్టు వెళ్ళి డబ్బివ్వడం—ఇంత రిస్క్ తీసుకోనక్కర లేదు.

వెయ్యిరూపాయలు ఖర్చుపెట్టగలిగిన వ్యక్తి 'ఇంకొద్దిగా' ఖర్చుపెడితే హత్యలు చేసేవాళ్ళకి కొదవ లేదు ఈ లోకంలో.

ఇక శామ్యూల్ డబ్బుకోసం ఏమైనా చేయగల వ్యక్తి. హత్యచేసుండడని గ్యారంటీ ఏమిటి?

తీవ్రంగా కదులుతున్నాయి ఆలోచనలు.

శామ్యూల్ మొహంలో భయం తాండవిస్తున్నది.

భుజంగరావుకి దుఃఖం తన్నుకొస్తున్నది.

రెడ్డి టక్కున కోపంగా, "భుజంగరావ్! శామ్యూల్! ఆఖరుసారి హెచ్చరిస్తున్నాను! నిజం చెబుతారా? ఇద్దర్నీ అరెస్టు చేయమంటారా?"

"ఇన్‌స్పెక్టర్! నిజంగా హత్య చేయాలనుకొంటే మీ దగ్గరి కొచ్చి యెందుకలా 'సెల్'లో గడుపుతాను. నా భార్యంటే నాకు పిచ్చి ప్రేమ. అందుకే ఐరన్ సేఫ్‌లో మా యిద్దరి ఫోటో వుంచాను. దేవుడి బొమ్మకూడా లేకుండా. నన్ను నమ్మండి!" అన్నాడు భుజంగరావు. ఏడుపు తన్నుకొస్తున్నది అతడికి.

"సార్! నన్ను నమ్మండి! హత్య చేసేంత ధైర్యం నాకు లేదు. వెయ్యి రూపాయలకు గడ్డితిన్నాను సార్!" శామ్యూల్ కాళ్ళు పట్టుకొనేంత పనిచేసాడు.

రెడ్డి నిస్సహాయంగా నావంక చూసాడు.

ఎలా పరిష్కరించాలీ కేసు?

ఆలోచనలతో తల పగులుతున్నట్టు వుంది. ఒక్క ఫ్లాష్ ఆలోచన!

ఉత్సాహంగా ఈలేసాను.

"రెడ్డీ! ఐరన్ సేఫ్‌లో ఫోటో ఏది?" ఆదుర్దాగా అడిగాను.

రెడ్డి తీసిచ్చాడు.

ఆత్రంగా అందుకొన్నాను.

నా ఊహ నిజమైంది!

అసలు హంతకుడెవరో తెల్సిపోయింది.

"రెడ్డీ! భుజంగరావుని అరుస్టు చెయ్యి!" అన్నాను కూల్‌గా.

ఆశ్చర్యంగా చూసాడు రెడ్డి.

"అవును రెడ్డి! ఈ హత్య చేసింది భుజంగరావే! అందుకు తిరుగులేని సాక్ష్యం ఈ ఫోటోలో వుంది."

అంటూ ఫోటో అందించాను.

"నో! నేనీ హత్య చేయలేదు!" పెద్దగా అరిచాడు భుజంగరావు.

"బుకాయించకు మిస్టర్! మమ్మల్నే మోసగించాలనుకోవడం అంత మంచిదికాదు! బాగా గమనించు ఫోటోలో నీ బంగారపు పన్ను స్పష్టంగా కన్పిస్తున్నది" అంటూ ఫోటో అందించాను.

భుజంగరావు మొహం పాలిపోయింది.

చేతులుచాచి, నిర్లిప్తంగా,

"నిజమే! హత్యచేసింది నేనే! నా భార్యంటే నాకు పిచ్చిప్రేమ. అందుకే ఆమె ఫోటో సేఫ్‌లో వుంచాను. కానీ, తర్వాత తెల్సింది. ఆ పాతకికి మరొకడితో సంబంధం వుందని. అందుకే ప్లాన్‌వేసాను. నా చేతుల్తో నేనే స్వయంగా చంపాలని—ఇలా ప్లాన్ వేసాను.

అనుకున్నట్టే హత్యచేసాను. రక్తం వస్తుంటే, గిల గిల లాడుతుంటే ఆనందంగా పొంగిపోయాను. దొంగ తనం కోసం చేసిన హత్య అనుకోవాలని ఐరన్ సేఫ్ తెరిచి వుంచాను.

ప్రేమించి పెళ్ళాడిన భార్య ఫోటో కన్పడగానే పెద్దగా నాలో నేనే నవ్వుకొన్నాను. ఆ నవ్వే నన్ను పట్టించింది!" అంటూ ముగించాడు భుజంగరావ్!

శామ్యూల్ నావంక కృతజ్ఞతగా చూసాడు.

శామ్యూల్ భుజంమీద తట్టి,

"చూడు! డబ్బుకు లొంగిపోకు! అలా లొంగితే ఇలా 'ఓవర్ ఐడియా' లేసే మనుష్యుల చేతిలో పడతావు!"

అని రెడ్డితోపాటు వెస్పా దగ్గరికి నడిచాను. □

కట్నం తెచ్చిన అమ్మాయి!



నిషా అబద్ధమాడదు!

వసుంధర

ఆఫీసులో లంచవర్లో చాలా పెద్ద హడావుడి. అందరూ విశేషాల నదేపనిగా చెప్పుకుంటున్నారు. అసలు విశేష మేమిటంటే శివశంకరం అంతకు ముందురోజు పార్టీ చేశాడు.

శివశంకరం భార్య ఊళ్ళోలేదు. పార్టీ కతడందరూ

మగవాళ్ళనే పిలిచాడు. పార్టీలో ఆఖరున అతడందరిచేతా కొద్దికొద్దిగా భంగుతినిపించాడు.

ఒకరకం ఆకులనుంచి తయారయ్యే భంగు — మత్తు పదార్థం. తాగుడును మించిన నిషానూ, స్వర్గానుభూతినీ యివ్వడమేకాక—పూర్తిగా పరిసరాల స్పృహ పోగొడుతుంది. భంగు ఆకులను నీళ్ళలో ఉడకబెట్టి తాగేవారు కొందరైతే—ఆ ఆకుల నెండబెట్టి తయారుచేసిన భస్మాన్ని సేవించేవారు కొందరు. ఈ భంగు ఉత్తర, తూర్పు భారతాల్లో చాలామందిచే శుభకార్యాల్లో కూడా సేవించబడుతుంది.

శివశంకరం భంగివ్వడం వరకూ మామూలు కథే! ఆ తర్వాతే అసలు కథ....

పార్టీకి పన్నెండుగురు వచ్చారు. వారిలో ఆరుగురిపై భంగు చూపిన ప్రభావం అంతంత మాత్రం. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు ఆ నిషాలో ఆఫీసర్ని దుమ్మెత్తిపోశారు. వాళ్ళు తిట్టిన తిట్లు వినసొంపుగా వున్నాయి.

ఆఫీసర్ని తిట్టడానికెంత కాలంగా అటువంటి పదజాలం మనసులో దాచుకున్నారో తెలియదు కానీ—వారినోట అటువంటి పదజాలం వినడం అందరికీ అదే మొదటిసారి. అందులో ఒకడు ఆఫీసరు చెంచాగా భావించబడుతున్నవాడు. అతడైతే ఆఫీసరు చేస్తున్న అవకతవక పనులు కొన్ని చెప్పి—ఏదో ఒకరోజున ఆఫీసరు పాపం పండక పోదని కూడా అన్నాడు. ఆఫీసరు గురించి అతడికలాంటి యోచన వున్నదని యెవరికీ తెలియదు.

మిగతా ముగ్గురిలో ఒకడి బాధంతా సిల్కు స్మిత గురించి. ఆమె చక్కని నటి అంటాడు. సీతాకోకచిలుకలో ఆమె నటన చూపి ముమ్ముందు సావిత్రివంటి మహానటి అయి

పోతుందనుకున్నాట్ట. తనకు పెళ్ళి అయిపోబట్టి కానీ లేకుంటే స్మితనే పెళ్ళి చేసుకునేవాట్ట. ఈసారి భాగ్య లక్ష్మిలో ప్రైజొస్తే—స్మితతో ఓ ఆర్ట్ ఫిల్మ్ తీస్తా నన్నాడు. దానిలో స్మిత నటనకి జాతీయ ఉత్తమ బహూ మతి వచ్చి తీరాలన్నాడు

అతడి మాటలకందరూ నవ్వితే—"ఏం—ఉమ్రావ్ జాన్ తీయబట్టే కదా రేఖకు ఉత్తమనటి బహుమతి వచ్చింది" అని బదులిచ్చాడు.

అతడి సంగతలాగుంటే యింకొకడి కోపమంతా ఆ ఊళ్ళోని దేవత థియేటరు ఓనరు మీద. థియేటర్లో ఎప్పుడూ టికెట్లు సులభంగా దొరకవు. అందుకనే నాలుగైదు సార్లు ప్రయత్నించాక అత డా థియేటర్లో సిని మాలు చూడకూడదని నిశ్చయించుకున్నాట్ట ఆ విషయం థియేటర్ యజమానికి ఉత్తరం కూడా రాశాట్ట.

ఈ విషయం యెవరికీ తెలియదు. వ్యవహారం ఉత్తరం దాకా వెళ్ళిందని అంతా ఆశ్చర్యపడితే—ఆ తర్వాతేమైందని అడిగారు.

"ఆ ఓనర్ కి గీరెక్కువ. నేను రాసిన ఉత్తరాన్ని లక్ష్య పెట్టలేదు. నాకు బదులివ్వలేదు. నాకేమాత్రం వీలున్నా అతగాణ్ణి జైల్లో పెట్టించేస్తాను. అయినా వాడిననుకుని ఏం లాభం? ప్రజలకూ బుద్ధిలేదు. అడ్వాన్సు బుకింగ్ పేరుచెప్పి టికెట్లు బ్లాక్ చేస్తున్నాడని అందరికీ తెలుసు. అయినా యెవ్వరూ ఆ థియేటర్లో సినిమాలు చూడ్డం మానడంలేదు. ఈ విషయంలో నే నొంటరిగాడినై పోయాను ...."

అందరి విశేషాలూ యిలాగుంటే—వారందరిదీ ఒకెత్తు సీతాకరరావు విశేష మొక ఎత్తూలాగుంది.

సీతాకరరావు మెత్తటి మనిషి. పెళ్ళయింది. ఇద్దరు

పిల్లలు. పెద్దపిల్లనీ మధ్యనే ఎల్కేజీలో చేర్పించాడు.

అతడు ఆడవాళ్ళ గురించిన అసభ్యప్రసంగాలు వినడు. కొలీగ్సుతో యెక్కువగా కలవడు. కలిసినపుడల్లా నీతులు చెబుతాడు.

"మనకూ చెల్లెళ్ళున్నారు. సాటి ఆడదాని గురించి తోచినట్లు మాట్లాడడం సంస్కారమనిపించుకోదు...." అనియించుమించు ఆఫీసులో అందర్నీ అతడు హెచ్చరించివున్నాడు.

అసలా చర్చలకు మూలకారణం లైలా. ఆమె ఆఫీసులో టైపిస్టు. మనిషి మెరుపుతీగలా వుంటుంది. అందరితోనూ చొరవగా మాట్లాడుతుంది. దుస్తుల్లో ఆధునికత— ఆమె శరీరపు వంపులు బయటపెట్టడానికే ఎక్కువ సహకరిస్తుంది. ఆమెను చూస్తే— మగాళ్ళ పరిచయం కోసం పడి చస్తుందా అనిపిస్తుంది. ఆమె బాయ్‌ఫ్రెండ్సుతో సినిమాలకు వెడుతుంది. ఒకో బాయ్‌ఫ్రెండ్‌తో ఒక్క సినిమా మాత్రమే చూస్తుంది.

ఆఫీస్‌లో చాలామందికి ఆమెతో తిరగాలని వుంది. కానీ అందులో పనిచేస్తున్న మగాళ్ళందరూ పెళ్ళైనవాళ్ళు! లైలా ఎలాంటిదో తెలియదు కానీ తమ భార్యలెలాంటివాళ్ళో వారికి బాగా తెలుసు. అందుకని యెవ్వరూ రిస్కు తీసుకోవడం లేదు. అయితే ఆఫీసులో ఆమెనెవ్వరూ వదలరు. వీలున్నపుడల్లా ఆమెతో కబుర్లు చెబుతూంటారు. ఆ కబుర్లనిండా ఆమెకు అభినందనలే!

లంచవర్లో ఆమెకు నిర్దేశించబడిన స్థలం వేరు. అప్పుడీ మగధీరులంతా కలిసి ఆమెగురించి అసభ్య చర్చలు జరుపుతారు.

ఇదే సీతాకరరావు నిరసించేది.

ఎదురుగా పొగడ్డమూ, చాటుగా యిలా మాట్లాడ్డమూ - సంస్కారులకు తగదని అతడెంతో బాధపడతాడు. అతడి బాధ మిగతావారికి వినోదం. అతణ్ణి ఏడిపించాలని మరీ కొందరామెను గురించి మాట్లాడి రెచ్చగొట్టేవారు.

ఈ సీతాకరరావు అసలు రంగు భంగు నిషాలో బైట పడింది. అతడెక్కువ లైలాతో మాట్లాడలేదు కానీ దూరాన్నుంచే ఆమె వంపు సొంపులను అంచనా కూడా వేశాడు. అతడి కామెపై మనసుగా ఉంది. ఆఫీసులో నాలుగు మాటలు మాట్లాడే అవకాశం వస్తే చాలు....ఆమెను తనాకర్షించగలడట; కానీ ఏకాంతమే దొరకడంలేదు అందుకతడు సుదర్శనం అనే మరో కొలీగును నిందించాడు.

"బాడీగార్డులా ఎప్పుడూ ఆమెను వదలడు. నాకూ లైలాకూ మధ్య అడ్డుగా నిలుస్తున్నాడు...."

ఈ రోజు ఆఫీసులో అందరూ చెప్పుకుని ఆనందిస్తున్న విశేషమిదే!

ఈ విశేషాన్నపురూపంగా వింటున్నవారిలో గోవర్ధనం ఉన్నాడు.

గోవర్ధనానికీ శివశంకరం నుంచి పిలుపు అందింది. అతడు సీతాకరరావు వంటివాడు కాదు. లైలా గురించి జరిగే సరదా చర్చల్లో అతడు పాల్గొనకపోయినా, ఆ చర్చలతడికి నచ్చకపోయినా—ఆ విషయం బయట పెట్టడు. తనూ ఎంజాయ్ చేస్తున్నట్లే నటిస్తాడు. అతడిని లైలా పెద్దగా ఆకర్షించనూ లేదు. ఆమెను గురించిన ఆలోచన అతడి బుర్రలోనూ ఉండవు. అలాగని అతడు శ్రీరామచంద్రుడూ కాడు.

అతడికి పెళ్ళై పదినెలలే అయింది. భార్య అందగత్తె అవునో కాదో చెప్పలేంగానీ అతడి మనసుకు అన్నివిధాలా

నచ్చింది. అతడామెను వదలి క్షణం కూడా ఉండలేడు. ఆఫీసుపని కాగానే అతడు ఇంటికి పోతాడు. యిద్దరూ కలిసి సినిమాకో, విహారానికో వెడతారు. ఆ కార్య క్రమంలో తేడా రావడానికి వీల్లేదు. స్నేహితులెవరైనా పిలిస్తే—భార్యతో కలిసి వెళ్ళడానికి వీలున్నప్పుడే వెడతాడు. నిన్నటి శివశంకరం ఆహ్వానం కేవలం మగ వాళ్ళకు మాత్రమే కావడంవల్ల—అతడాపార్టీకి వెళ్ళలేదు. అయితే ఆ కారణం చెప్పకుండా మరో కారణమేదో చెప్పాడు.

శివశంకరం మాత్రం—"కుర్రాడికింకా కొత్తమోజు తీరలేదు. మనమూ బలవంత పెట్టకూడదు...." అంటే అందరూ నవ్వారు. గోవర్ధనం తనూ నవ్వాడు.

ఆ తర్వాత పార్టీకి రానివాళ్ళు కొందరు—భంగువేసు కుని వుంటే ఏం మాట్లాడేవారో—ఒకతడు—మిమిక్రీ చేశాడు.

అంతా అదికూడా ఎంజాయ్‌చేశారు లంచవరై పోయింది. గోవర్ధనానికి తనాపార్టీ మిస్సయ్యాననన్న భావన కలిగింది.

2

"బ్లూలగూన్ సినిమాట!" అన్నాడు శివశంకరం గట్టిగానే తన కొలీగ్‌తో.

ఆ వివరాలు గోవర్ధనం విన్నాడు.

అంతకు ముందురోజే ఇంట్లో అతడు భార్యతో గొడవ పడ్డాడు. ఇద్దరూ కలిసి సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. ఇంటిపద్ద ఆమె ఎదురు చూస్తోంది. ఆఫీసులో అతడికి ఓవర్ టైం తప్పనిసరయింది.

సినిమా ప్రోగ్రాం పాడయింది. అదొక్కటే అయితే అతడికి బాధ వుండేదికాదు. భార్య మూడ్ కూడా పాడ

యింది.

ఆ రాత్రంతంగా వారిద్దరూ ఎడమొహం, పెడమొహంగా వున్నారు.

"ఇంత చిన్న విషయానికి నువ్వలగడం చాలా అన్యాయం. పక్కింటి సీతమ్మగారి భర్త రోజు విడిచి రోజు సినిమా చూస్తాడు. ఆవిడ ఏడాదికొక్కసారైనా చూస్తుందో చూడదో...." అన్నాడు గోవర్ధనం.

"అయితే ఏమంటారు?"

"కావాలని నేను పొరపాటు చేయనప్పుడు—మన అదృష్టానికి పొంగిపోతూండాలి - ఇతరులతో పోల్చి చూసుకుని; అంతేకానీ విలువైన కాలాన్ని విధంగా వృధాచేయకూడదు...." అన్నాడు గోవర్ధనం.

"గుడిసెలో మనిషిని చూపి—లక్షాధికారి కోడలు తన కాకలిబాధ లేదు కదా అని సంతోషించదు. అంతస్థు, హోదా, వాతావరణాలబట్టి అలకలకు కారణాలు మారుతూంటాయి. మీకోసం ఎదురుచూస్తూ కబురు తెలియక క్షణం క్షణం నేను పొందిన బాధ, అసహనం, నిరుత్సాహం మీ కర్థం కాదు. మీరిలా మాట్లాడుతున్నకొద్దీ నాకు వళ్ళుమండిపోతోంది. దయుంచి నా దగ్గరకు రాకండి. నన్ను డిస్టర్బ్ చేయకండి .."

రాత్రి ఆమె వేరేపడుకుంది.

ఉదయానికైనా ఆమె శాంతిస్తుందనుకుంటే అదీ జరగలేదు. ఆమె అతడికి కాఫీ కలిపిచ్చింది. టిఫిన్ చేసిపెట్టింది. లంచ్ క్యారియర్లో సర్దింది. ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

"శ్వేతా—నీ కోపం పోదా?" అన్నాడతడు దిగులుగా.

శ్వేత బదులివ్వలేదు.

"పోనీ—ఏం చేస్తే నీ కోపం పోతుందో చెప్పు!" అన్నాడతడు.

"పక్కింటి సీతమ్మకు కోపంవస్తే మొగుడామెను కొడతాడు. ఆమె కోపంపోతుంది...." అంది శ్వేత.

ఆమె యింకా కోపంలో వుందని గ్రహించి "రెండింటికీ సామ్యమెలా కుదుర్తుంది? ఆమె సీత—నీవు శ్వేత!".... అన్నాడు గోవర్ధనం.

"ఆ విషయం రాత్రి తోచలేదా?" అంది శ్వేత.

ఆమెను మంచి చేసుకునేందుకు కొత్తమార్గాలు పట్టాలని అతడాలోచిస్తున్నాడు. సీతమ్మతో పోల్చి ఆమె అదృష్టాన్ని పొగిడినందుకామె కోపం రెట్టింపయిందని అతడు గ్రహించాడు.

"సరే—సాయంత్రానికైనా నీ కోపం తగ్గుతుందని ఆశిస్తాను...." అంటూ అతడాఫీసుకు వెళ్ళిపోయాడు.

ఇపుడు బ్లూలగూన్ గురించి వినగానే అతడి మనసు పరి పరి విధాలపోయింది. ఆ సినిమా గురించి శ్వేత పత్రికల్లో చాలా చదివి ఆకర్షితురాలైంది. ఎవరికీ తెలియని ఓ ద్వీపంలో ఇద్దరు పిల్లలు చేరి—ఒకరికొకరుగా అక్కడ బ్రతకడంలో ఎన్ని ఇబ్బందులు పడ్డారో....ఆంగ్ల చిత్రాల్లో సహజత్వమెక్కువుంటుంది కాబట్టి చూడాలనే అనిపించిందామెకు. ఆ విషయం భర్తకు చెప్పింది.

ఆ సినిమా చూడ్డం విషయంలో ఆమె దృక్పథం వేరు. అతడి దృక్పథం వేరు. ఏది ఏమైనా ఇప్పుడు గోవర్ధనానికో అద్భుతమైన అయిడియా వచ్చింది.

శ్వేతకూ, సీతకూ తేడా చూపిస్తే భార్య సంతోషిస్తుంది.

సీతమ్మభర్త భార్యను సినిమాకు తీసుకునివెళ్ళడు. తన

కారణంగా నిన్న తమ సినిమా ప్రోగ్రాం పాడైంది. అందుకని ఈ రోజు ఆఫీసుకు సెలవుపెట్టి మరీ సినిమాకు వెళ్ళాలి. గోవర్ధనం వెంటనే మధ్యాహ్నంపూటకు సెలవు చీటీ రాసిచ్చి—లంచవరుకు కాస్త ముందే ఇంటి దారి పట్టాడు.

శ్వేత తన మంచితనాన్నర్థం చేసుకుంటుందనీ, తన కోపం మర్చిపోతుందనీ అతడాశించాడు. ఆ ఆశతో ఉత్సాహంగా ఇంటివైపు అడుగులు వేశాడు.

అతడిల్లు చేరేసరికి టైము రెండుగంటలు కావస్తోంది.

విశేషమేమిటంటే ఇంటి తలుపులు తెరిచివున్నాయి. ఇంత నిర్లక్ష్యంగా వుండదు శ్వేత. ఆశ్చర్యపడుతూ లోపల అడుగుపెట్టాడు గోవర్ధనం.

బెడ్రూంలోంచి మాటలు వినబడుతున్నాయి. ఒకటి శ్వేతగొంతు రెండోగొంతు ఎవరో పురుషుడిది.

బెడ్రూం సమీపించేలోగానే అతడికి పురుషకంఠం స్పష్టంగా వినపడింది ...“నువు నా మాట వినకపోతే— నీ వివాహానికి ముందు మనకున్న పరిచయం-మీ ఆయనకు చెప్పేస్తాను. అందుకే బాగా ఆలోచించుకో....”

గోవర్ధనం తెల్లబోయాడు. ఆ వెనువెంటనే ఆవేశానికి లోనయ్యాడు.

ఎవడా పురుషుడు? వివాహానికి ముందామెకు పరపురుష సంపర్కముందా?

ఆవేశంలో అతడు వెంటనే గదిలో అడుగు పెట్టాడు.

గదిలో మంచంమీద శ్వేత. కాస్త దూరంగా కుర్చీలో అతడు!

అతణ్ణి గోవర్ధనం గుర్తుపట్టాడు. అతడి పేరు వేణు. శ్వేతకు మేనత్తకొడుకు. అసలిద్దరికీ పెళ్ళి జరగవలసిందే!

శ్వేత యిష్టపడలేదని విన్నాడు.

భర్తను చూసి తడబడుతూ లేచినిలబడి—"మీరా!" అంది శ్వేత.

వేణు తనూ లేచినిలబడ్డాడు. అతడి ముఖంలో కంగారుంది.

"ఎప్పుడొచ్చారు?" అన్నాడు గోవర్ధనం నవ్వడానికి ప్రయత్నిస్తూ.

అతడూ నవ్వుతూ—"ఓ గంటయింది—" అన్నాడు.

ఆఫీస్ పనిమీదొచ్చాడతడు. నాలుగు రోజులుంటాడు. అయినవాళ్ళున్నారు కదా అని వేరే ఎక్కడా దిగకుండా—సరాసరి గోవర్ధనం యింటికొచ్చాడు.

"చాలా మంచిపని చేశారు. యూ ఆర్ వెల్కం!" అన్నాడు గోవర్ధనం.

"చాలా థాంక్స్ అన్నయ్యగారూ!" అన్నాడు వేణు.

"ఏమిటి—మీ వదినతో యేమిటో తీవ్రంగా వాదిస్తున్నట్లున్నారు?" అన్నాడు గోవర్ధనం మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ.

"వాదనేముందండీ—మా యిద్దరికీ చిన్నప్పట్నించీ యిదలవాటే! ఏం మాట్లాడుకున్నా కొట్టుకున్నట్లే వుంటుంది...."

శ్వేత అతడి మాటల కిబ్బంది పడినట్లే కనబడింది—"ఏమిటింత—హఠాత్తుగా వచ్చేశారు...." అంది.

"ఆఫీస్‌లో లంచి తీసుకో బుద్ధికాలేదు. నీతో కలిపి తీసుకోవాలనిపించింది. ఆ కంపెనీ మరి కాస్త పెరిగింది. తమ్ముడుగారు కూడా జతపడ్డాడు...." అన్నాడు గోవర్ధనం.

ముగ్గురూ అప్పుడు కలిపి భోంచేశారు.

సాయంత్రానికి మళ్ళీ వస్తానని వేణు వెళ్ళిపోయాడు

"మీ రొచ్చారు....నా కెంతో సంతోషంగా వుంది...." అంది శ్వేత.

"ఏం?"

"బావతో ఒంటరిగా యింట్లో వుండడం నాకు భయం" అందామె.

"అదేం?" అన్నాడు గోవర్ధనం ఆశ్చర్యంగా. అయితే అతడి ఆశ్చర్యం వేణు గురించి కాదు. శ్వేత అతడి గురించలా చెబుతుందని అనుకోలేదు

"బావ మంచివాడు కాదు...." అంది శ్వేత.

"నాకు మంచిగానే కనబడ్డాడే........" అన్నాడు గోవర్ధనం.

"అలాగే కనబడతాడు. అందుకే చాలామంది మోసపోయారు...."

"అతడు మోసగిస్తాడా?"

"అవును. ముఖ్యంగా ఆడపిల్లలను ...."

"నిన్నూ మోసగించాడా."

చురుక్కున చూపింది శ్వేత—"మగాళ్ళంతా ఒకటే! అన్నీ పాడు అనుమానాలు...."

ఆ మాటలో చిరాకు కంటే అమాయకత్వం కనబడిందామె ముఖంలో. అది గుర్తించిన గోవర్ధనం—"ఈమె కల్మష మెరుగని మనిషి...." అనుకున్నాడు. కానీ అతడి అభిప్రాయాలను ఖండిస్తూ వేణు అన్నమాటలతడి చెవుల్లో గింగురుమంటున్నాయి. వివాహానికి ముందు తామిద్దరికీ వున్న పరిచయం చెప్పేస్తానని అతడామెను బెదిరిస్తున్నాడు. అంటే అర్థం?

"అంత కోపమెందుకు? అవునో కాదో చెబితే సరి

పోయేదానికి....” అన్నాడు గోవర్ధనం ఆ విషయాన్ని తేలి కగా తీసేస్తూ।

“నేనంటే యేమనుకున్నారు? నేనంత సులభంగా మోస పోయేదాన్ని కాదు....” అంది శ్వేత.

“ఎంత సులభంగా మోసపోతావుట?”

శ్వేత అదోలా నవ్వి—“అది తెలిపింది మీ ఒక్కరికే।” అంది.

క్షణకాలం గోవర్ధనం మనసు పరవశించింది. ఆమె మాట లతడికి గిలిగింతలు పెట్టగా తనువూ పులకరించింది. అయితే మరుక్షణంలోనే ఆమె నటించడం లేదుకదా అన్న అనుమానం అతడిలో రేగింది. అతి కష్టంమీద దాన్నణచు కున్నాడు. సినిమాల్లోనూ, కథల్లోనూ—ఇలాంటి చిన్న విషయాలే అపార్థాలకు దారితీస్తుంటాయి. ఈ విషయంలో తొందరపడి యే నిర్ణయానికీ రాకూడదని అత డను కున్నాడు.

“నాకేం తెలుసులే....నిన్న నీ కోపాన్ని తగ్గించగలి గేనా?”

“మెలకువగా వున్నవాడి నెవరూ నిద్ర లేపలేరు. నిన్న నాకు నిజంగా కోపం రాలేదు. ఉత్తినే నటించాను....” అంది శ్వేత.

“ఎందుకని?”

“ప్రణయ కలహాలు మధురంగా వుంటాయని చది వాను. మీ మంచితనం మూలంగా మన కసలు పోట్లాడు కునే అవకాశమే రావడంలేదు. వచ్చిన అవకాశాన్నుపయో గించుకున్నాను.”

అది అబద్ధమని గోవర్ధనానికి అనిపించింది. నిన్న ఆమెకు నిజంగానే కోపం వచ్చిందని అతడు గ్రహించాడు

ఈ రోజామె పరిస్థితి వేణు కారణంగా ఇబ్బంది లోపడింది. అందుకని ఆమె తన తప్పును సవరించుకునేందు కబద్ధాలు చెబుతోంది. అయితే ఒక అబద్ధం చెప్పగల మనిషి ఎన్నబద్ధాలైనా చెప్పగలదు. ఇంతా ఆమె యెన్నబద్ధాలు చెప్పిందో...."

మళ్ళీ అతడిలో అనుమాన బీజాలు నాటుకున్నాయి.

శ్వేత అతడినే గమనిస్తూ—"నిన్న రాత్రి మనమలా విడిగా పడుకోవడం నాకు నచ్చలేదు. ఆ బాకీ తీరడానికి మీరు మధ్యాహ్నం వచ్చేస్తే బాగుండుననుకున్నాను. నా ప్రేమ బలమెంత గొప్పదో చూడండి. మీరు నిజంగానే వచ్చేశారు...." అంది.

తన తప్పునుంచి దృష్టి మళ్ళించడానికి—తన ప్రేమ బలం గురించి మాట్లాడుతోందామె. సంభాషణ దారి మళ్ళే అవకాశమామె కివ్వకూడదనుకుని—"మీ బావ గురించి యేదో చెబుతున్నావు...." అన్నాడు.

అతడాశించినట్లు ఆమె యే మాత్రమూ కలవరపడ లేదు—"చెప్పడాని కేముందండీ—బావ మంచివాడు కాదు. మంచి మాటలు చెప్పి ఆడపిల్లల్ని వల్లో వేసు కుని—అవసరం తీర్చుకుని—నువ్వెవరో తెలియదు పొమ్మంటాడు...."

"బయటి పిల్లల్నే అలా చేసినప్పుడు—స్వయానా మరదలివి. నీ జోలి కెప్పుడూ రాలేదా?" అన్నాడు గోవర్ధనం.

"ఎందుకు రాలేదు? చాలాసార్లు ప్రయత్నించాడు. మన కెలాగూ పెళ్ళవుతుంది. తప్పులేదని కూడా అన్నాడు. కానీ నేను తెలివైనదాన్ని. నిన్ను నేను పెళ్ళి చేసుకోనని కూడా

చెప్పేశాను. అయినా వదలకుండా యేమన్నాడో తెలుసా? బావా మరదళ్ళకు సంబంధ మంటే అది తప్పుకా దన్నాడు...."

గోవర్ధనం కళ్ళు వేడెక్కాయి.-"అయినా అతగాడి కంత అవకాశమెలా వచ్చింది?" అన్నాడు.

"మీకూ్కాడా ఓ మనదలంటే తెలిసేది. ఇంట్లో పెద్దాళ్ళలాంటి విషయాలు పట్టించుకోరు. అయినవాళ్ళే కదా— బుద్ధిగా వుంటారనుకుంటారు. ఆఖరికి నేనేం చేశానో తెలుసా—....బావ వెధవ బుద్ధుల గురించి ఇంట్లో చెప్పేశాను. అప్పుడింట్లో పెద్ద గొడవే జరిగింది. ఆ తర్వాత బావకు యేకాంతంగా నన్ను కలుసుకునే అవకాశాలు రాలేదు...."

"చాలా బాగుంది కథ...." అన్నాడు గోవర్ధనం.

"కథ బాగు సంగతి తర్వాత ఆలోచిద్దాం. ముందు బావకు మనింట్లో స్థానం లేకుండా చేయండి...." అంది శ్వేత.

"ఎందుకని?"

"బావ బుద్ధుల్లో మార్పేమీ లేదు. నాకు పెళ్ళయిందికదా అన్న ఇంగిత జ్ఞానం కూడా లేదు. ఇంటికి రాగానే మీరు లేరని తెలిసి నా కిష్టంలేని మాటలు మొదలెట్టాడు. చిన్నప్పట్నించీ తెలిసినవాడు. పొమ్మని అనలేను. నా గురించి మీకు చెడ్డగా చెబుతానని బెదిరిస్తున్నాడు...."

"అయితే నువ్వేమన్నావ్?" అన్నాడు గోవర్ధనం.

"నాకేం భయం—తను చెప్పేవి మీరేమైనా నమ్ముతారా ఏమన్నానా?" అంది శ్వేత.

"ముందరి కాళ్ళకు బంధం వేస్తోంది...." అనుకున్నాడు గోవర్ధనం తనలో. పైకి మాత్రం—"ఏమి

చెబుతానన్నా దేమిటి?" అన్నాడు.

"ఆ మాత్రం మీ రూహించుకోలేరా?" అంది శ్వేత.

గోవర్ధనం వెంటనే—"నా ఊహలకు పని చెప్ప దల్చుకోలేదు. ఒకసారి వదలిపెట్టానంటే అవి చాలా దూరం వెడతాయి...." అన్నాడు.

శ్వేత క్షణంపాటు మౌనం వహించి—"బావ నా కోసమే మనింటికొచ్చాడు. ఏదో వంక పెట్టి అతడింట్లో వుండకుండా చేయండి. లేదా నాకు తోడుగా ఎవరినైనా అట్టేపెట్టండి—మీ రాఫీసుకు వెళ్ళిన సమయంలో...." అంది.

"చాలా అసహ్యంగా వుంటుంది—" అన్నాడు గోవర్ధనం,

"అయితే యిప్పుడేం చేద్దామంటారు?—...." అంది శ్వేత.

గోవర్ధనం అదోలా నవ్వాడు—"ఏమీ చేయనక్కర్లేదు. ఇంతవరకూ ఏ పొరపాటూ జరగలేదనుకో. ఇకముందూ జరగదన్న హామీ నే నివ్వగలను. ఇదివరకే పొరపాటు జరిగిపోయిందనుకో. అలాంటప్పు డిప్పుడా పనికి ప్రయత్నించీ ప్రయోజనం లేదు. ఏమంటావ్?"

శ్వేత అదోలా అతడివంక చూపి—"మీరు నన్ననుమానిస్తున్నారా?" అంది.

"అనుమానించాల్సిన దౌర్భాగ్యం నాకు పట్టలేదు. నేను నీ చేత నిజం చెప్పించగలను...." అన్నాడు గోవర్ధనం.

"నేను నిజమే చెప్పాను...." అంది శ్వేత ఏడుపు గొంతుతో.

"ఆ నిజమే మళ్ళీ చెప్పొచ్చు. ఎటొచ్చీ కాస్త భంగు

తిన్నాక...."

"భంగు తినడ మేమిటి?" అంది శ్వేత తెల్లబోయి.

"ఆ రోజు సీతాకరరావు విషయం చెప్పానుగా...." అన్నాడు గోవర్ధనం.

నాలుగు రోజుల క్రితం భర్త చెప్పిన విషయం గుర్తుకురాగా—"ఛీ— నేను భంగు వేసుకోను...." అంది శ్వేత.

"శ్వేతా! నా మాట విని యిందుకొప్పుకో. భంగు నిషాలో కావాలనుకున్నా నువ్వబద్ధం చెప్పలేవు. అప్పుడు నువ్వేం చెప్పినా నేను నమ్ముతాను. నీ బావ గురించి నన్ను నమ్మించడానికదొక్కటే మార్గం...." అన్నాడు గోవర్ధనం.

"అంటే మీరు నన్ననుమానిస్తున్నారు...." అంది శ్వేత బాధగా—"మీరు నన్నింట్లోంచి గెంటేసినా సరే— నేను భంగు మాత్రం వేసుకోను. ఆడవాళ్ళలాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్ళడం వ్యభిచారంకన్నా పాపమని అమ్మ చెప్పింది...."

గోవర్ధనానికీ, శ్వేతకూ ఈ విషయమై కాసేపు వాదన జరిగింది. అతడెన్ని చెప్పినా యెంత రెచ్చగొట్టినా ఆమె భంగు వేసుకుందు కంగీకరించలేదు.

"నువ్వు తప్పు చేశావు. అందుకే భయపడుతున్నావు...."

"నేను తప్పు చేశానని భయపడ్డంలేదు. తప్పు చేయడానికి భయపడుతున్నాను. భంగు వేసుకోవడం చాలా పెద్ద తప్పు...."

"పోనీ అయితే ఓ పని చేద్దాం....నీ బావకే భంగు యిద్దాం...."

శ్వేత ముఖం వెలిగింది—"ఈ అయిడియా బాగుంది. బావ కిలాంటి అలవాట్లు చాలా వున్నాయి. ఇప్పుడిది వేసుకుని పెద్దగా చెడిపోయేదేమీ లేదు...."

ఆమె ముఖం చూస్తూ—"ఈ అమాయికత్వమంతా నిజమే అయితే బాగుండును—...." అనుకున్నాడు గోవర్థనం.

3

సాయంత్రం ఆరింటికి వేణు వచ్చాడింటికి. అతణ్ణి చూస్తూనే ఆప్యాయంగా పలకరించి—"మీ కో శుభవార్త!" అన్నాడు గోవర్థనం.

"ఏమిటది?" అన్నాడు వేణు కుతూహలంగా.

శివశంకరం యింట్లో జరిగిన భంగుపార్టీ గురించి చెప్పి—"ఆ రోజది నేను మిస్సయ్యాను. ఇంట్లో వేసుకుంటానంటే శ్వేత వప్పుకోలేదు. ఇంకో మనిషి తోడుంటే తప్ప వద్దంది. ఈరోజు నా అదృష్టంకొద్దీ మీరొచ్చారు...." అన్నాడు.

"అంటే?" అన్నాడు వేణు.

"రాత్రి భోజనాలయ్యాక సరదాగా భంగు వేసుకుందాం. ఆ అనుభూతి చాలా తమాషాగా వుంటుందిట...."అన్నాడు గోవర్థనం.

"ఇంట్లో ఆడమనిషుండగా అది తప్పేమో! అది వేసుకున్నాక మన నోటిపై మనకే అదుపుండదు. ఏం మాట్లాడుతామో, ఏమో!" అన్నాడు వేణు కంగారుగా.

"ఆడమనిషి మనకేం పరాయిదా? మీకేమో స్వయాన మరదలు. నాకు భార్య. పైగా తనే అంగీకరించింది.... అదీకాక భంగు వేసుకున్నంత మాత్రాన—ప్రతి ఒక్కడికీ మనసు వశం తప్పదుట ఎవరికైనా ఆ అనుభూతి మాత్రం

గొప్పగా వుంటుందట...." అన్నాడు గోవర్ధనం.

"కానీ నా కిదివరలో అనుభవముంది. నాకు నోటికి అదుపు తప్పుతుంది...." అన్నాడు వేణు. అయితే అతడి మనసులో ఏదో అనుమానం కూడా పొడసూపింది_ఇదంతా ఎందుకా అని:

"ఫరవాలేదంటున్నాగా—మీరు కాదనకూడదు...." అన్నాడు గోవర్ధనం అర్థిస్తున్నట్లు.

"శ్వేత కూడా తీసుకుంటుందా?" అన్నాడు వేణు.

"తననీ బలవంత పెట్టాను కానీ ఒప్పుకోలేదు...."

వేణు అంగీకరించాడు. ఆ రాత్రి భోజనాలయ్యాక— అరటిపండులో కలుపుకుని వేణు, గోవర్ధనం యిద్దరూ భంగు వేసుకునాన్నారు.

"నే నిక్కణ్ణుంచి వెళ్ళిపోతాను...."అని వెళ్ళిపోయింది శ్వేత.

గోవర్ధనం కాసేపు మౌనంగా వున్నాడు. తర్వాత తర్వాత నెమ్మదిగా—"ఏమిటోలా వుంది. కళ్ళు తిరుగు తున్నాయి నాకు...." అన్నాడు.

"నాకు మాత్రం చాలా ఉత్సాహంగా వుంది—" అన్నాడు వేణు.

"కడుపులో తిప్పుతోంది. వాంతయేలాగుంది...." అంటూ బాత్రూంలోకి పరుగెత్తి కాసేపట్లో తిరిగొచ్చాడు గోవర్ధనం.

"ఏమైంది?" అన్నాడు వేణు.

"వాంతయింది...."

"నిన్ను చూస్తే నాకు జాలిగా వుంది...." అన్నాడు వేణు.

"ఫరవాలేదు. ఇప్పుడు కాస్త తేలికపడింది...."

"అందుకు కాదు ...." అన్నాడు వేణు.

"మరెందుకు?"

వేణు ఏదో చెప్పబోయి తన్ను తాను నిగ్రహించుకుందుకు ప్రయత్నిస్తూ— "నా కెందుకు లే...." అన్నాడు మళ్ళీ ఓ నిమిషమాగి—"శ్వేత బాగుంటుంది కదూ!" అన్నాడు

"ఊఁ" అన్నాడు గోవర్ధనం.

"అప్పుడింకా బాగుండేది ..." అన్నాడు వేణు.

"ఎప్పుడు?"

"అప్పట్లో మేమిద్దరం కలిసి..." వేణు మళ్ళీ ఆగాడు.

"చెప్పు...." అన్నాడు గోవర్ధనం.

"నాకావేశం వస్తోంది —" అంటూ వేణు—"శ్వేతా!" అని కేకపెట్టాడు. ఏమయిందోనని ఆమె పరుగున అక్కడికి రాగానే— "శ్వేతా! అప్పట్లో మనిద్దరం కలిసి యెంత సుఖపడ్డాం? మళ్ళీ ఆ రోజులు రావనిపిస్తోంది. నువ్వు నాతో వచ్చేయకూడదూ? నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను. పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను. నాతో వచ్చేసేయ్. ఆ పాత రోజులు మళ్ళీ గుర్తుచేసుకో...." అన్నాడు వేణు.

శ్వేత కంగారుగా గోవర్ధనం వంక చూసింది. ఆమె కళ్ళనిండా నీళ్ళు.

వేణు ఆమె గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. తమ అనుభవాలను వర్ణిస్తున్నాడు.

"స్టుపిడ్!" అరిచింది శ్వేత.

వేణు ఆపలేదు. ఇంకా ఏమో అంటున్నాడు.

"గెటౌట్...." అంది శ్వేత.

వేణు చలించలేదు.

"ఏమండీ—వీణ్ణింట్లోంచి గెంటేస్తారా—నన్ను వెళ్ళి పొమ్మంటారా?" అంది శ్వేత.

"నిజం తెలిపిందిగా—నీ భర్తెలాగూ నిన్నేలుకోడు. ఇద్దరం కలిసే ఇంట్లోంచి పోదాం. హాయిగా లాడ్జికి వెళ్ళి పాతరోజులు గుర్తు చేసుకుందాం. నేనేమీ నీ కన్యాయం చేయను. నిన్నే పెళ్ళి చేసుకుంటా నంటున్నాగా...." అన్నాడు వేణు.

"మిస్టర్ వేణూ—గెటౌట్ ...." అన్నాడు గోవర్ధనం.

వేణు పట్టించుకోవడం లేదు. నిషాలో ఏదో వాగుతూనే వున్నాడు. శ్వేత, గోవర్ధనం కలిపి అతడినీ, అతడి సూట్ కేసునూ వీధరుగుల మీదకు ఈడ్చుకెళ్ళి పారేసి తలుపులు వేసుకున్నారు.

అప్పుడు శ్వేత ఏడుపు మొదలెట్టింది.

"ఏడవకు శ్వేతా! నాకు నీ గతంతో నిమిత్తం లేదు" అన్నాడు గోవర్ధనం.

"నా గతం స్వచ్ఛమైందండీ—బావ అన్నీ అబద్ధాలు చెప్పాడు...." అంది శ్వేత.

"నీ గతంగురించి నాకు చెప్పొద్దు ..." అన్నాడు గోవర్ధనం.

"అలా అనేవారు మరి బావచేత నిజమెందుకు చెప్పించా లనుకున్నారు?"

"నీకోసం....నువ్వు భారత స్త్రీవి. నిన్ను నే ననుమా నిస్తున్నానన్న భావం నిన్ను పీడిస్తూనే వుంటుంది. నీలో ఆ అనుమాన నివృత్తి చేయడానికే నేను నిన్ను భంగు తిన మన్నాను. భంగు పేరు చెప్పి మామూలు గ్లూకోజేదో నీ

కివ్వాలనుకున్నాను. అప్పుడు నీకెలాగూ నిషా ఎక్కదు. అందువల్ల నువ్వేం చెప్పాలనుకుంటే అదే చెబుతావు. అది నీకు తృప్తిగా ఉంటుంది. కాని భంగు తినడానికి నువ్వొప్పుకోలేదు. అందుకని నీ బావ కిస్తానన్నాను. అతడికీ నేను కలిపింది గ్లూకోజు పొడరే! ఎటొచ్చీ అతడిలో నమ్మకం కలిగించడానికి నాకు వాంతి వచ్చినట్లు నటించాను...."

"అంటే బావ కే నిషా లేకుండానే అలా వాగాడన్న మాట!"

"అవును. నిషా ఎక్కదు కాబట్టి గతానికి సంబంధించిన అప్రియమైన విశేషాలు మాట్లాడడుకదా అనుకున్నాను కానీ వేణు తన దుర్బుద్ధి ప్రకటించుకున్నాడు. తనకు నిషా ఎక్కినట్లు నటించి అబద్ధాలు చెప్పి నీకూ నాకూ చెడగొట్టాలనుకున్నాడు...."

"అసలు మీరు బావకు నిజంగా భంగివ్వాల్సింది. అసలు నిజం బయటపడేది...." అంది శ్వేత.

"నిషా అబద్ధమాడదు. నేనానిజం వేణునోట వినదల్చుకోలేదు...."

"ఎందుకని? మీకింకా నా మీదనుమానముందా?"

"లేదు. నేను వేణుకు భంగునిచ్చివుంటే అప్పుడే నాకు నీ మీద అనుమానమున్నట్లు నా శ్వేత నోటివెంట వెలువడ్డ నిజాన్ని నేననుమానించి జీవించగలనా? నా శ్వేత చెప్పిన మాటకు నేనింకా సాక్ష్యాలు వెతుక్కుంటానా?" ఆవేశంగా అన్నాడతడు.

"ఎంత మంచివారండీ మీరు?" అంది శ్వేత.

"నాకున్నది మంచితనంకాదు. అదృష్టం. అదీ నువ్వొ

నా భార్యవు కావడంవల్ల....'' అన్నాడు గోవర్ధనం.

భార్యా భర్తలిద్దరూ పాతకోపాలు మరిచిపోయారు. పడకోబోయేముందు వాళ్ళు వీధి తలుపులు తీసి చూశారు.

వేణు ఇంకా అక్కడే వున్నాడు. అతడిలో ఏ మూలో ఆశ వున్నట్లుంది గోవర్ధనం భార్యను గెంటివేయకపోతాడా అని!

శ్వేత తలుపులు మూస్తూ—"బావా! నువ్వు చాలా దుర్మార్గుడివి. మావారు నీకు భంగివ్వలేదు. లేని నిషాను తెచ్చిపెట్టుకున్నావు. నీవంటివాడికి తెలివికంటే నిషాయే నయం. నిషా అబద్ధమాడదు. మళ్ళీ ఈ గుమ్మం తొక్కకు'' అంది. □

అనుమానం దొంగ!

రాంగ్ నెంబర్ కేసు శివరామ్

"ట్రింగ్" "ట్రింగ్"మంటూ ఫోన్ మ్రోగేసరికి ఫోన్ అందుకొన్నాను.

"ఇన్‌స్పెక్టర్ రెడ్డి కాబోలు!"

అనుకొన్న నేను ఆ ప్రక్క స్వరం వినగానే ఉలిక్కి పడ్డాను.

"హలో! పోలీస్ స్టేషనా?"

కంగారుగావుంది అవతలకంఠం.

"కాదమ్మా! శాతకర్ణి ఆఫీసు."

"మీరా సార్! త్వరగా రండి! ఇక్కడ సన్నో దుర్మార్గుడు....అబ్బా!" అంటూ బాధగా విన్పించింది. ఇమ్మిడియట్‌గా రియాక్టు అయ్యాను.

"హలో! మీ నెంబర్ చెప్పండి?" ఆత్రుతగా అడిగాను.

"సనత్‌నగర్....నెంబర్...." అంటుండగా ఫోన్ కట్ చేసిన సౌండ్ విన్పించింది.

"డామిట్! ఫోన్ నెంబరన్నా తెలిస్తే బావుండేది." అనుకొంటూ కుర్చీలోనుంచి లేచాను.

"ఎక్స్చేంజికి ఫోన్‌చేయడం వేస్టు! పోనీ సనత్‌నగర్‌కి వెళితే...." నాకు నేనే ప్రశ్నించుకొన్నాను.

"ఎక్కడని వెతకాలి? ఎవరని ప్రశ్నించాలి?" మనసంతా చికాకుగా తయారైంది. విసుగ్గా మళ్ళీ కుర్చీలో కూలబడి, పుస్తకం తెరిచాను. అరగంట గడిచిందో, లేదో! మళ్ళీ టెలిఫోన్ మ్రోగింది.

చటుక్కున అందుకున్నాను.

"రెడ్డి!"

"హలో! ఫ్రెండ్! అర్జంట్‌గా స్టేషన్‌కిరా!"

రెడ్డి తొందరగా పిల్చాడు.

"ఏమైనా కేసా?"

"మన జీవితమంతా కేసులేగదా!"

రెడ్డి గొంతులో కోపం ధ్వనించింది.

చిన్నగా నవ్వుకొని వెస్పాతో సహా స్టేషన్ చేరుకొన్నాను.

అప్పటికే రెడ్డి జీపుతో సహా స్టేషన్‌ముందున్నాడు.

"కమాన్! కమాన్! ఫాలోమీ!"

జీపుని అనుసరిస్తూ బయల్దేరాను.

స్టేషన్ దగ్గర్నుంచి సనత్‌నగర్ వైపు తిరగ్గానే ఉలిక్కి-పడ్డాను.

"మైగాడ్! నా రాంగ్‌నెంబర్ కేసు కాదుగదా!" అను కొనేంతలో సందు మొగదలే ఆగింది జీపు. రెడ్డి చకచక లోనికి నడిచాడు. వెనుకనే పరిగెత్తాను.

లోపల్నుంచి ఏడుపులు విన్పిస్తున్నాయి.

చుట్టూవున్న జనాన్ని నిమిషాల్లో పోలీసులు కవర్ చేసారు.

టి.వీ సెట్, సోఫాసెట్, కిటికీలకి కాస్ట్లీ కర్టెన్స్—ఇల్లు చిన్నదైనా పొందికగావుంది. మిడిల్‌క్లాసులో హై క్లాసు ఫ్యామిలీ అన్పించేటట్టుంది.

టీపాయ్‌మీది టెలిఫోన్ ప్రక్కన పడివుంది.

సోఫాసెట్‌మీద పడివుంది పదహారేళ్ళ అమ్మాయి.

మెడ చుట్టూ కమిలిపోయివుంది. శంఖంలాంటి మెడ మీద వక్రంగా కన్పిస్తున్న నల్లటిచారలు. కళ్ళు వెళ్ళు కొచ్చినా ఆ అమ్మాయి అందం తగ్గలేదు.

సాలోచనగా తలఊపి, ప్రక్కనే కళ్ళనీళ్ళు తుడుచు కొంటున్న ఓ ముసలావిడ దగ్గరికి నడిచాడు రెడ్డి.

"చూడమ్మా! చనిపోయిన ఈ అమ్మాయి మీకే మౌవు తుంది?"

రొటీన్‌గా ప్రశ్నించడం ప్రారంభించాడు.

"నా మనమరాలు బాబు!" అంటూ బర్రున చీదింది ఆవిడ దుఃఖాన్ని అపుకొంటున్నట్టుగా.

"మా కెవ్వరూలేరు బాబు! వీళ్ళ నాన్న, అమ్మ ఈ మధ్యే రైలు యాక్సిడెంట్‌లోపోయారు. ఆయన ఇంజనీరు.

అప్పట్నుంచి ఇక్కడే వుంటున్నాం బాబు! ఈ పిల్ల నీరజ కాలేజీలో ఇంటర్ చదువుతున్నది."

ఆమెవైపు సానుభూతిగా చూసాను.

"ప్చ్! ఈ వయస్సులో ఎంతకష్టం!"

ఆవిడ వెక్కిళ్ళు పెట్టుతున్నది.

"చదువులో ఫస్టే. నాట్యంవచ్చు. నాటకాల్లో నటించేది, నా నీరజ బాబు! బామ్మా! లాయర్నవుతాననేది బాబు." గొల్లుమంది ఆవిడ.

ఆవిడ్ని ఆపడం కష్టంగానేవుంది.

ఈ టైములో ఆవిడ్ని ప్రశ్నించడం బాగుండదు. అయినా తప్పదు.

"చూడమ్మా! ఏం జరిగిందో చెబుతారా?"

కూల్‌గానే అడిగాను.

"నేను, ప్రక్కింటావిడా దేవళానికి వెళ్ళాం బాబు! ఈలోగా...." అంటూ ఆవిడ చెప్పలేకపోయింది.

రెడ్డివైపు చూసాను.

నా అభిప్రాయం అర్థం చేసుకొన్న రెడ్డి కూడా మరేం ప్రశ్నించలేదు.

మార్చురీకి పంపే ఏర్పాట్లు చూడసాగాడు. ఈలోగా చుట్టుప్రక్కల అడిగాను. క్లూలేమి లభించలేదు.

అంతా అయినాక స్టేషన్‌వైపు బయల్దేరాం మేమిద్దరం.

2

మరుసటిరోజు—రెడ్డి దగ్గరికెళ్ళాను.

"రా! నీకోసమే చూస్తున్నాను. వేలిముద్రలేవీ లేవట! బాడీమీది గోళ్ళ గాట్లుబట్టి బహుశ మానభంగానికి గురై ఉండవచ్చు నన్పిస్తున్నదట. కానీ వర్జినేనని రిపోర్ట్."

చకచక చెప్పాడు రెడ్డి!

"అయితే మానభంగానికి ప్రయత్నించి, వీలుకాక చంపి వుండొచ్చు. ఇంతకీ ఆ అమ్మాయి చదివేది ఏ కాలేజి?"

సాలోచనగా అడిగాను.

"సనత్‌నగర్‌లోనే నిన్న కాలేజికి హాలిడే కూడాను." అన్నాడు రెడ్డి సిగరెట్ వెలిగిస్తూ.

"పద కాలేజీకి వెళ్దాం" అంటూ లేచాను.

ఇద్దరం కల్సి కాలేజీ దగ్గరికి చేరాము.

ఎదురుగ్గా వస్తున్న అటెండర్ని పిల్చి, "చూడు నీరజ, అని నిన్న హత్యజరిగింది ఆ అమ్మాయి...." అంటూ ఆగాను.

పోలీస్ డ్రస్‌లో వున్న రెడ్డివైపు సంశయంగా చూసాడతను.

"పర్లేదులే నీ మీదకేంరాదు"

భరోసా ఇచ్చాడు రెడ్డి.

"ఆ అమ్మాయి ఇంటర్ సీనియరండి ఆళ్ళక్లాసులోని అశోక్‌కి, ఈ అమ్మాయికీ సంబంధం వుందని అంటారండి"

ఆ మాట వినగానే తెల్లబోయాము.

"అదినిజమో కాదో గానీనండీ ఆ అమ్మాయి నాకు లాంటిదండి మొన్నిమధ్య ఓ నాటకంలో ఆదరగొట్టేసినాదండి"

రెడ్డివంక చూసి,

"రెడ్డి నీ వెళ్ళి అశోక్‌ని కలు" అన్నాను సిగరెట్ వెలిగిస్తూ.

అటెండర్ని వెళ్ళమనిచెప్పి, "నీవురా" అన్నాడు రెడ్డి.

"పోలీసులు వెళితే వచ్చే సమాధానం, నే వెళితే వచ్చే సమాధానం వేరు రెడ్డీ!"

రెడ్డి నవ్వి, కాలేజివైపు కదిలాడు.

ఓ పదిహేను నిమిషాల తర్వాత వచ్చాడతను.

"పనికొచ్చే ఇన్ఫర్మేషన్ ఏమిలేదు బ్రదర్! అశోక్, ఆ అమ్మాయి తిరిగే మాట వాస్తవమేనట. ఈ రోజు అశోక్ కాలేజికి రాలేదట."

"అతనుండేది...."

"కనుక్కొన్నాను. ఇక్కడే హాస్టల్‌లో వుంటున్నాడట. రూమ్ నెంబర్ 116."

ఇద్దరంకల్సి హాస్టల్‌వైపు నడిచాం.

ముందుగా రెడ్డివెళ్ళాడు.

ఓ అర్ధగంట తర్వాతవచ్చి, "ఆ రోజు అతను టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో వున్నాడట. ప్రేమించినమాట వాస్తవమే కాని, అంతకుమించి తనకేమి తెలీదన్నాడు."

విసుగ్గా అన్నాడురెడ్డి.

"సరే! నువ్వు పదరెడ్డి! నే తర్వాతవచ్చి కలుస్తాను." అంటూ హాస్టల్‌వైపు నడిచాను.

హాస్టల్ అనుకొనే వున్న, ఓ కిళ్ళీకొట్టువైపు నడిచాను.

"సిగరెట్ ప్యాకెట్ ఓటి యివ్వు!" అంటూ పదినోటి చ్చాను.

అతనిచ్చిన ప్యాకెట్ అందుకొంటూ, "స్టూడెంట్ల గిరాకీలు ఎక్కువేనా?" పరిచయం పెంచుకొంటున్నట్టుగా అడిగాను నవ్వుతూ. "ఏదోలెండి! యింతకీ.... మీరెవరు?" అనుమానంగా అడిగాడు.

"మాదీ వూరుకాదు. అశోక్ అని మా తమ్ముడు

యిక్కడే వున్నాడు. వాడిని తీసుకెళదామని....అదిగాక".
అంటూ గొంతు తగ్గించి ముందుకు వంగాను.

అతనూ ఆసక్తిగా చూసాడు.

"మా వాడూ ప్రేమించాడటనే నీరజ ఆ అమ్మాయి నెవరో హత్య చేసారటగదా! ఎందుకైనా మంచిదని వాడిని తీసుకెళుతున్నాను."

కిళ్ళీషాపతను ఉత్సాహంగా ముందుకు వంగాడు.

"నిజమేసార్! నీరజ. మీ తమ్ముడు భలే తిరిగేవారు సార్! ఆ అమ్మాయంటే మీ తమ్ముడికి 'ఐరన్ లవ్' సార్! ఓసారి వాళ్ళ క్లాస్‌మేట్ 'మోహన్' అనే అతనేదో అన్నాడని పట్టుకొని బాదేసాడు."

పెద్ద రహస్యం చెప్పినట్టు అతని మొఖం వెలిగింది.

"ఐసీ! మోహన్—ఇతన్ని గురించి కూడ ఎంక్వయిరీ చేయాలి." అనుకొని, 'వస్తాను' అనేసి హాస్టల్ వైపు నడిచాను.

116 నెంబరు గది ముందు నిలబడి తలుపు తట్టాను. తలుపు తెర్చుకుంది.

తీపిన ఆ వ్యక్తిని చూస్తే జాలేసింది.

కళ్ళు గుంటలు పడిపోయివున్నాయి. జుట్టు చిందర వందరగావుంది అతనుపడ్డ బాధంతా ముహంలో స్పష్టంగా కన్పిస్తున్నది.

"అశోక్, అంటే...."

"నేనే" అంటూ తలుపుకు అడ్డం తొలిగాడతను.

"నా పేరు శాతకర్ణి. ప్రైవేట్ డిటెక్టివ్‌ని. నీరజ కేసు విషయం నీతో మాట్లాడుదామని వచ్చాను."

నిదానంగా అన్నాను.

అతని మొహం విషాదంగా మారింది.

"కూర్చోండి సార్!" అన్నాడు వినయంగా.

"నీరజ, నేను ప్రేమించుకున్నాం సార్! చదువు పూర్తయితే పెళ్ళి కూడా చేసుకోవాలని అనుకున్నాము. యింతలోనే...."

అతని కంటివెంట నీళ్ళు తిరిగాయి.

"బీ బ్రేవ్! యంగ్‌మాన్! ఆ రోజు నువ్వు ఎక్కడున్నావ్?"

అతను తల దించుకొన్నాడు.

"చూడు! మిసర్! నిజాన్ని దాచడం వలన నష్టం నీకే ఎక్కువ. ఇప్పటికే పోలీసులు నీ చుట్టూ తిరుగుతుండొచ్చు."

తగలవలసినచోటే తగిలాయి నా మాటలు. అతని కళ్ళలో భయం కదలాడింది.

"నేను, ఆ రోజు నీరజను వాళ్ళింట్లోనే కల్సుకున్నాను సార్!"

సిగ్గుగా అన్నాడతను.

"అంటే "

నా గొంతులో ఎందుకో తీవ్రత?

"తప్పుగా అర్థం చేసుకోకండి కేవలం మాటాడాను. అంతే!"

ఎందుకో? రిలీఫ్‌గా ఫీలయ్యాను.

"ఆ తర్వాత ..."

"నాకు టైప్ టైమ్ అయిందని వచ్చేసాను సార్! సార్! ఎలాగైనా ఈ హత్యకు కారకులైన వారిని అరెస్ట్‌చేయండి! ప్లీజ్!"

అతని కంఠంలో కోపం ధ్వనించింది.

"ఓ. కె. మిస్టర్ అవసరమైతే మళ్ళీ కలుస్తాను."

అంటూ లేచి, వచ్చేసాను.

తిరిగి స్టేషన్‌కి వెళ్ళేసరికి రెడ్డి లేడు.

సిగరెట్ వెల్గించి, కుర్చీలో కూలబడ్డాను.

ఆలోచనలు సుడిగుండాల్లా కదులుతుండగా, మెల్లిగా వెనక్కి వాలాను.

పొగ రింగులుగా పైకి వెళ్ళసాగింది.

దానితోపాటే టైమ్‌కూడా.

3

ఓ గంటసేపు గడిచాక, రెడ్డి వచ్చాడు.

"ఏం మిత్రమా? ఏమైంది?"

జరిగినదంతా వివరంగా చెప్పాను.

"సో! మధ్యలో మోహన్ అనే విలన్ వున్నాడన్న మాట."

సాలోచనగా అన్నాడు రెడ్డి.

"కానీ, రెడ్డీ! కాలేజీలో ఆడపిల్లల్ని అల్లరిచేయడం, వాళ్ళ అన్నలచేతనో, లవర్స్‌చేతనో తన్నులు తినడం— కామన్‌థింగ్. అంత మాత్రానికే హత్య జరుగుతుందా?"

రెడ్డి చిన్నగా నిట్టూర్చాడు.

"మన పరిశోధన ఒకే 'వే'గుండా వెళుతున్నదని అన్పిస్తున్నది."

సమాధానం చెప్పలేము రెడ్డికి.

యింతలో, మా ఆలోచనల్ని చెడగొడుతూ, ఓ కుర్రాడొచ్చాడు.

"సార్! రెడ్డిగారంటే...."

"నేనే" అని, రెడ్డి "ఏం? ఎందుకు?" అంటూ ప్రశ్నించాడు.

"ఎవరో ఒకాయన మీకీ కవరిమ్మని, ఓ రూపాయిచ్చి

వెళ్ళాడండి." అంటూ ఓ కవరు అందించాడు.

చటుక్కున లేచాను.

"ఏడీ? ఎక్కడతను?"

"స్కూటర్‌లో వెళ్ళాడండి."

అమాయకంగా అన్నాడా కుర్రాడు.

"డామిట్!"

కసిగా పళ్ళుకొరుక్కున్నాను.

"వస్తానండి!"

అన్న కుర్రాడి మాటలు పట్టించుకోకుండా, రెడ్డి అందించిన కవరులోని ఫొటోవంక అలానే చూస్తూండిపోయాను.

అశోక్ రెండు చేతులమధ్య నీరజ గొంతు బిగిసివుంది.

అశోక్ మొహంలో కసి, నీరజ మొహంలో భయం స్పష్టంగా కన్పిస్తున్నది.

"మైగాడ్! అమాయకుడుగా అశోక్ ఎంత బాగా నటించాడో!"

అప్రయత్నంగా అన్నాడు రెడ్డి.

ఫోటో వెనక్కి తిప్పాను.

"డియర్ రెడ్డిసాబ్!

హంతకుడు ఎవరో తెల్సిందిగా 'షు వ్'అనండి! అంటూ రాసివుంది.

"పద! వెళ్ళి అశోక్‌ని అరెస్ట్‌చేద్దాం"

ఉత్సాహంగా లేచాడు రెడ్డి.

ఫోటోవంక అలానే చూడసాగాను.

సోఫాసెట్, టెలిఫోన్, డయనోరా టీ.వీ. పేరుతో సహా స్పష్టంగా వుంది.

"సందేహంలేదు! అశోక్ ఈ హత్య చేసుంటాడు అనే దానికి ఈ ఫోటో చాలు. కేసు తేలిపోయినట్లే."

రెడ్డి ఆనందంగా అన్నాడు.

"కానీ, రెడ్డీ! ఈ ఫోటో పంపిన వ్యక్తి ఎవరై వుంటారు?"

నా ఆలోచనలు వేరేదిశగా పయనిస్తున్నాయి.

"అబ్బా! ఎవరైతేనేం లేవయ్యా! పోలీసులు, సాక్ష్యం చెప్పడం—ఇవన్నీ న్యూసెన్సులని అతను ఈ విధంగా చేసుండొచ్చు."

రెడ్డి పాయింట్ కూడా ఆలోచించదగిందే.

"సరేపద! అశోక్ దగ్గరికెళదాం" అంటూ ఇద్దరం హాస్టల్‌వైపు నడిచాం.

మేం హాస్టల్ చేరబోయేసరికి అప్పుడే అశోక్ చేతనున్న సూట్‌కేసుతో ఆటో ఎక్కబోతున్నాడు.

"ఏయ్! మిస్టర్! స్టాప్‌దేర్!"

రెడ్డి బిగ్గరగా అరిచాడు.

ఆటోలోనుంచి ఆశ్చర్యంగా చూసాడు అశోక్.

"యూ ఆర్ అండర్ అరెస్ట్ ఇన్ నీరజ మర్డర్‌కేస్"

తెల్లబోయాడతను.

"నేనా! నీరజనా! నో! నేను హంతకుణ్ని కాను."

కవర్‌లోనుంచి ఫోటో తీసాడు రెడ్డి.

"ఇంతకంటే వేరే సాక్ష్యం అక్కర్లేదనుకొంటాను." అతని మొహం పాలిపోయింది.

"సార్! నన్ను నమ్మండి! ఇది నిజంగా జరిగిందికాదు. మా నాటకంలో ఓ స్టిల్!" అన్నాడు దీనంగా.

"నాటకాలు నా దగ్గరకాదు మిస్టర్! పద!" అంటూ అదే ఆటోను స్టేషన్‌వైపు తిప్పాడు.

స్టేషన్ చేరగానే అశోక్ కాళ్ళు పట్టుకోవడం ఒకటే తక్కువ—అంతలా మనిషి దిగజారిపోయాడు.

"సార్! నా మాట వినండి! నీరజ నా ప్రాణంతో సమానమైంది! నేను హత్య చేస్తానా?"

కళ్ళ నీళ్ళు తిరుగుతున్నాయి.

"అందుకనేనా సూట్ కేస్‌తో పారిపోతున్నావ్?"

కోపంగా అడిగాడు రెడ్డి.

"లేదుసార్! హాస్టల్ ఖాళీచేసి, మా అన్న కాలనీకి వెళుతున్నాను."

అశోక్ వైపు దీక్షగా చూసాను.

ఎందుకనో? అతడు దోషిగా కన్పించలేదు నా కళ్ళకి.

"యూసే మిస్టర్! నీకు మోహన్ తెలుసా?"

"తెలుసుసార్!"

ఇమ్మిడియట్‌గా రిప్లయివచ్చింది.

"అతనుండేది నీరజ వాళ్ళింటిప్రక్కనే. ఓ రోజు నీరజనేమో అన్నాడని అతను నేను కొట్టుకున్నాం కూడా! అటువంటివాడ్ని. నాకీ హత్యకు సంబంధంలేదు సార్!"

అతనివంక చూసి నవ్వుకున్నాను.

అతనికి పట్టుమని యిరవై ఏళ్ళుండవ్.

హంతకుడు అయినా, కాకపోయినా తను తప్పించుకోవాలని, మోహన్ పేరెత్తగానే ఆనందాన్ని ప్రకటించడాన్ని రానురాను హ్యూమన్ మెంటాలిటి గతులు తప్పుతున్నదన్పించింది నాకు.

ఏమైనా ఓ నిర్దోషి శిక్షించబడటంకంటే వందమంది దోషులు దొరక్కపోవటాన్నే నేను హర్షిస్తాను.

రెడ్డిని ప్రక్కకు పిల్చి "ఓ.కె రెడ్డీ! నే వెళ్ళి మోహన్ని కలిసొస్తాను. ఈలోగా మీ వాళ్ళు థర్డ్ డిగ్రీలేవీ ఉపయోగించకండి అతనిమీద. కాలం అసలేబాలేదు." అన్నాను నవ్వుతూ.

రెడ్డి కూడా నవ్వేసాడు.

వెస్పాని సనత్‌నగర్ వైపు తిప్పాను.

4

నీరజ వాళ్ళింటిని ఆనుకొనే ఉంది మోహన్ వాళ్ళ ఇల్లు కూడా.

వెళ్ళి కాలింగ్‌బెల్ నొక్కాను.

ఊహూ! ఎవ్వరూ వస్తున్న ధ్వని విన్పించటంలేదు.

మరోసారి నొక్కాను.

కదలికే లేదు.

ఈసారి చేయి తీయలేదు బెల్‌మీదనుంచి.

"ఎవరూ?" అంటూ తలుపుతీసాడో యువకుడు. నన్ను చూడగానే మర్యాదగా. "ఎవరు కావాలండి?" అన్నాడు.

"మోహన్, అంటే మీరేనా?" అతనివైపు చూస్తూ అడిగాను.

"అవును. మిమ్మల్నెక్కడా చూడలేదు నేను. మీరు ...."

"నాపేరు శాతకర్ణి. ప్రైవేట్ డిటెక్టివ్‌ని."

అతని మొహంలో ఆనందం కన్పించింది. కళ్ళలో భయిం చిందులాడింది. ఎందుకో?

"రండిసార్! మీ పరిశోధనలు 'అపన'లో చదివాను నేను."

చిన్నగా నవ్వి, లోనికి నడిచాను.

"ఏం తీసుకొంటారు సార్! కాఫీ! డ్రింక్ ...."

హడావిడి చేయబోతున్న అతన్ని ఆపి, "అవేం వద్దు మిస్టర్! నాకో ఇన్ఫర్మేషన్ చెప్పాలి." ఆసక్తిగా అడిగా దతను.

"ఏమిటి సార్!"

"నీరజ హత్యవిషయం ..."

మనిషిలో ఓ విధమైన మార్పు వచ్చింది.

"సార్! నీరజని నేను ప్రేమించాను. కానీ ఆమెకు అశోక్ అంటే ఇష్టం. అయినా ఆశ చంపుకోలేక ఆమెనే అడిగాను. నన్ను నానా దుర్భాషలు ఆడి, అశోక్ చేత కొట్టించిందికూడా. అంతేగానీ, నాకూ, ఈ హత్యకూ సంబంధం లేదుసార్!" దీనంగా అన్నాడతను.

"హత్య జరిగినరోజు రాత్రి నువ్వెక్కడున్నావ్?"

మౌనంగా వుండిపోయాడు కొద్దిసేపు. తర్వాత చిన్నగా, "ఆ రోజు నేను ఇంట్లో లేనుసార్! మా అమ్మగారు, నేను కల్సి మాకు తెల్సిన వారింటికి వెళ్ళాం. వచ్చిన తర్వాతే మా నాన్న చెప్పాడు జరిగిన సంగతి" అన్నాడు నిదానంగా.

చుట్టూ వున్న గోడలవంక చూస్తూ, "అన్నట్టు! నువ్వు నటుడివేనా?"

గర్వంగా తలూపాడతను.

"అవును సార్! ఈ ఫోటోలు చూడండి!" అంటూ, ఓ ఆల్బమ్ చూపించబోయాడు.

"వద్దులే. నే వస్తాను" అంటూ లేచాను.

మోహన్‌కి వాళ్ళమ్మగారు ఎలిబీ. మరి హంతకుడెవరు!

ఆలోచనలతో సతమతమౌతూ స్టేషన్‌కు చేరాను.

రెడ్డి నవ్వుతూ ఎదురొచ్చాడు.

"నేను ఆర్డరిచ్చిన టీ వీ సెట్ వచ్చిందోయ్! కెల్ట్రాన్ కంపెనీది. డ్యూరబుల్ అని అన్పిస్తున్నది. వెళ్ళి చూద్దామా?"

అంటున్న రెడ్డి మాటల్ని ఆలకించలేదు.

ఒక్కసారిగా ఫ్లాష్ వెలిగింది.

"రెడ్డీ! ఆ ఫొటో ఏది?"

ఆత్రంగా అడిగాను.

"ఎందుకది?"

ఆసక్తిగా అడిగిన రెడ్డికి సమాధానం చెప్పకుండా, "కమాన్! ఎక్కడుంది?"

లోనికెళ్ళి, తెచ్చిచ్చాడు రెడ్డి.

నా అనుమానం నిజమైందని నాకు అన్పిస్తున్నది.

"పద! నీరజవాళ్ళింటికి వెళదాం."

"ఎందుకూ?"

రెడ్డి క్యూరియస్‌గా అడిగాడు.

"చెబుతాను."

అంటూ బయల్దేరదీసాను.

నీరజ వాళ్ళింట్లో ఎదురొచ్చిన బామ్మగారికి 'ఏమిటంటున్నా?' సమాధానం చెప్పకుండా టీ.వీ. సెట్‌వైపు చూశాను.

నా అనుమానం నిజమైంది.

'నా ఊహ కరక్ట్!'

రెడ్డివంక చూపి, "అశోక్ నిర్దోషి బ్రదర్!" తృప్తిగా అన్నాను.

"ఎలా?"

"ఇలా?"

అంటూ ఫోటో అందించాను.

"చూడు! ఫోటోలో కన్పించే టీ.వీ. సెట్ పేరు 'డయనోరా'! కాని వీళ్ళింట్లో వుండేది 'కెల్‌ట్రాన్' కంపెనీది. కనుక ఈ ఫోటో ఏదన్నా నాటకంలోని స్టిల్ అయి వుండొచ్చు."

రెడ్డి విసుగ్గా చూశాడు.

"కేసుని మరింత గజిబిజి చేయకు బ్రదర్! మా 'దెబ్బ' చూస్తే, అశోక్ నిజం చెబుతాడు."

చిన్నగా అతని భుజం తట్టాను.

"పద! మనమూ ఓ నాటకం ఆడదాం!"

అంటూ మోహన్ వాళ్ళింట్లోకి నడిచాను.

మోహన్ తండ్రివచ్చి తలుపు తీసాడు.

"మోహన్ వున్నాడా?"

కఠినంగా అడిగాను.

"ఎందుకూ?"

భయంగా అడిగాడతను.

"నీరజను హత్య చేసిందానికి మీవాడ్ని అరెస్ట్ చేస్తున్నాం."

అతని మొహం పాలిపోయింది.

"నో! మావాడా హత్య చేయలేదు."

అతనివైపే పరీక్షగా చూశాను.

"అది, కోర్టులో తేలుతుంది."

అంటూ రెడ్డి గదిలోనుంచి వచ్చిన మోహన్ చేయి పట్టుకొన్నాడు.

"లేదు! నేనీ హత్య చేయలేదు." మోహన్ ఏడ్పు గొంతుతో అన్నాడు.

"అవును. మావాడీ హత్య చేయలేదు" మోహన్ తండ్రి గొంతుక స్థిరంగా పల్కింది. "ఆ హత్య చేసింది నేను!"

ఉలిక్కి పడ్డాను.

"నువ్వా ..."

అన్నాం ఇద్దరం ఆశ్చర్యంగా.

"అవును. నేనే ఈ హత్య చేసింది.

ఎందుకంటే—

మావాడు నీరజను ప్రేమించాడు. బట్ నేను కామించాను."

"డాడీ!"

ఆశ్చర్యంగా అన్నాడు మోహన్.

"అవును! హత్య జరిగిన రోజు నువ్వు ఇక్కడ లేవు. కానీ మీ అమ్మను 'నువ్వు, ఆమె కల్సిపోయినట్టు' చెప్పమనడం విన్నాను, కేసు నీ మీదకి రాకూడదని ఫోటో ఒకటి పంపాను రెడ్డిగారికి.

"ఇక ఆరోజు—ఏమి తోచక నీ ఫోటో ఆల్బం తిరగేస్తున్నాను. ఇంతలో నీరజ వచ్చింది.

"అంకుల్! వీక్లీ వుంటే ఇస్తారా!" అంటూ అడిగింది.

"ఏకాంత ప్రదేశం. చుట్టూ ఎవ్వరూ లేరు. తెగించి చేయి పట్టుకొన్నాను. విసిరికొట్టింది. అంతే! ఆమెను పట్టుకొని దొరికిన చోటల్లా ముద్దు పెట్టుకొంటూ—ఓహ్! రాక్షసంగా ప్రవర్తించాను.

"ఎలాగో, నన్ను విడిలించుకొన్న నీరజ ఇంటికి పరిగెత్తింది. వెనుకనే వెళ్ళాను. పోలీసులకి ఫోన్ చేయబోతున్నది. పోలీసులకి తెలిస్తే.... మైగాడ్! నా పరువేం కావాలి!

"అందుకని, గొంతు పసికి చంపాను. వేలిముద్రలు పడ్డాయని అనుమానమున్న చోటల్లా కర్చీఫ్‌తో తుడిచాను—అంతే! జరిగింది!" అంటూ తల దించుకున్నాడు మోహన్ తండ్రి. చేపకోసం వలేపిన వాడికి మరేదో దొరికిన స్థితి అయింది మాది.

రెడ్డివైపు చూసాను.

కప్పతీసి తగిలించాడు మోహన్ తండ్రికి.

స్టేషన్ వైపు బయల్దేరింది జీపు.

మధ్యదారిలో రెడ్డి అడిగాడు. "బ్రదర్! ఓ విషయం అడుగుతాను. నిజం చెబుతావా?"

"డెఫనెట్లీ."

"నీ దృష్టిలో మోహన్ హంతకుడు గాని, వాళ్ళ నాన్న కాదుగా? నిజం చెప్పు!"

గుంభనంగా నవ్వాను.

"ఎగ్జాట్లీ రెడ్డి! నీరజ హత్య జరిగినపుడు వాళ్ళ బామ్మ పక్కింటావిడతో దేవాలయానికి వెళ్ళానంది. అంటే మోహన్ వాళ్ళ అమ్మతో.... అందుకని మోహన్ అబద్ధం చెప్పుండొచ్చునని అనుమానించాను. వాళ్ళ నాన్నకు అవకాశం వుంటుందని ఆలోచించలేదు.

"అదీగాక, రెడ్డీ! నేను అపరాధ పరిశోధకుణ్నే గానీ, ఆస్థాన జ్యోతిష్కుడ్ని కాదుగా!" అన్నాను.

బిగ్గరగా నవ్వాడు రెడ్డి. □

పెడమొగం!

సౌఖ్యం ఎక్కడ?

అంధాన భగవతిరావు

మారువేషాల్లో తిరగడం అంటే భలే సరదా నాకు.

అందుకు తగ్గ వృత్తినే ఎన్నుకున్నాను. ఆ వృత్తిలో ఒక్కో మెట్టు పైకి వచ్చాను కూడా.

నిలువుటద్దం ముందు నిలుచుని,—పర్మనెంటుగా నాకున్న బొద్దుమీసాల్ని తీసేశాక—నా మొహం ఎలావుందో

చూసుకున్నాను. మొహానికి మరికాస్త రంగులు పులుము కున్నాక, నా వయస్సు పదేళ్ళు తగ్గినట్టయింది. ఎంతో పరి చయం వున్నవారయినా పరిశీలనగా చూస్తే తప్ప నన్ని ప్పుడు గుర్తించలేరు. చిన్నగా నవ్వుకుని వాలెట్ అందు కున్నాను. కోటీశ్వరుడి కడుపులా నిండుగా, బరువుగా వుందది. అందులో సుమారు ముప్ఫయివేల రూపాయలు, అన్నీ వందరూపాయల నోట్లు వున్నాయి. అసలు నోట్లు లాగే కనిపించే నకిలీనోట్లు అవన్నీను!

వాలెట్‌ను కోటుజేబులో పెట్టుకుంటూ హుషారుగా బయటకు నడిచేను.

కారుదగ్గర దాసు రెడీగా వున్నాడు. మీసాలు లేని నా మొహాన్ని చూసి వస్తున్న నవ్వును ఆపుకోటానికి కాబోలు మొహం పక్కకు తిప్పుకున్నాడు.

"ఫర్లేదు. నవ్వొచ్చినప్పుడల్లా నవ్వేయడం వొంటికి మంచిది. నవ్వు ఆరోగ్యానికి టానిక్ లాంటిది" నవ్వుతూ అన్నాను.

దాసు ముసిముసిగా నవ్వుతూ బాక్‌డోరు తెరిచాడు.

"నేను చెప్పినదంతా జ్ఞాపకముంది కదూ" కారులో కూచుంటూ అడిగాను దాసుని.

"ఉంది సార్" అంటూ దాసు కారు స్టార్ట్ చేశాడు.

రెండు నిముషాల్లో నేషనల్ హైవే మీదికి వచ్చాము. మరో పది నిముషాల్లో సిటీ లిమిట్స్ దాటేసాము.

సిగరెట్ ముట్టించి గుప్పున పొగ వొదులూ బయటకు చూస్తున్నాను. నగరపు కృత్రిమ వెలుగు మాయమయింది. పున్నమి కాబోలు—కవులు వర్ణించినట్టు—పుచ్చపువ్వు లాంటి వెన్నెల—పచ్చటి చేలమీద, పొలాల గట్లమీ దున్న కొబ్బరి చెట్లమీద పడి వెండిలా మెరుస్తోంది. నిరంతరం

బిజీగా కృత్రిమ వాతావరణంలో కొట్టుకుపోయే నాలాటి వారికి ఈ ప్రకృతి రమణీయకత ఎంతో హాయిగొలుపుతూంది.

రివ్వున వీస్తున్న చల్లటిగాలికి సిగరెట్ ఆరిపోయింది. దాన్ని బయటకు విసిరేస్తూ టైము చూసాను. రేడియమ్ అంకెలు మెరుస్తున్నాయి చీకట్లో. పదీ నలభై అయింది.

బయట వెన్నెలలోని ప్రశాంత ప్రకృతిని, చల్లనిగాలిని అనుభవిస్తూ వుండిపోయాను.

గంట గడిచింది.

దూరంగా ఏదో ఊరు ఛాయలు కనిపించాయి. స్ట్రీట్ లైట్లు మిణుగురు పురుగుల్లా కనిపిస్తున్నాయి పెట్రోలు బంక్ దాటుకుంటూ ముందుకు పోయింది కారు. మరి కొంచెం దూరంలో మామిడితోపు తగిలింది.

తోపు మలుపు తిరిగాక, దూరంగా ఎవరో రోడ్డుకడ్డంగా నిలుచుని వుండటం కనిపించింది. దగ్గర పడుతున్న కొద్దీ స్పష్టంగా కనిపించసాగేరు. జెమాజెట్టిల్లా వున్నారు! మొత్తం నలుగురు! ఒక్కొక్కడి చేతిలోనూ ఒక్కొక్క దుడ్డుకర్ర నిగనిగలాడుతున్నాయి. పంచలు కట్టుకుని, బనియన్లు తొడుక్కుని వున్నారు. ముగ్గురు రోడ్డు అంచున నిలబడివుండగా ఒకడు మాత్రం, కారు ఆపమన్నట్టు చేయి ఊపుతూ రోడ్డు కడ్డంగా నిలుచున్నాడు.

"దాసు కారు ఆపు" అన్నాను.

వారిదగ్గరగా వెళ్ళి కుదుపులేకుండ ఆగింది కారు.

రోడ్డుకు అడ్డంగా నిలుచున్నవాడు బాక్ డోర్ దగ్గరకు వచ్చి లోపలకు తొంగిచూసేడు.

"ఏం కావాలి?" అనడిగేను.

మిగిలిన ముగ్గురూ రోడ్డు అంచునే దిష్టిబొమ్మల్లా నిల

చుని వున్నారు.

"ఎంతాకా పోవాలి సార్?" అడిగేడు వాడు. గొంతు కర్కశంగా వుంది. దౌర్జన్యంలో ఆరితేరిన వాడిలా కని పిస్తున్నాడు. ఈ ఊరు చివరి వరకూ నేషనల్ హైవే మీద దాదాపు నాలుగయిదు చోట్ల రాత్రివేళ ఇలా కారులు ఆపు జేస్తుంటారని ఇదివరకే విన్నాను.

"నీకేం కావాలి?" రెట్టించి అడిగేను.

"ఈ రాత్రివేళ ముందుకు పోవడం అంత మంచిది కాదు. మీకు అభ్యంతరం లేకపోతే మాతో రండి. మజా చేయటానికి మంచి సరుకు వుంది హాయిగా రెస్టు తీసు కుని తెల్లవారే వెళ్ళిపోవచ్చు" అన్నాడు.

"ఓహో! నువ్వు బ్రోకరువన్న మాట."

అతను మాట్లాడలేదు.

"ఈ పల్లెటూరు సరుకేం అక్కర్లేదు. డ్రయివర్ పోనీ" అన్నాను.

"ఒక్కసారి వచ్చి చూడండి. మీకే తెలుస్తుంది. ఫామిలీ సైపు" అన్నాడు.

"అక్కర్లేదు. డ్రయివర్...."

దాసు కారు స్టార్టుచేసాడు రెండుసార్లు పెద్దగా శబ్దం చేసి ఊరుకుంది ఇంజను దాసు దిగి వెళ్ళి బోనెట్ ఎత్తాడు. పది నిముషాలయాక నా దగ్గరకు వచ్చి "ఇంజను ట్రబుల్ ఇస్తుంది సార్. బాగు చేయటానికి గంట, రెండు గంటలు పట్టవచ్చు" అన్నాడు అతి వినయంగా.

"డామిట్" విసుక్కుంటూ బయటికి వచ్చాను. "సరే నువ్వు కారు సంగతి చూడు. బాగయితే కారులోనే పడుకో. నేను తెల్లవారి వస్తాను." అని దాసుతో చెప్పి, అప్పటివరకూ నా మొహాన్ని తేరిపార చూస్తున్నతనితో,

"పద" అన్నాను.

అతను ఆనందపడిపోయి. "రండి సార్" అంటూ తోవతీశాడు. మా వెనుక వారు ముగ్గురూ కదిలేరు.

"వీరెవరు?" అడిగేను.

"మావాళ్ళే. తోడుకోసం" అన్నాడు.

చీకట్లో రెండు, మూడు సందులు తిరిగేక ఓ పెంకుటింటి ముందాగి నెమ్మదిగా తలుపుతట్టేడు. నిమిషం తరువాత తలుపు తెరుచుకుంది. లోపల చీకటిగా వుంది. మనిషి స్పష్టంగా కనిపించడం లేదు ఆడమనిషని మాత్రం తెలుస్తూంది.

"రండి" అంది. గొంతులో అదో విధమైన జీరః సెక్సీగావుంది మనిషెలా వుంటుందో ననుకుంటూ లోపలికి వచ్చాను. వెనుకనుండి తలుపులు మూసుకున్నాయి ఆమె నా చేయి పట్టుకుని మరోగదిలోకి తీసుకువచ్చింది. ఆ గది ట్యూబులైట్లకాంతితో పట్టపగల్లావుంది. బెడ్‌రూం కాబోలు దివ్యంగా అలంకరించివుంది.

డన్‌లప్ ఫోమ్‌బెడ్. గోడలకు స్త్రీ నగ్నత్వాన్ని అనేక భంగిమలలో చూపిస్తున్న ఖరీదయిన తైలవర్ణ చిత్రాలు. నేలమీద కార్పెట్. ఈ వృత్తిలో బాగానే సంపాదిస్తున్నట్టుంది ఆమెకేసి చూసాను. నవ్వింది ముత్యాల వరుసలాంటి పళ్ళు, గుండ్రనిముఖం, విశాలమయిన కళ్ళు, పల్చటి ఎర్రటి పెదవులు, గుండని భుజాలు, ఎత్తయిన స్తనద్వయం, సన్నటినడుము. ఎటువంటి వారినయినా రెచ్చగొట్టగల అందం, ఆకర్షణ ఉందామెలో.

"కూర్చోండి" అంది.

కూచుంటూ అడిగేను "నీ పేరేమిటని".

"ఏమయినా తీసుకుంటారా!"అడిగిందామె. పేరు చెప్ప లేదు.

"ఏమీ అక్కర్లేదు" అన్నాను.

"సరే లైటు వుంచనా తీసివేయనా" అడిగింది.

"నీకు పెళ్ళయిందా?" అడిగేను.

"ఈ ప్రశ్నలు అడగటానికి మీరు రాలేదు." నవ్వుతూ అన్నది.

"మరి దేనికివచ్చాను?"

ఆమె నవ్వి ట్యూబ్‌లైట్లు తీసేసి, జీరోవాట్ బల్బు వేసింది. పల్చటి నీలంరంగు గదినిండా పరుచుకుంది. ఆమె నా ఎదుటనే చకచకా చీర తీసేసి సోఫామీద పడేసింది. తెల్లటి సాటిన్ లోపావడా, జాకెట్‌తో నిలుచుంది. జాకెట్‌లోనుండి బ్రాసరీ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. జాకెట్‌నుకూడా తీసివిసిరేసి, నా పక్కకు వచ్చికూచుంది.

నేను చలనం లేకుండా అలా కూచోడం చూసి, "ఏమి టలా చూస్తున్నారు. ఎప్పుడూ ఆడదాన్ని చూడనట్టు"అంది.

నేను లేచి నిలుచుని, "నీ రేటు రాత్రికి ఎంతో మొదట చెప్పు" అన్నాను.

"వంద" అంది.

"ఒక్కరాత్రికి వందా. చాల ఎక్కువే!" అన్నాను.

"బజారు సరుకనుకున్నారా?" అంది.

నేను మాటాడలేదు. కోటు జేబులోంచి వాలెట్ తీసాను. వందరూపాయల కట్టను బయటికి తీసి, అందులో ఒక 'కాగితం' ఆమెకు అందించాను. "చూడు నేను బాగా అలసిపోయాను నిద్రపోవాలి. నీకు నష్టంలేకుండ ఈ డబ్బు ఇస్తున్నాను తీసుకో" అన్నాను.

ఆమె చిత్రంగా నాకేసి చూసి, నోటు అందుకుంది.

వందరూపాయల నోట్లకట్టను చూసినపుడు ఆమె కళ్ళు చిత్రంగా మెరవడం చూసాను.

"ఇక్కడ పడుకోండి" అందామె బెడ్ చూపిస్తూ.

నేను వాలెట్‌ను కోటుజేబులో పడేసి, కోటును విప్పి స్టాండుకు తగిలించాను. బూట్లు విప్పాను. పైన ఫ్యాను ఫుల్‌స్పీడులో తిరుగుతోంది.

2

తెల్లవారి నాలుగుగంటలకు మెలకువ వచ్చింది. ఆమె నన్ను తట్టి లేపుతోంది. లేచి కూర్చున్నాను.

"తెల్లవారుతోంది ఇక వెళ్ళండి" అంది.

నేను లేచి బూట్లు వేసుకుని, కోటు తొడుక్కున్నాను. ఆమె తలుపుతీసింది. బయట ఇంకా బాగా చీకటిగావుంది. బయట అరుగుమీద—నన్ను తీసుకువచ్చిన—వ్యక్తి నిద్ర పోతున్నాడు. ముగ్గురేమో పక్కనున్న గొడ్లసావిడిలో ముడుచుకుని పడుకున్నారు.

"భీముడూ....ఏయ్ భీముడూ" తట్టి లేపింది.

అతను కళ్ళు నులుముకుంటూ లేచాడు.

"బాబుగార్కి తోడుగా వెళ్ళరా" అంది.

అతను లేచి గొడ్లపాకలో నిద్రపోతున్న ముగ్గురినీ లేపుకువచ్చాడు. సందులుదాటి రోడ్డు మీదకు వచ్చాము. పరిసరప్రాంతమంతా నిర్మానుష్యంగావుంది. కీచురాళ్ళరొద వినిపిస్తోంది.

సిగరెట్ పాకెట్‌కోసం కోటుజేబులోకి చెయ్యిపెట్టాను. అప్పుడు గుర్తుకువచ్చింది. కోటుజేబు ఇంతకు ముందులా బరువుగాలేదని. చటుక్కున వాలెట్ బయటకు తీసాను. గాలిపోయిన బంతిలావుంది. లోపలి ముప్ఫైవేల రూపాయలకి రెక్కలు వచ్చేసాయి. హుష్‌కాకి!

"నా డబ్బు....నా డబ్బు...." కంగారుగా అన్నాను.

"మేం వస్తాం" నా కంగారు పట్టించుకోకుండా, నన్ను రోడ్డెక్కించి వారు వెనుతిరగబోయారు.

"ఆగండి" అరిచేను. వారు ఆగారు.

"నేను ఆ ఇంటికి మళ్లీ వెళ్ళాలి. అక్కడ నా డబ్బు పోయింది పదండి" అన్నాను.

"మీ డబ్బు ఎక్కడో పోయివుంటుంది. మీరిప్పుడు అక్కడికి రావటానికి వీలుకాదు" అన్నాడు భీముడు.

"ఎందుకని. నా డబ్బు అక్కడే కొట్టేసారు".

"మీ డబ్బు విషయం మాకు అనవసరం. ఇది సీక్రెట్ బిజినెస్సు. అక్కడ గొడవపడటానికి వీలుకాదు. వెంటనే వెళ్ళిపొండి" కర్కశంగా అన్నాడతను.

"అన్యాయం. మోసం. నేను మీ మీద పోలీస్ కంప్లయింటు ఇస్తాను" అరిచేను.

"ఏం చేసుకుంటావో చేసుకో....కాని తెల్లవారేలోపల ఈ ఛాయల్లో కనిపించావో...." దుడ్డుకర్రలు పైకిఎత్తి చూపించి, "జాగ్రత్త" అన్నారు. ఈ లోపల అక్కడికి చేరుకున్న దాసు ఒకడుగు ముందుకు వేయబోయాడు. దాసు చేయిపట్టి ఆపాను. క్షణంలో అలాంటి మరో నలుగురిని మట్టి కరిపించేగలడు దాసు.

"పద" అంటూ కారుకేసి అడుగులు వేసాను. దాసు నన్ననుసరించేడు. మా కారు వారి పక్కనించి వెళుతుండగా, విజయగర్వంతో నవ్వాడు భీముడు.

"ఎక్కడన్నా కాఫీతాగాక పోలీస్‌స్టేషనుకు వెళ్దాం" అన్నాను సిగరెట్ ముట్టిస్తూ.

కొంతదూరం వెళ్ళాక లెవల్‌క్రాసింగ్ దగ్గర రోడ్డుకు ప్రక్కన కారు ఆపాడు దాసు. ఊరు నెమ్మదిగా నిద్ర

మేలుకుంటుంది. ఓ పాకహోటల్ దగ్గర ఓ ముసలాడు దగ్గుతూ పొయ్యి రాజేస్తున్నాడు. దూరంగా ఏదో ట్రైను వస్తున్న చప్పుడు వినిపిస్తోంది.

దాసు పాకహోటల్ దగ్గరకు వెళ్ళి వాటర్‌బాటిల్‌లో నీళ్ళు పట్టుకొచ్చాడు. ముఖం కడుగుకున్నాను.

అరగంట తరువాత దాసు పిలవగా హోటల్‌లోకి వెళ్ళాను. వేడి ఇడ్లీ చట్నీ ఓమాదిరి రుచిగానే ఉన్నట్టని పించాయి. ఇడ్లీతిన్నాక, కాఫీ తాగి, బయటకు వచ్చాను. సిగరెట్ పీలుస్తూ కారుని ఆనుకుని నిలుచున్నాను. మరో పావుగంటలో దాసువచ్చాడు.

అప్పటికి బాగా తెల్లారిపోయింది.

మరి కాసేపు అటు యిటు తచ్చాడాక, పోలీస్ స్టేషనుకి బయలుదేరాము. స్టేషనుకి కొంచెం దూరంలోనే రోడ్డు పక్కగా కారు ఆపి, నడుచుకుంటూ స్టేషన్‌కి వెళ్ళాం.

ఇనస్పెక్టరు చిదంబరం కుర్చీలో కునికిపాట్లు పడుతు న్నాడు. నల్లగా చింతమొద్దులా వుంటాడు చిదంబరం. కోరమీసాలతో, చింతనిప్పుల్లాంటి కళ్ళతోవున్న అతని మొహం చూస్తే, పసివారు మూడురోజులవరకూ నిద్ర పోరు. చిదంబరం ఎదురుగా నిలుచుని చిన్నగా దగ్గాను.

అతను తలఎత్తి చూసి,"యస్. ఎవరు మీరు? ఎందుకు వచ్చారు?" అన్నాడు. అతను మాట్లాడుతుంటే పులి గుర్రు పెడుతున్నట్లుంది.

అతను కూచోమనకపోయినా, కుర్చీలాక్కుని కూచుని, "నా పేరు శ్రీ వేంకటచలపతి శేషగిరిరావు. హోల్‌సేల్ క్లాత్ మర్చంటుని. నా పేరు మీరు వినేవుంటారు" అన్నాను.

అతను గుర్రుమన్నాడు. నా పేరు విన్నట్టు అతని మొహంలో ఎక్కడా దాఖలా కనిపించలేదు. ఎలా కని

పిస్తుంది. నేనసలు నిజం చెపితేగదా.

"ఏమిటి విషయం?" మళ్ళీ గుర్రుమన్నాడు.

నేను రాత్రి జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పి. "కంప్లయింటు రాపివ్వొచ్చుకాని అది నా పరువుకి సంబంధించిన విషయం. దయచేసి నా ముప్పైవేలు ఎలాగో దక్కిస్తేచాలు" అన్నాను బతిమాలుతూన్న ధోరణిలో.

"అలాంటివి ఇక్కడ జరుగుతున్నట్టులేదే. నేనసలే చాలా స్ట్రిక్టు. నా పేరు వింటేనే ఇక్కడ అంతా హడలిపోతారు." గర్వంగా మీసం దువ్వుకున్నాడు.

"ఆ విషయం తెలుసుసార్. కాని అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకు లేదు" అన్నాను.

"అయితే వాళ్ళెవరో పేర్లుగ్గట్టా తెలుసా?"

"తెలీదు. మనుషుల్ని గుర్తుపట్టగలనంతే."

"తప్పుడుపనులు చేసి, మా నెత్తిమీద కూర్చుంటారయ్యా" అని విసుక్కుని, "పోనీ అక్కడకు వెళ్ళినట్టు సాక్ష్యంవుందా?" అని అడిగేడు.

"ఊఁ హూఁ లేదుసార్" అన్నాను.

"లాభంలేదు. కంప్లయింట్ రాపిచ్చినా మేమేం చేయలేము. వెళ్ళిరండి" అన్నాడు కుర్చీలో రిలీఫ్‌గా కదులుతూ.

"సార్! అలాగంటే ఎలా? ఒకటి రెండూ కాదు ముప్పైవేల రూపాయలు. మీ శ్రమ వుంచుకోను" నెమ్మదిగా అన్నాను చివరి మాటల్ని.

"షటప్. ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా. నిప్పు. నేను నిప్పులాంటివాణ్ని అరిచాడు.

"క్షమించండి. ఏదో మాట జారేను"

"ఊఁ సరే. ఆవిడ ఎలా వుంటుందో వర్ణించగలవా?" నాడిగేడు.

చెప్పాను.

"ఊఁ సరే ఇక మీరు వెళ్ళండి. ఇంకెప్పుడూ ఇలాంటి న్యూసెన్సు కేసులతో పోలీస్ స్టేషన్లకు రాకండి" అన్నాడు.

"అంతేనా సార్" దీనంగా అడిగాను.

"అంతే. సాక్ష్యంవున్నా మేమేదో చేసేవాళ్ళం. ఇంతకూ వ్యభిచారం నేరంకింద. నాకు లంచమిస్తా నన్నందుకు అవినీతి నేరంకింద మిమ్మల్ని యింకా అరెస్టు చేయనందుకు సంతోషిస్తూ వెళ్ళండి" అన్నాడు.

నేను మొహం వేలాడేసుకుని బయటకు నడిచాను. బయట వరండాలో కూచున్న దాసు "ఏమయింది సార్?" అనడిగేడు నన్ననుసరిస్తూ.

"ఇంతవరకూ అంతా ఓ.కే. మరో సీక్వెన్స్‌తో కథ ముగుస్తుంది" అన్నాను.

కారు దగ్గరకు చేరుతూనే డాష్‌బోర్డులోంచి వైర్లెస్ సెట్ తీసి ఆన్‌చేసి పెట్టాను. ఓపిగ్గా సిగరెట్ పీలుస్తూ కూచున్నాను. దాదాపు అరగంట తరువాత ట్రాన్స్‌మిటర్ లోంచి శబ్దాలు రాసాగాయి. వెంటనే మరో బటన్ నొక్కాను. ట్రాన్స్‌మీటర్ రిసీవ్ చేసుకునే మాటలు ఆటోమాటిక్‌గా రికార్డయ్యే ఏర్పాటువుంది అందులో.

"నమస్కారం సార్! రమ్మన్నారట" భీముడిగొంతు.

"ఆఁ ఏవిటోయ్, రాత్రి ఖరీదయిన బేరం తగిలినట్టుంది" చిదంబరం గొంతు.

"ఏముందిసార్! మామూలే."

"అద్సరే. ఏది నా వాటా?"

"తెచ్చాను సార్."

"ఎంత?"

చెప్పాడు.

"నాన్సెన్స్ రాత్రికి రాత్రి ముప్పైవేలు కొట్టేసి నాకు మస్కా పడేస్తున్నారా రాస్కెల్స్. నేనసలే తిక్కరేగితే మనిషిని కాదు తెలుసుకదూ. నాకేం తెలీదనుకోకు. వాడొచ్చి మప్పై వేలు పోయాయని ఒహటే గోలపెట్టిపోయాడు."

"అలాగాసార్!"

"మరేవిటనుకున్నావ్. వాడిని బెదరగొట్టేసరికి నా తల ప్రాణం తోక్కొచ్చింది. సరేకాని నువ్వెళ్ళి మీనాక్షితో చెప్పు రాత్రికి వస్తాను. పార్టీ ఎరేంజ్ చేయమను. కొట్టేసిందాంట్లో సగం వాటా నాదనిచెప్పు. యిక వెళ్ళు."

"చిత్తం"

హుషారుగా విజిల్ వేసాను."దాసు పెట్టి వలలో చిక్కుకుంది పద" అన్నాను.

3

నన్ను చూస్తూనే మొహం చిట్లించాడు చిదంబరం.

తాపీగా కుర్చీలో కూచుని సిగరెట్ ముట్టించాను.

"మళ్ళీ ఎందుకు వచ్చారు?" విసుగ్గా అడిగేడు.

"సాక్ష్యం కావాలన్నారుగదా, తీసుకువచ్చాను"అన్నాను.

"ఏది? ఎవరు? ఎక్కడ."

"ఇదుగో యిక్కడే యిదే" అంటూ వైర్లెస్ సెట్ బయటికి తీసి బటన్ నొక్కాను.

అంతా విన్నాక చిదంబరం నుదుటపట్టిన చెమట తుడుచుకుంటూ, "యిదంతా ఎలా రికార్డయింది" అంటూ అరిచాడు.

"ఇందాక వచ్చినపుడు నీ బల్లకింద హియరింగ్ బగ్ పెట్టాను" బల్లకిందనుండి దాన్ని తీసి చూపించాను.

"నాన్సెన్స్" పిచ్చికుక్కలా అరిచేడు. మెరుపులా లేచి నిలుచున్నాడు. అతని చేతిలో పిస్టల్ మెరిసింది.

"నువ్వెవరో చాలా తెలివైనవాడిలా వున్నావు. అ

స్టేషన్లో నాతో చెలగాటమాడేందుకు నీకెంత ధైర్యం? నిన్ను ప్రాణాల్తో వొదిత్తే నాకే ముప్పు" ఆవేశంతో పిచ్చివాడయ్యాడు చిదంబరం. ట్రిగ్గర్ మీద అతని వేలు బిగుసుకుంటుంది

"ఢాం!"

చిదంబరం చేతిలోని పిస్టల్ దూరంగా వెళ్ళిపడింది. దాసు ఇనపస్థంబంలా నిలుచునివున్నాడు. అతని చేతిలో రివాల్వర్ నిగనిగలాడుతుంది.

"వెల్‌డన్ దాసూ" మెచ్చుకున్నాను దాసుని.

"ఎవ్వరూ కదలకండి" దాసు అన్నాడు కామ్‌గా.

ముందుకు అడుగువేయబోతున్న ఓ కానిస్టేబుల్ అక్కడే శిలాప్రతిమలా వుండిపోయాడు. మిగిలినవారు సరేసరి.

"ఎవరు మీరు? ఏమిటిదంతా? నా నుండి తప్పించుకో లేరు. ఈ స్టేషన్‌నుండి ప్రాణాలతో బయటపడలేరు తెలుసా?" అన్నాడు చిదంబరం. అతనిగొంతులో ఇందాకటి కర్కశత్వంలేదు. పీలగావుంది.

సిగరెట్‌బిట్‌ను యాష్‌ట్రేలో కుక్కి, మరోటి ముట్టించాను.

"మిస్టర్ చిదంబరం." సిగరెట్‌పొగ వొదుల్తూ గంభీరంగా అన్నాను, "ఈ ఊళ్ళో వ్యభిచారం చేస్తూ డబ్బు సంపాయించడం రుచిమరిగిన సంసారాలు దాదాపు ఓ పది తయారయ్యాయి. ముఖ్యంగా నేషనల్ హైవే ఈ ఊరి మీదుగా పోతుండడంతో, వ్యభిచారుల బ్రోకర్లు కార్లమీద వచ్చే ఖరీదయిన వారిని పట్టుకుంటున్నారు.

అయితే వ్యభిచారం చేస్తున్న స్త్రీలు తమకు వచ్చే రాబడితో తృప్తిపడక విటుడిదగ్గరున్న డబ్బుని కాజేయడం ప్రారంభించారు. ఇదో రకమయిన దోపిడి! దోపిడీకి

గురయినవారు ఏమాత్రమో పేరు ప్రతిష్ఠలు గలవారు కావడంతో, డబ్బుపోతే పోయింది. పరువు పోకూడదని తేలుకుట్టిన దొంగల్లా వెళ్ళిపోతున్నారు. అధవా ఎవరో తెగించి కంప్లయింటు యిచ్చినా వారిని బెదరగొట్టి పారిపోయేలా చేస్తున్నావు నువ్వు. అందుకోసం నీకు రోజుకు 'ఇంతని' వారి దగ్గర్నుంచి ముడుతుంది...."

"చాలా ముఖ్యమయిన విషయాలే సేకరించావు. ఇంత శ్రమపడవలసిన అవసరం నీకేమిటి? యిందులో నీకేం లాభం వుంటుంది?" అన్నాడు చిదంబరం.

"యిది నా డ్యూటీ మిస్టర్ చిదంబరం." అంటూ నా ఐడెంటిటీ తీపి అతనికి ఎదురుగా బల్లమీద పడేసాను.

"అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్..." పూర్తిగా చదవకుండానే కళ్ళు తేలేసి కుర్చీలో కూలబడిపోయాడు చిదంబరం.

"దాసూ కమాన్" అంటూ బయటకు నడిచాను. దాసు నన్ననుసరించేడు. □

వేడి వేడి ఉత్తరం !!



హత్య-ఆత్మహత్య

పి.వి.జి

"కార్పొరేషన్ కౌన్సిలర్ రావ్‌సాహెబ్ పరమానందం గారుపిస్టల్‌తో కాల్చుకొని, ఆత్మహత్య చేసుకున్నారు."

ఇనస్పెక్టర్ సింహాద్రి మాటలకు డిటెక్టివ్ దీక్షిత్ ఏమాత్రం ఆశ్చర్యపడలేదు. కొందరి జీవితాలు అలాగే అంతమొందుతుంటాయి....అప్పులో—లేక స్త్రీలో, ఏవో

కారణాలు ఉంటాయి, అనుకున్నాడు దీక్షిత్.

"కాని, మన డాక్టర్ గోపాలరావుగారు మరోవిధంగా భావిస్తున్నారండి. పరమానందంగారు ఆత్మహత్య చేసుకోవడానికి అవకాశం లేదట. ఎవరో హత్యచేసుండాలని ఆయన అభిప్రాయం."

"సరే—పోదాం పద" అన్నాడు దీక్షిత్, కాస్సేపు దీర్ఘంగా ఆలోచించాక.

రావ్‌సాహెబ్ పరమానందానికి దాదాపు 45 ఏళ్ళుంటాయి. ధనికుడు. ఎనిమిదేళ్ళ క్రితం అనకాపల్లి నించి మద్రాసుకు వచ్చాడు. మందుల షాపుపెట్టి, లక్షలు ఆర్జించాడు. కాస్తో కూస్తో దానధర్మాలు చేసి, మంచి పలుకుబడి సంపాదించాడు. రాజకీయాలలో కూడా చాలా కాలంగా ప్రవేశం వుండటం మూలంగా కార్పొరేషన్ కౌన్సిలర్ పదవిని అలంకరించడానికి అట్టే శ్రమపడవలసిన అవసరం లేకపోయింది.

అనకాపల్లిలో వున్నప్పుడే ఆయన భార్య గతించింది. పిల్లలు లేరు. అయినా, మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఎప్పుడో శతాబ్దం క్రితం నిర్మించబడిన మద్రాసులోని ఆ లంకంత కొంపలో ఆయనొక్కడే బిక్కుబిక్కు మంటూ ఉండేవాడు.

ఇంటిపనులను, వంటపనులను ఒక దాసీది చేసిపెట్టేది. శ్రీదేవి దాని పేరు. షుమారు యాభై ఏళ్ళుంటాయి. చదువుకోక పోయినా చక్కగా మాట్లాడుతుంది. ఆమెను అనకాపల్లినించి పరమానందం తనతోపాటు తీసుకువచ్చాడు. శ్రీదేవి చాలా మంచిదని. నమ్మకమైనదని పరమానందం తన మిత్రులతో చాలాసార్లు అన్నాడు.

కొన్ని రోజులముందు పరమానందానికి జబ్బుచేసింది.

ఇటీవలే కా_స్త లేచి, మెల్లగా తిరగ గలిగేవాడు. అయినా, ఇల్లువదలి బయట కెక్కడికీ కదిలేవాడు కాదు. రెండు రోజుల క్రితం అనకాపల్లి నించి ఒక ఆగంతకుడు వచ్చి, పరమానందం యింట్లో దిగాడు. అతని పేరు ఆంజనేయులు.

పరమానందం ప్రతి రోజూ ఉదయం అయిదు గంటలకే లేచి, అన్ని అవశిష్టాలూ తీర్చుకునేవాడు. దాసీది వచ్చి వీధి తలుపు తట్టేవేళకు తన గదిలో భగవన్నామస్మరణలో నిమగ్నుడై వుండేవాడు.

ఈ వేళ ఉదయం మామూలుగా—ఆరు గంటలయ్యాక దాసీది వచ్చి తలుపు తట్టేసరికి చాలా సేపటివరకు ఎవరూ తలుపు తీయలేదు పది నిమిషాల తర్వాత ఆంజనేయులు వచ్చి, మెల్లగా తలుపు తెరిచాడు. అతని ముఖం అదో విధంగా వుందేమా అనుకుంటూ, దాసీది ఇంట్లోకి అడుగెట్టింది. తర్వాత తన పనులన్నీ నిర్వహించింది.

అరగంటవరకు పరమానందం ఇంట్లో తనకెక్కడా కనిపించకపోయేసరికి ఆయనకు ఒంట్లో ఏదైనా సు_స్తీ చేసి— ఇంకా గదిలో నే పడుకొని వున్నారేమో అనుకుందట. కాస్సేపయ్యాక కాఫీ కప్పును చేతబట్టి, ఆయన గదివద్దకు వెళ్ళింది. గదితలుపు మూసి వుంది.

'బాబుగారూ!' అని పిలిచిందట. జవాబురాలేదు. 'బాబుగారూ, కాఫీ!' అంటూ తలుపుతట్టింది. తలుపు మెల్లగా తెరుచుకుంది. ఆశ్చర్యంతో మెల్లగా గదిలోకి అలా అడుగెట్టిందో లేదో—అమాంతంగా కొయ్యబారిపోయిందట.

గది మధ్యన పరమానందం బోర్లగిల పడి వచ్చి పడున్నాడు తలమీద పెద్ద గాయం ఉంది. తలకు కొద్ది దూరంలో ఒక పిస్టల్ పడుంది.

దాసీదానికి ఏం చేయడానికి తోచలేదు. 'బాబుగారూ, బాబుగారూ!' అని ఆంజనేయులుకోసం కేకలెడ్తూ, కాలు కాలిన పిల్లిలా ఇల్లంతా పరుగెత్తసాగింది. చివరికి "ఇక్కడున్నాను. ఏమిటి సంగతి?" అంటూ స్నానాల గదిలోంచి ఆంజనేయుల గొంతు వినిపించింది.

'అయ్యగార్ని ఎవరో చంపారు; తుపాకీతో చంపారు.' అన్నదట దాసీది నిలువునా కంపించిపోతూ.

'ఆ!' అని ఆంజనేయులు విస్తుపోతూ, మరో నిమిషంలో స్నానాల గది తలుపులు తెరుచుకొని బయటకు వచ్చాడు.

"మీ రిక్కడే వుండండి. పోలీసోళ్ళను పిలుచుకు వస్తాను" అని దాసీది హడావిడిగా పోలీస్‌స్టేషన్‌కు పరుగెత్తింది.

అర్ధగంటలో ఇన్‌స్పెక్టర్ సింహాద్రి, పోలీస్ డాక్టర్ గోపాల్‌రావు వచ్చారు. శవాన్ని పరీక్షించాక డాక్టర్‌గోపాలరావు, సింహాద్రి చెవిలో రహస్యంగా తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు వెంటనే డాక్టర్ గోపాలరావును అక్కడే వుండమని, సింహాద్రి పోలీస్ వేన్‌లో దీక్షిత్ భవనానికి చేరుకొని, ఆయనతో ఈ విషయాలన్నీ విపులంగా చెప్పాడు....

2

శవం పడున్న గదిముందు హాలులో నిలుచోనున్న ముగ్గురి వ్యక్తుల్ని దీక్షిత్ చూశాడు.

పిలక్క లాల్చీ, మల్లుధోవతీ ధరించి విచారంగా ముఖం పెట్టి వున్న మఫ్పై ఏళ్ళ వ్యక్తి ....అతనే ఆంజనేయులు అయి వుండాలని తొలి చూపులోనే దీక్షిత్ గ్రహించాడు. చెమ్మగిల్లిన కళ్ళతో ఓ మూల స్తంభానికి ఆనుకొని వున్న

ఓ వృద్ధ స్త్రీ....ఆమెను చూడగానే దాసీదని యిట్టే తెలసి పోయింది. ఇకపోతే—పరమానందం ఆకస్మిక మరణం గురించి తుది నిర్ణయానికి వచ్చేశానన్న సంతృప్తితో ముఖంపెట్టి, దీక్షిత్‌కు నమస్కరించిన పోలీస్ డాక్టర్ గోపాలరావు.

ఈ ముగ్గురి మీదనుంచి దీక్షిత్ దృష్టి శవం పడున్న గదికేసి తిరిగింది. మెల్లగా ఆ గదిలోకి ప్రవేశించాడు. బోర్లపడున్న పరమానందం శవాన్ని కాస్సేపు పరిశీలించాడు. తర్వాత గది నలువైపులా కలయజూశాడు.

తూర్పు వైపున వున్న ఒక కిటికీ తెరువబడివుంది. ఆ కిటికీ తలుపుకు కొక్కెంలేదు. దక్షిణంవైపున ఉన్న కిటికీ, పడమటి వైపున వున్న కిటికీ మూయబడి. కొక్కీలు తగిలించబడి వున్నాయి. శవానికి కొద్ది దూరములో ఒక పిస్టల్ పడుంది. పిస్టల్ పక్కన ఒక పొడుగాటి కర్ర వుంది.

"ఒకే ఒక తూటా పేలింది. మన వేలిముద్రల నిపుణుడు యింకో పావుగంటలో వస్తాడనుకుంటా. అయినా, చూడబోతే—ఈ హత్య చేసినవారెవరో చాలా తెలివైన వారిలా వున్నారు. ఆ పిస్టల్‌మీద వేలి ముద్రలు పడకుండా చాలా జాగ్రత్తపడుంటారేమో! ఒకవేళ ఆ పిస్టల్‌మీద ఏ వేలిముద్రయినా కనిపిస్తే, అది నాదే అయివుంటుంది," అన్నాడు డాక్టర్ గోపాలరావు.

"ఈ కర్ర ఇక్కడెందుకు పడుందో నాకేమీ పాలుపోవడంలేదు." అన్నాడు సింహాద్రి.

"ఒకవేళ మనల్ని తికమకలు పెట్టడానికే ఆ కర్రను హత్య చేసినవారు అక్కడ వదిలేసి ఉంటారేమో?" అన్నాడు డాక్టర్ గోపాలరావు.

ఇలా వాళ్ళిద్దరూ తన వెనుక నిలుచొని మెల్లగా

మాట్లాడుకోవడం విని, దీక్షిత్ తనలో తాను నవ్వుకుంటూ, పైప్ వెలిగించాడు.

"ఇది హత్యే అని మనకు సూటిగా తెలిసిపోతూందండి. పిస్టల్ గుండు ఎడమచెవి వెనుకనించి తలలోకి దూరింది. అందుచేత ఆయన ఆత్మహత్య చేసుకోవడం అసంభవం. ఆయన కుడిచేతిని మెలికలు తిప్పి, వెనుకవైపునించి ఆ విధంగా పిస్టల్‌తో కాల్చుకోవడం సహజంగా లేదు." అన్నాడు డాక్టర్ గోపాలరావు.

దీక్షిత్ మెల్లగా వెనుతిరిగి, డాక్టర్ గోపాలరావు వైపు చూశాడు. "ఆయన మరణించి ఎంతకాలం అయివుంటుందంటారు?"

"దాదాపు పన్నెండు గంటలు అయ్యిందొచ్చని ఇప్పట్లో చెప్పగలనండి. శవపరీక్షానంతరం ఇదమిద్ధంగా చెప్పగలను."

దీక్షిత్ కనుబొమలు ముడిచి, దీర్ఘంగా ఆలోచించసాగాడు. కాస్సేపయ్యాక శవం పక్కకువచ్చి, మోకాళ్ళమీద కూర్చున్నాడు. శవానికున్న జుబ్బా, పైజామా జేబులను వెతకసాగాడు.

పైజామా ఎడమవైపు జేబులో ఒక ఫిలిప్‌మారిస్ సిగరెట్ పాకెట్, సిగార్‌లైటర్, అశోకా వక్కపొడి పొట్లాలు రెండు, ఏవో మందుల ప్రిస్క్రిప్షన్, జేబురుమాలు వున్నాయి.

జుబ్బా ఎడమ జేబులో బీగాలగుత్తి, చిన్న టార్చిలైటు, ఒక దువ్వెన, థర్మామీటర్, ఒక బ్రూక్‌లాక్స్‌బిళ్ళ వున్నాయి. దీక్షిత్ ప్రతివస్తువునూ కంటికి దగ్గరగా ఉంచుకొని, ఒక్కొక్కటిగా పరిశీలించాడు.

నేలమీద అక్కడక్కడ కాల్చిపారేసిన కొన్ని సిగరెట్

పీకలు పడున్నాయి. దీక్షిత్ వాటికేసి దృష్టి మరల్చగా—"అవన్నీ ఫిలిప్‌మారీస్ సిగరెట్ పీకలేనండి." అన్నాడు డాక్టర్ గోపాలరావు.

హఠాత్తుగా శవం కుడిచేతిపక్కనే పడున్న ఒక వస్తువుకేసి దీక్షిత్ కళ్ళు తిరిగాయి. అదొక పెద్ద కోటు బొత్తాం. నల్లగావుంది. దీక్షిత్ కాస్త ముందుకువంగి, ఆ బొత్తాన్ని అందుకున్నాడు. వెంటనే "దాసీదాన్ని పిలవండి," అన్నాడు సింహాద్రితో.

మరో నిమిషంలో దాసీది తడబడే అడుగులతో ఆ గదిలోకి వచ్చింది. దీక్షిత్ తన చేతిలోవున్న బొత్తాన్ని దాసీదానికి చూపించాడు. "మీ అయ్యగారి కోటులకు ఇలాటి బొత్తాములు వున్నాయేమో నీకు తెలుసా?"

దాసీది కాస్సేపు ఆలోచించి, జవాబిచ్చింది "లేదు. బాబూ! అయ్యగారికి నలుపు రంగంటే యిష్టంలేదు."

దీక్షిత్ సూటిగా ఆ దాసీదాని కళ్ళల్లోకి చూశాడు. "నువ్వు మీ అయ్యగారివద్ద యెంతకాలంగా పనిచేస్తున్నావ్?"

"బాబుగారు పదేళ్ళవయస్సులో వున్నప్పుడు ఆయన తండ్రిగారు నాకు పని యిప్పించాడు. అప్పట్నించీ వాళ్ళింట్లోనే పనిచేస్తున్నాను. బాబూ!"

"మీ అయ్యగార్కి శత్రువులు యెవరైనా వున్నారేమో నీకు తెలుసా?"

దాసీది వెంటనే జవాబిచ్చింది: "బాబుగారికి శత్రువులుంటారంటే నేను నమ్మనండి. ఆయన అనవసరంగా ఒకరితో తగువులాడేవారుకాదు కాని....కాని" అంటూ ఆగింది.

"కాని....? ఆగిపోయావేం? ఊఁ—చెప్పు. ఫరవా లేదు," అన్నాడు దీక్షిత్ కాస్త బిగ్గరగా.

దాసీది తలవంచుకొని, తగ్గు స్వరంతో అంది: "మొన్న అనకాపల్లినించి ఆంజనేయులుగారు వచ్చారు. ఆయన ఎందుకు వచ్చారో ఏమోకాని, ఆయన వచ్చినప్పట్నించి బాబుగారు చాలా మారిపోయారు. ఎప్పుడూ అదోలా వుండేవారు. ఆయన రాక బాబుగారికి అసలే యిష్టంలేదు. అనకాపల్లిలో వుంటూన్నప్పుడూ ఆంజనేయులుగారు అప్పుడప్పుడు వచ్చి బాబుగార్ని కలుసుకుంటూండేవారు. ఆంజనేయులుగారికి అనకాపల్లిలో ఒక సోడాకొట్టుంది. ఆయన జూదరి, తాగుబోతు, అలగాజనంతో తిరుగుతూండేవారు. ఆయనంటే అనకాపల్లిలో యెవరికీ యిష్టం లేదు."

"అయితే, ఆంజనేయులుగారు ఇప్పుడిక్కడికి ఎందుకు వచ్చారో నీకు తెలీదన్నమాట?"

"తెలీదు, బాబూ! కాని, ఒక్క విషయం మాత్రం చెప్పగలనండి. నిన్న సాయంత్రం నేను టీ తీసుకొని ఈ గదిలోకి వచ్చేసరికి బాబుగారు, ఆంజనేయులుగారిమీద యెందుకో పెద్దగా కేకలేస్తున్నారండి. నన్ను చూడగానే ఆగిపోయారు."

"ఓహో! అలాగా?....సరే, ఆ పిస్టల్‌ను చూడు. అది మీ అయ్యగారిదేనా?"

"అటువంటి తుపాకీ బాబుగారివద్ద ఒకటున్నట్లు నాకు జ్ఞాపకమండి. ఆయన దాన్ని ఎక్కడో భద్రంగా దాచి వుంచేవారనుకుంటాను. నేనెప్పుడో ఈ ఊరొచ్చిన కొత్తలో దాన్ని చూశానండి. అంతేకాని, యిది బాబుగారిదో—కాదో నే చెప్పలేనండి."

"నువ్వు వుండడం ఎక్కడ?"

"ఇక్కడ పెరట్లో పాకలో వుంటున్నాను, బాబూ!"

"నిన్న రాత్రి నీకు పిస్టల్ ప్రేలిన ధ్వని యేదైనా వినిపించిందా?"

"లేదు బాబు! నేను పాకకు వెళ్ళిన కాస్సేపటికి నిద్ర పోయాను."

"మీ అయ్యగారు రాత్రిళ్ళు ఈ గది కిటికీ తలుపులన్నీ మూసి ఉంచేవారా?"

"లేదండీ. తెరిచి వుంచేవారనుకుంటా. పైగా, వేసవి కాలమాయె."

"సరే.... నువ్వెళ్ళు."

దాసీది వెళ్ళిపోగానే డాక్టర్ గోపాలరావు అన్నాడు: "నా అనుమానమంతా ఆ ఆంజనేయులు మీదేనండి. రాత్రి వీధితలుపూ, పెరటితలుపూ మూసివున్నాయి గనుక ఇంట్లోకి ఎవరూ ప్రవేశించడానికి వీల్లేదు. ఈ దాసీది నిరపరాధి యని తేలికగా చెప్పొచ్చు. ఒకవేళ పరమానందంగార్ని ఈవిడ ఎందుకైనా హత్య చేయాలంటే—ఇంతకాలం వేచివుండాలా? అయినా, ఆయన్ని చంపవలసిన అవసరం ఈ దాసీదానికేముంది లెండి."

"ఉండండి. నే వెళ్ళి ఆ ఆంజనేయులి పెట్టెబేడా సోదా చేసి వస్తాను. అతని వద్దున్న కోటులో దేనికైనా నల్లటి బొత్తాములు వుంటాయేమో!" అంటూనే సింహాద్రి వడి వడిగా గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు.

ఐదు నిమిషాలయ్యాక హడావిడిగా ఆంజనేయులి చేతిని పట్టుకొని, ఆ గదిలోకి బరబరా లాక్కొస్తూ, "హంతకుడు దొరికిపోయాడు. సార్! ఈ నల్లకోటు చూడండి. దీనికి ఒక బొత్తాం లేదు. పైగా మనకు దొరికిన

ఆ బొత్తాం, ఈ కోటుకున్న మిగతా బొత్తాములూ ఒకేలా గున్నాయి" అంటూ తను తెచ్చిన కోటును దీక్షిత్‌కు అందించాడు.

దీక్షిత్ గంభీరంగా అంగలు వేస్తూ. ఆంజనేయులు ముందుకువచ్చి నిలుచున్నాడు. తన చేతిలో వున్న బటన్‌ను చూపిస్తూ, "ఈ బటన్ మీ కోటుదే కదూ?" అడిగాడు.

"కావచ్చు," నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు ఆంజనేయులు.

"నిన్న రాత్రి మీరు ఈ కోటు తొడుకున్నారా?"

"లేదు; ట్రెయిన్‌లో వచ్చేటప్పుడు మాత్రమే తొడుకున్నాను."

"మరి ఈ బటన్ ఈ గదిలో ఎందుకు పడుంది?"

"అదే నాకూ తెలీకుండా వుంది."

ఆంజనేయులు కళ్ళల్లోకి దీక్షిత్ మరమర చూశాడు. "మీరు నిన్న రాత్రి ఎన్ని గంటలకు పడుకున్నారు?" అని ప్రశ్నించాడు.

"తొమ్మిదిన్నర అయ్యాక అనుకుంటూ."

"పరమానందంగారు ఎన్ని గంటలకు పడుకున్నారో మీకు తెలుసా?"

"తెలీదు. దాసీది వెళ్ళిపోయాక—ఆయన వీధి తలుపుకు, పెరటి తలుపుకు గొళ్ళెం పెట్టివచ్చి, ఈ గదిలోకి వెళ్ళారు. అటుపైన ఈ గది తలుపుకు కూడా గొళ్ళెంపెట్టి పడుకున్నారు. నా కంతే తెలుసండి. నేను హాలుకు అటువైపున వున్న గదిలో పడుకున్నాను."

"నిన్నరాత్రి ఎప్పుడైనా ఆయన గది తలుపు తెరుచుకుని, బయటకు వచ్చారా?"

"తెలీదు. నేను నిద్రపోతుండగా—నాకు తేలుకుట్టినా ఏమీ తెలీదు."

"అసలింతకీ మీరు మద్రాస్ రావడానికి కారణం?"

"చెప్తాను...పరమానందంగారితో ఓ విషయం గురించి మాట్లాడటానికి వచ్చాను. పరిస్థితులు ఇంతవరకు వచ్చాక-ఆ విషయ మేమిటో దాస్తే నేనే చిక్కులపాలవుతానేమో. అంచేత అంతా చెప్తాను."

ఆంజనేయులు ఒక్క నిమిషం ఆగి, తర్వాత యిలా చెప్పసాగాడు:

"పరమానందంగారు వున్నట్టుండి అకస్మాత్తుగా ఇంత ఉచ్ఛస్థితికి ఎలా వచ్చారో నాకు తప్ప మరెవ్వరికీ తెలీదు. ఆయన అదృష్టం బావుండబట్టి, ఆ విషయం గురించి యెవ్వరూ కించిత్తయినా అనుమానించలేదు కూడా....

దాదాపు యెనిమిది సంవత్సరాల క్రితం—ఓ నాటి సాయంత్రం పరమానందంగారు ఆవును కట్టెయ్యడానికి దొడ్డిగోడకు వెనుక భాగాన నేలకు ఒక గునపాన్ని కొడుతూంటే, ఖంగున ఏదో శబ్దం వినిపించిందట. వెంటనే పరుగున ఆయన మా ఇంటికి వచ్చి ఆ విషయాన్ని చెప్పారు. అదేమిటో ఆ రాత్రే చూద్దామనుకున్నాం.

నేనూ, పరమానందంగారూ అర్ధరాత్రి రహస్యంగా ఆ ప్రదేశమంతా త్రవ్వాం. కొన్నడుగుల లోతున మూడు లంకెబిందెలు కనిపించాయి. ఆ బిందెల్లో చాలా బంగారు కడ్డీలు వున్నాయి. ఆ విషయం గురించి ప్రభుత్వానికి వెంటనే తెలియజేయడం మన కర్తవ్యమన్నాను. లేకపోకే పెద్ద నేరమౌతుందని హెచ్చరించాను కూడా.

కాని, పరమానందంగారు పెడచెవిని పెట్టారు. నన్ను

తొందరపడి ఆ లంకెబిందెల విషయాన్ని ఎవరికీ తెలియజేయ వద్దన్నారు. ఆ రోజు నాకు రెండువేలు యినాంగా యిస్తూ, ఎప్పుడైనా నాకు డబ్బు అవసరంవస్తే తనవద్దకు రమ్మని ఆశపెట్టారు.

అప్పట్నించి రెండు మూడుసార్లు డబ్బు కావాల్సి వచ్చి నప్పుడెల్లా పరమానందంగారింటికి వెళ్లేవాడ్ని. ఆయన లేదనకుండా కాస్తో కూస్తో ఇచ్చి పంపేవారు. తర్వాత కొంతకాలానికే ఆయన మద్రాసుకు మకాం మార్చేశారు. యిక్కడికీ మరో రెండుసార్లు ఉత్తరాలు రాసి, కొంత డబ్బు తెప్పించుకున్నాను.''

ఆంజనేయులు కొన్ని క్షణాలాగి, మళ్ళా చెప్పసాగా డిలా :

''ఇప్పుడు అనకాపల్లిలో ఒకరు ఐస్ ఫ్యాక్టరీని అమ్మ బోతున్నారు. ఆ ఫ్యాక్టరీని కొనాలని ఆశపడ్డాను. అందుకని వెంటనే యాభై వేలు పంపవలసిందని పరమానందంగారికి లేఖ రాశాను. పదిరోజులైనా జవాబు రాకపోవడంతో నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ కూడా ఇచ్చాను. దానికీ జవాబులేదు.

అటుపైన స్వయంగా వెళ్ళి అడిగితే ఆయనా ఇవ్వ కుండా ఉంటాడా అనుకుంటూ, మొన్న బయలుదేరి యిక్కడికి వచ్చాను. పరమానందంగారిని అడిగాను. వచ్చే లాభంలో సగభాగం కూడా ఇస్తానన్నాను. పోనీ, అప్పుగా అయినా ఇవ్వమన్నాను చివరికి. ఆయన ససేమిరా ఒక్క చిల్లిగవ్వ కూడా ఇవ్వనన్నారు.

ఆఖరికి లంకెబిందెల రహస్యాన్ని పోలీసువారికి చెప్పే స్తానని బెదిరించాను. పరమానందంగారి తల తిరిగిపో

యింది. 'నేను బికారి అయ్యేవరకు నన్నిలా పదే పదే బాధించి, నా దగ్గర్నుంచి వేలకు వేలు గుంజుతూనే ఉంటావు కదూ? నీ దగ్గర ఆ రహస్యం దాగి వున్నంతవరకు నన్నిలా వేధిస్తూనే వుంటావు. నీ చేతనైంది చేసుకో!' అని నిన్న సాయంత్రమే పరమానందంగారు నాతో అన్నారండి.

అంతే .. ఆయనిలా ఆత్మహత్య చేసుకుంటారని నేను కలలో కూడా అనుకోలేదు. నాకే మాత్రమైనా తోచివుంటే ఆయన ప్రయత్నానికి అడ్డుతగిలి వుండేవాడ్ని ..." ఆంజనేయులు ఈ మాటలు ఏమాత్రం తొణకకుండా, బెణకకుండా చెప్పాడు.

3

దీక్షిత్ క్షణకాలం కళ్ళు మూసుకున్నాడు. మళ్ళీ తెరిచాడు. "సరే-మీరు వెళ్ళి హాల్లో వుండండి. మళ్ళీ మీతో కాస్త పనుంటుంది. ఎందుకైనా భయపడి పారిపోడానికి ప్రయత్నించేరు సుమా-బయట మా కానిస్టేబుల్సు వున్నారు," అన్నాడు.

"నాకేం భయం?" అని గొణుక్కొంటూ ఆంజనేయులు వెళ్ళిపొయ్యాడు.

"ఆ దాసీదాన్ని రమ్మనండి."

సింహాద్రి వెళ్ళి. దాసీదాన్ని తీసుకువచ్చాడు.

"నిజం చెప్పు—అనాకాపల్లిలో మీ అయ్యగారికి దొరికిన లంకెబిందెల గురించి నీకు తెలుసా, తెలీదా?" దీక్షిత్ కంఠం ఆ గదిలో ప్రతిధ్వనించింది.

దాసీదాని కనురెప్పలు భయంతో రెపరెప కొట్టుకున్నాయి. కాస్సేపాగి, "తెలుసు, బాబూ!" అని మూల్గింది.

"మరి ఆంజనేయులు ఈ ఊరికి ఎందుకొచ్చాడో నీకు

తెలీదని ఇందాక నాతో ఎందుకు అబద్ధమాడావ్?"

దాసీది జవాబియ్యలేక తల వాంచుకొంది. చేతులతో ముఖాన్ని కప్పుకోబోయింది. అప్రయత్నంగా దాసీదాని కుడి బొటనవేలి మీదున్న ఒక చిన్నగాయం దీక్షిత్ కళ్ళకు కనిపించింది.

"ఏమిటా గాయం?"

"నిన్న కూరలు తరుగుతూంటే గాయమయింది." హీన స్వరంతో దాసీది అన్నది.

"కూరలు తరుగుతూంటే గాయమై, ఇంత సన్నగీత ఏర్పడుతుందా? కూరలు దేనితో తరిగావు?"

దాసీది జవాబియ్యలేకపోయింది.

"నువ్వు చెప్పక్కర్లేదు. నాకు తెలుసు నే చెప్తావిను." అంటూ దీక్షిత్ ఇలా చెప్పసాగాడు :

"ఉదయం నువ్వు ఈ గదిముందు నిలుచొని, కొంత సేపు తలుపుతట్టావు. లోపల ఏ అలికిడీ లేకపోవడంతో మీ అయ్యగారికి ఏమయిందోనని భయపడి, దక్షిణంవైపు పున్న ఈ కిటికీవద్దకు వచ్చావు. ఆత్మహత్య చేసుకునేముందు మీ అయ్యగారు గది తలుపూ, కిటికీ తలుపులూ అన్నీ బంధించారు. కాని, ఈ కిటికీ తలుపుకు మాత్రం కొక్కెం లేదు. అంచేత నువ్వు ఈ కిటికీ తలుపుగుండా మీ అయ్యగారు లోపల నిర్జీవంగా పడివుండటం చూశావు. ఈ గది తలుపు లోపలవైపు గొళ్ళెంపెట్టి ఉండటం కూడా గమనించావు. దాంతో మీ అయ్యగారు ఆత్మహత్య చేసుకున్నారని నీకు దృఢంగా తెలిసిపోయింది. ఆంజనేయులి బాధ పడలేకో, జీవితంమీద విరక్తి పుట్టో - మొత్తంమీద ఏ కారణం మూలంగానో ఆయన ఆత్మహత్య చేసుకున్నారని నువ్వు

ఏదో ఊహించావు.

నువ్వు మీ అయ్యగారివద్ద చాలాకాలంగా పనిచేస్తున్నావు. మీ అయ్యగారికి నువ్వంటే చాలా ఇష్టం. ఆయన చిన్నవయస్సులో ఉన్నప్పటినించీ నువ్వు పనిచేస్తున్నావు. గనుక నీకు కూడా ఆయనంటే ఎంతో వాత్సల్యము. అంచేత మీ అయ్యగారు ఆత్మహత్య చేసుకోడానికి ప్రేరేపించినవారెవరో నీకు తెలుసు. ఆ వ్యక్తిమీద కసి తీర్చుకోవాలనుకున్నావు. అందుకోసం ఆ వ్యక్తికి ఈ మరణంతో సంబంధం కల్పించావు.

అది ఆత్మహత్య కాదని, మీ అయ్యగారు హత్య చేయబడ్డారనీ నిరూపించడానికి నువ్వు చాలా తెలివైన పనులు చేశావు. ఆంజనేయులుగారు ఆ సమయంలో స్నానాల గదిలో వుండడం నీకు అన్నివిధాల అనుకూలమైంది.... గబగబా వెళ్ళి, మీ ఇంట్లోనే వున్న ఒక పొడుగాటి కర్రను తీసుకు వచ్చావు. దాన్ని కిటికీగుండా దూర్చి, గొళ్ళాన్ని యెలాగో తీసేశావు.

అటుపైన మీ అయ్యగారి ఎడమచేతిలోనో, లేక ఆ చేతిపక్కనో పడున్న పిస్టల్ని ఆ కర్రతో దూరంగా తోసేశావు. అందుమూలంగా అది ఆత్మహత్య కాదని తేలికగా తెలిసిపోతుందని అభిప్రాయపడ్డావు. తర్వాత వెంటనే ఆంజనేయులు బసచేసివున్న గదిలోకి వెళ్ళి అక్కడున్న ఒక పెట్టెను తెరిచావు. అందులోంచి ఏదో కోటును బయటకు తీశావు. కోటుకున్న ఒక బటన్‌ను బ్లేడుతో కోసి, లాగేశావు.

ఆ సమయంలోనే పొరబాటున నీ కుడి బొటనవేలికి బ్లేడు తగిలి, కొద్దిగా రక్తం వచ్చింది. ఆ బటన్ వీడిపోయినచోట తెగిన దారాలకు అక్కడక్కడ నెత్తురుమరక

లున్నాయి. ఆ రక్తాన్ని పరీక్షిస్తే నీ రక్తమే అని రుజువు చేయవచ్చు పైగా. ఆ బటన్‌కు కట్టిన దారాలు తెగిన విధానాన్ని పరిశీలిస్తే, బ్లేడుతో నలువైపులా సమంగా కోసినట్లు బాగా తెలుస్తూనే వుంది.

తర్వాత వెంటనే నువ్వా కోటుబటన్‌ను తీసుకెళ్ళి, కిటికీగుండా లోపల పడేశావు. ఆ కర్రతో బటన్ పరమానందంగారి కుడిచేయి పక్కనే వుండేట్లు తోశావు. అందు మూలంగా ఆంజనేయుల్ని వెంటనే అనుమానించడానికి వీలవుతుందని నీ వుద్దేశ్యం....

కాని. నువ్వు చాలా పొరబాట్లు చేశావు. వాటి మూలంగానే ఆంజనేయులు నిరపరాధియని మొదట్లోనే తెలిసిపోయింది.

పార్శ్వ్య వాయువుకల్ల మీ అయ్యగారికి కుడివైపు భాగమంతా పడిపోయింది. ఆ విషయం నీకు బాగా తెలుసు. కాని, మీ అయ్యగారు బోర్లగిల పడుకున్నాడు. ఆయన మామూలుగా వెల్లకిలా పడున్నప్పుడు ఆయనకు కావలసిన వస్తువేదైనా ఆయనకు ఎడమవైపున నువ్వు వుంచేదానివి. ఆ అలవాటుకొద్దీ లేక హడావిడిలో ఆ విషయం గమనించలేకనో నువ్వు ఆయన కుడిచేతి దగ్గరగా ఆ బటన్‌ను తోశావు. కనీసం. అంతకుముందు ఆ పిస్టల్ ఏ చేతి దగ్గర పడుందో అన్న విషయమైనా గుర్తుకు తెచ్చుకొని వుంటే, ఈ పొరబాటు చేసివుండేదానివి కావు. అంచేత, ఇది మొదటి తప్పు.

రెండోది ఆ కర్ర ఇక్కడే పడుండడం. గది తలుపులు తెరుచుకొని బయటకు వచ్చిన హంతకు లెవరో ఆ కర్రను కిటికీగుండా గది తలుపుకు లోపలివైపున్న గొళ్ళాన్ని

వేయడానికి ప్రయత్నించారని తెలియడంకోసమే ఆ కర్రను ఈ గదిలోనే పడేశావు కాని అటువంటి పని యేదైనా చెయ్యడానికి హంతకు లెవరైనా ప్రయత్నిస్తే, ఆ కర్రను ఆ గదిలోనే వుంచరు. తమను పట్టుకోడానికి ఆ కర్ర యే విధంగానైనా వుపయోగపడుతుందేమో అన్న భయంతో ఆ కర్రను తీసుకెళ్ళి ఎక్కడయినా పారేస్తారు....

ఊఁ....ఇక నిజం ఒప్పుకో....మీ అయ్యగారి మరణానికి ఒకవిధంగా కారకుడయిన అంజనేయుల్ని మేం అనుమానించడానికే కదూ నువ్వింత పనిచేశావ్?"

దాసీదాని కళ్ళలో నీళ్ళు నిండాయి. కాస్సేపు మౌనం వహించి, తర్వాత గాద్గదిక కంఠంతో యిలా అంది:

"బాబుగారు చిన్నప్పట్నించీ నా చేతులమీద పెరిగారు. వారు కష్టాల్లో వున్నప్పుడూ, బాగుపడ్డప్పుడూ కూడా నన్ను పనిలోంచి తీసివేయలేదు. చివరికి నన్ను మద్రాసుకు కూడా తీసుకువచ్చారు. ఇంతకాలం వారి ఉప్పు తిన్నాను.

పైగా, వారంరోజుల క్రితం పక్షవాతంతో మంచం పట్టగానే బాబుగారు తానిక ఎంతోకాలం బ్రతకనను కున్నారు. ప్లీడరుగారిని పిలిపించి వీలునామా రాయించారు. ఆయన ఆస్తిలో నాలుగోవంతు నాకు, తతిమ్మా భాగాన్ని యేదో ధర్మసంస్థ పేర వినియోగించాలనీ రాయించారు. బాబుగారి మీదున్న మమత కొద్దీ యేం చేస్తున్నానో తెలీక ఈ పిచ్చిపని చేశాను. తప్పు చేశాను. నన్ను క్షమించండి" అంటూ దీక్షిత్ పాదాల మీద వాలిపోయింది.

[ఇరవై యేళ్ళనాటి 'అపన' కథ] □

అమాయక చక్రవర్తి

ఎమ్.వి.వి.సత్యనారాయణ



కథ రాయాలని కూర్చున్నాను.

ఏ నేరం గురించి రాయాలి? ప్రేమ హత్యలా? బాంకి దోపిడులా? వారసత్వం ఆస్తికోసం హత్యలా? హైవేమీద జరిగే దోపిడియా? జమీందారీ భవనాలలో జరిగే రహస్య

హత్యలా? రాజకీయ హత్యలా?

ఆలోచిస్తున్నాను. రాష్ట్రప్రభుత్వోద్యోగిగా పనిచేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాను. రచనలు చేయడం హాబీ! తప్పితే నాకు హాయిగా కాలుమీద కాలు వేసుకుని తినే ఏర్పాటువుంది. రెండంతస్తుల బంగాళాలో అపురూప మైన సామగ్రి సమకూర్చుకున్నాను. పత్రికాఫీసులకు ఎప్పు డయినా వెళ్ళవలసివస్తే రోల్స్‌రాయిస్ కారుంది. నాకు సేవచేయడానికి యిద్దరు పనిమనుషులూ, ఒక తోటమాలీ వున్నారు.

తెలుగు రచయితలలో నాకులాగా బాగా డబ్బున్న రచ యిత వుండడు. ఆ విషయం కోర్ట్ ఫీజు స్టాంపుమీద రాసి యివ్వగలను.

నా ఆలోచనలు భగ్నమయాయి. టెలిఫోన్ మృదు మధురంగా గీ పెడుతోంది. చటుక్కున చెయ్యిచాపి నగి షీల టెలిఫోన్ అందుకున్నాను.

"హలో ...." అన్నాను.

"క్రాంతీ!" అంది అందమైన గొంతు—కాస్త గాభరాగా.

"క్రాంతా? క్రాంతెవరు?"

"మీరు క్రాంతి కాదా? మీ ఫోన్ నెంబరెంత?"

"53?118."

"ఓహ్ సారీ! 531218 కి చేయబోయి...."

"ఫరవాలేదు లెండి!"

"అయ్యయ్యో! ఎలా! టైమయిపోతోంది!"

"టైమా? ఎందుకు?"

"వాళ్ళు వచ్చేస్తారు నన్ను లోబరచుకుని వెళ్ళి పోతారు!"

"మీరెవరు? వాళ్ళెవరు? మీ రెందుకు గాభరాపడు తున్నారు?"

"హయ్యొయ్యో! ఎలా? మీ కెలా చెప్పగలను? వాళ్ళ నా బతుకు పాడుచేసేస్తారు! క్రాంతి అయితే ఈ సమ యంలో హీరోలాగా... పోరాడి...."

"నువు ఎక్కడినుండి ఫోన్ చేస్తున్నావ్?"

"91, స్ప్రింగ్‌రోడ్, యాపిల్....యాపిల్ అని అడగాలి!"

ఇంటరెస్టింగ్‌గా వుంది. కోడ్ మాటలలోకూడా ఆమె సంభాషిస్తోంది. ఆమెకు వచ్చిన కష్టం ఏమిటి? క్రాంతి ఎవరు? ఆమెకోసం వచ్చేవాళ్ళెవరు?

"ఆల్‌రైట్! నేనే వస్తున్నాను!"

"థాంక్యూ! నన్ను హత్యకేసునుండి వుద్ధరించండి. ప్లీజ్!"

నాకు యవ్వనం తిరిగి వచ్చినట్టయింది. తలమీద పండి పోయిన వెంట్రుకలూ, చల్లారిపోయిన రక్తాన్ని తమతో మోసుకుపోతోన్న నరాలూ అల్లల్లాడి పోగొట్టుకున్న శక్తిని తిరిగి పొందినట్టయాయి. ఒంటిమీద పెళుసుకట్టిన చర్మం తిరిగి నిగనిగలాడి తేజస్సు తెచ్చుకుంది.

హత్యకేసు! అబల! హత్యచేసినవాళ్ళే ఆమెమీద కేసు బనాయించి యిప్పుడు ఆమెను కూడా లోబరచుకోబోతు న్నారు. అన్యాయం! ఒక బాధ్యతగల పౌరుడిగా నేను ఈ దారుణాన్ని ఎదుర్కోవాలి.

అవతలప్రక్క క్లిక్‌మంది. నేను రిసీవర్‌ను రెస్ట్‌మీద వుంచి బయటికి కదిలాను. వెళ్తూ వెళ్తూ జేబులో పిస్తోలు వేసుకోవడం మరచిపోలేదు. రోల్స్‌రాయిస్ కారును హైవేమీద వేగంగా తోలుతున్నాను. నా మనసు యాపిల్

లాంటి అమ్మాయిని చూడాలని తహతహలాడుతోంది.

గొంతునుబట్టి ఆమె యాపిల్‌లాగా వుంటుందో, ఆన పకాయిలాగా వుంటుందో-ఏమో....ఫోన్‌లో గొంతువిని ఆకారం వూహించుకోలేం.

కారును స్ప్రింగ్ రోడ్లో పోనిస్తున్నాను. యిళ్ళ నెంబర్లు చూస్తున్నాను. 91 వ ఫ్లాట్‌ముందు ఆపాను రోల్స్‌రాయిస్‌ను. రోడ్డువారగా కారు పార్క్ చేసి ఫ్లాట్ లోకి నడిచాను. భవనం వెనక్కి వుంది. ముందు భాగంలో ఫాన్సీషాపు వుంది. షాపులో ముసలావిడ వుంది.

"ఏం కావాల బాబూ?" అడిగింది ముసలిది.

తడబడ్డాను. భవనంలోకి వెళ్ళడానికి దారి ఎటువుంది? ముసలావిడను ఆ సంగతి అడిగితే ఏం బావుంటుంది? డిటెక్టివ్ రచనలు చేసేవాడిని ఆమాత్రం వూహించుకో లేనా? ఆమెను బేరంలోకి దింపి పరిసరాలు పరిశీలించాలి! ఈలోపులో ఆ దుండగు డెవడో వచ్చేసి యాపిల్‌ను లోబరచుకుంటే....అయినా వాడు కూడా యీ దారినే రావాలి కదా!

"సెంటు సీసాలున్నాయా?" అడిగాను.

"వున్నాయి బాబూ!" ఆమె వెనక్కి తిరిగి పాకెట్ బయటపెట్టింది. ఒక్కో సీసాను బయటికి తీస్తోంది. నాలుగు రకాల సెంటుసీసా లున్నాయి. రకాని కొకటి చొప్పున పాక్‌చేసి, "ఇవి చాలా బాబూ!" అంది ముసలిది.

ఘటికురాలు! నా నోట్లోంచి యింకా మాట రాకుండానే నాలుగు సీసాలూ నా కంటగట్టింది. చకచక బిల్లురాపి తర్వాతి అయిటమ్ రాయడంకోసమన్నట్టు తలెత్తి ప్రశ్నా ర్థకంగా చూస్తోంది.

జేబులోంచి వందరూపాయల నోటుతీసి అందించాను.

మెల్లగా అన్నాను. "యా ...పి....ల్...."

ఆమె నిదానంగా చూచింది "ఆమాట యిందాకనే చెప్పవలసింది బాబూ!" అని వందరూపాయల నోటు క్యాష్‌బాక్సులో వేసుకుంది. తర్వాత బీరువాలాగా వున్న ప్రాంతం ప్రక్కకు తప్పించింది. లోపలకు దారి ఏర్పడింది.

నేను సందేహించలేదు. ఆ దారిలోంచి నడిచివెళ్ళి భవనంలో ప్రవేశించాను. కింద గదులలో అలికిడిలేదు. మెయిన్‌హాలు మధ్యలో నిలబడి చెవులు రిక్కించాను. పై గదిలో ఎవరో పిలిచారు. మెట్లెక్కాను.

గుమ్మంవద్ద ఆమె ఎదురుచూస్తోంది. నన్నగా పొడవుగా బంగారు తీగలాగావుంది. లేతనీలం జార్జెట్ చీర కట్టింది. మాచింగ్ బ్లవుజ్‌మీద తెల్లటి క్రిస్టల్స్ దండ వేలాడుతోంది. చెవులకు జూకాలు వ్రేలాడుతున్నాయి. ఆమె పెదవులు తడిగా ఎర్రగా మెరుస్తోన్నాయి.

"యా....పి ...ల్...." అన్నాను.

"థాంక్యూ! మీరే వచ్చారు. కృతజ్ఞతలు యెలా చెప్పుకోవాలో తెలియడంలేదు. రండి!" ఆమె విలాసంగా చేతులు జోడించింది.

గదిలోకి నడిచాను యిద్దరమూ ఆసనాలవైపు నడిచాం. ఎదురెదురుగా కూర్చున్నాం. టీపాయ్‌మీద కాఫీపాట్ పొగలు కక్కుతోంది. ఆమె కాఫీని కప్పులలో పోసి నాజూకుగా అందించింది.

సిప్ చేస్తున్నాను.

"నేను ఒక హత్య కేసులో యిరుక్కున్నాను. వనజ అనే రంగస్థల నటిని చంపానని నామీద అభియోగం. నిజా

నికి ఆమె నాకు తెలియదు. ఆమె హత్య జరిగిన సమయంలో నేను ఆ ఊళ్లో లేను కూడా!'' అంది ఆమె.

"వనజ ఏ వూళ్లో చచ్చిపోయింది?"

"సాయిర్లకోటలో."

"ఎప్పుడు?"

"నిన్న రాత్రి. శవం దగ్గర ముత్యాలహారం దొరికిందట?"

"ఏ ముత్యాల హారం?"

"మీకు కథ మొత్తం చెప్పాలి!"

చెప్పమన్నట్టు తలూపాను. ఆమె కిటికీవద్ద నుండి స్ప్రింగ్ రోడ్డువైపు చూచింది. తర్వాత లోపలికి నడిచింది. నేను లేచి గదిలో అటూ యిటూ పచార్లు చేస్తున్నాను. మెట్లమీద చప్పుడయింది. గుమ్మంలోకి నడిచి నిలబడ్డాను.

"క్రయిమ్ బ్రాంచ్ వాళ్ళు!" ఆశ్చర్యపోయాను. ఇక్కడ వీళ్ళకేం పని?

డ్రెస్సునుబట్టి వూహించగలను. క్రయిమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టరూ, అతడి సార్జెంటూ గదిలోకి వచ్చారు. తప్పుకుని దారి యిచ్చాను.

పోలీసు అధికారులు నావైపు కొరకొరా చూశారు.

"మోహిని ఎక్కడ?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మోహిని! ఓ... ఈమె పేరు మోహిని అన్నమాట" అన్నాను పైకి. ఆమె మాత్రం ఇంత జరుగుతున్నా బయటికి రాలేదు.

"పాపం! మీకు ఆమె పేరే సరిగా తెలియదా?"

"తెలియదండి ఆమె నాకు రాంగ్‌కాల్ చేశారు. ఆప

దలో వున్నట్టు చెప్పారు. నేను ఆమె చిరునామా పట్టుకుని వచ్చాను ”

“రోల్స్‌రాయిస్ ఎక్కడ ఎత్తుకువచ్చారు?”

ఆయన కళ్ళలో తీవ్రతా, అపనమ్మకమూ, అధికార దర్పమూ—నిజం చెప్పొద్దూ ....నన్ను వణికించాయి. అనుమానంమీద లాకప్‌లో పెట్టిన మనిషి తెల్లవారేటప్పటికి చచ్చిపోతున్నాడయ్యో! ఆయన తరహా చూస్తే నన్ను లాకప్‌లో వుంచాలని చూస్తున్నట్టున్నాడు ఒక్కసారి సంఘంలో నాకున్న స్థాయిని గుర్తుకు తెచ్చుకున్నాను. ధైర్యం వచ్చింది. పూచీకత్తుమీద క్షణాలలో బయటికి రాగలను. కాని పరువు సంగతేమిటి?

“ఎత్తుకురావడం ఏమిటి సార్! ఆ కారు నాదే! కావాలంటే లైసెన్సు పుస్తకం చూపిస్తాను సార్; నాపేరు....”

“క్రాంతీ!” ఆమె బయటికి వచ్చింది. పోలీసులను చూచి బిత్తరపోయింది “మీరా! యిలా వచ్చారేం?” అంది.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ విలాసంగా లాఠీతో కుడిచేతిలో కొట్టుకున్నాడు. “సారీ మాడం! ప్రాథమిక దర్యాప్తులో మీరు వనజను హత్య చేసినట్టు అనుమానించాం కాని మీ కంటే ముందు క్రాంతి అనే యువకుడు ఆమె గదిలో ప్రవేశించినట్టు మాకు రుజువయింది క్రాంతి గురించి మీ యింటికి వచ్చాం! ఇతడే క్రాంతి అని నేననుమానించాను. ఇప్పుడు మీరు ఇతడిని పేరుపెట్టి పిలిచాక నా అనుమానం నిజమయింది!” అన్నాడు.

నాకు మతిపోతోంది. నన్ను ఆమె క్రాంతీ అని పిలవడం ఏమిటి? హత్యకేసులో మొదట ఆమె ఇరుక్కోవడం ఏమిటి? తరువాత క్రాంతి అనేవాడు యిరుక్కోవడమేమిటి? అసలు ఆమె నన్ను యిక్కడకు రప్పించడంలో

వేరే ప్రయోజనం ఏమైనా వుందా?

"పద మిష్టర్! పోలీస్ స్టేషన్‌లో నిన్ను ప్రశ్నించాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఈసారి నిజంగానే వణికాను. నా పరువు గంగలో కలిసిపోతోంది. ఇక అంతా క్షణాలలో వుంది. పత్రికాముఖంగా నా పేరు చాలమంది పాఠకులకు తెలిసివుంటుంది. అది రచయితగా! ఇప్పుడు ఒక నేరస్తుడిగా! కనీసం అనుమానితుడిగా అందరికీ తెలుస్తుంది! ఎంత అవమానం!

మోహినివైపు చూశాను. ఆమె కళ్ళు నిర్మలంగా వున్నాయి. నన్ను పోలీసు అధికారుల దృష్టిలో 'క్రాంతి'గా ఎస్టాబ్లిష్ చేసింది ఈవిడే!

"నన్ను క్రాంతి అని పిలిచారు. నేను క్రాంతిని కాను: ఆ మాట వీళ్ళతో చెప్పండి. పోలీస్ స్టేషన్ వరకూ నేను వెళ్ళవలసిన అవసరమే రాదు" అన్నాను.

"ఆవిడ ప్రయత్నం అంతవరకే! మీరు క్రాంతో కాదో తేల్చుకోవలసింది మేము! పదండి! పోలీస్ స్టేషన్‌లో తేల్చుతాం!" నా మెడమీద లాఠీ ఆన్చాడు.

"మీరు క్రాంతి కాకపోతే మాతో రావడానికి భయం ఏమిటిసార్! పదండి! మా పని ఎంతకష్టమో తెలుసాసార్! కొండను తవ్వి ఎలుకను పట్టాలి!" అన్నాడు సార్జెంట్.

నేనే కాబోలు ఆ ఎలుకను! నిట్టూర్చాను. మోహిని నన్ను పిలిపించి అనుమానితుడిని చేసింది. ఇప్పుడు వీళ్ళు నేరస్తుడిని చేస్తారు. ఎలాంటి విపరీతమైన పరిస్థితిలో ఇరుక్కున్నాను. చేసేదేమీ లేక వెళ్ళడానికి సిద్ధపడాను.

పోలీస్‌జీపు ఎక్కించారు. ఫాన్సీ షాపులోని ముసిలిది మా మ గురివైపూ అనుమానంగా చూస్తోంది.

"రోల్స్‌రాయిస్‌లో వస్తాను!" అన్నాను.

"అది ఏ ప్రాంతంలో ఎత్తుకు వచ్చిందో తర్వాత తెలుస్తుంది! దాన్ని అక్కడే వుండనియ్యి మిస్టర్!" అన్నాడు యిన్స్పెక్టర్.

"ఆ కారు నాదే! కావలిస్తే మా యింటికి రండి! నన్ను గుర్తుపట్టండి! ఇలా పోలీస్ జీపులో పోలీస్ స్టేషన్‌కి వస్తే నా పరువు ఏంకావాలి? నన్నూ మా భవంతినీ చూడండి! నేనెవరినో నిర్ధారించుకోండి! ప్లీజ్! తర్వాత యింకా మీకు అవసరమని భావిస్తే పోలీస్ స్టేషన్‌కు వస్తాను!" అన్నాను.

ఇన్‌స్పెక్టరూ, సార్జెంటూ మొహాలు చూసుకున్నారు.

"అందుకు మా రూల్స్ ఒప్పుకోవు!" అన్నాడు యిన్స్పెక్టర్.

"సార్ సార్! ఒక్కసారి! పోనీ నా కారులో వద్దు. మీ జీపులోనే నన్ను మా యింటికి తీసుకువెళ్ళండి!"

పోలీస్ అధికారు లిద్దరూ ఒప్పుకున్నారు.

జీపులో మా భవనం చేరుకున్నాం. పోలీస్ అధికారుల వైపూ, నావైపూ విచిత్రంగా చూశాడు తోటమాలి.

"అయ్యగారూ! ఏమిటిది అయ్యగారూ!" దగ్గరకు వచ్చాడు తోటమాలి.

"మాలీ నా పేరేమిటో చెప్పు వీరికి!" అన్నాను.

"అదేమిటండి అయ్యగారూ! మీరు...." అంటూ నా పేరు చెప్పాడతడు.

"చూశారా సార్! నా పేరు క్రాంతి కాదు! తోటమాలి నా వద్ద పదిహేను సంవత్సరాల నుండి వుంటున్నాడు! లోపల పనివాళ్ళుంటారు. వాళ్ళవద్ద కూడా మీరు నా గుర్తింపు పొందవచ్చును."

వాళ్ళు తలలూపారు. నాకు ముచ్చట వేసింది. నా స్థానబలం అనుకుంటాను. నేను చెప్పిన విషయాలికల్లా వొప్పు

కుంటున్నారు. వాళ్ళను మేడమీద గదికి తీసుకువెళ్ళాను. టి.వి. లైసెన్సూ, డ్రయివింగ్ లైసెన్సూ చూపించాను. వాళ్ళు యింకా అసంతృప్తిగా చూస్తున్నారు. ఇక పోలీసు అధికారులను నమ్మించడం ఎలా? ఇన్ని అయిపోయాక కూడానా?

సార్జెంట్ యిన్‌స్పెక్టర్‌కి సైగచేశాడు.

"రండి. మనం అవతల గదిలో కూర్చుందాం! మా సార్జెంట్ వస్తువులు వెతికి యింకా మీ గుర్తింపు సంపాదిస్తాడు!" అన్నాడు యిన్‌స్పెక్టర్ సౌమ్యంగా. హాలులో సార్జెంట్‌ను విడిచిపెట్టి యిద్దరమూ లాంజ్‌లోకి నడిచాం.

సార్జెంట్ మా వెనక తలుపు మూసుకున్నాడు.

"అసలు హత్య ఏమిటిసార్? వనజ ఎవరు? ఆమెను చంపవలసిన అవసరం ఎవరికి వుంది? మీరు మోహినినీ క్రాంతి అనే వాడినీ ఎలా అనుమానించారు? హత్య ఎక్కడో సామర్లకోటలో జరిగితే యిక్కడ విశాఖపట్నంలో దర్యాప్తు జరగడం ఏమిటి?" అడిగాను. నాకు ధైర్యం వచ్చినట్టుంది. ఇన్‌స్పెక్టర్ నాకు కాస్త చనువయాడు.

ఆయన నవ్వి, "వనజ వృత్తిరీత్యా నాటక సంస్థలలో పనిచేస్తుంది. రంగస్థలంమీద బిజీగా వుండే నటీమణి. ఆమె మేనత్తది మన విశాఖపట్టణమే. మేనత్తకూ, మేనమామకూ పదేళ్ళక్రితం విడాకులు ఏర్పాటుచేసింది కోర్టు. విడిపోయే ముందు మేనమామకు సంబంధించిన ముత్యాలహారం మేనత్త దగ్గ వుండిపోయింది. ఆ విషయం ఆలస్యంగా గుర్తించాడు మేనమామ. తన ముత్యాలహారం తనకు పంపించమని మేనమామ వర్తమానం పంపించాడు.

తన యింట్లో దొంగలుపడ్డారనీ, ముత్యాలహారం వాళ్ళు ఎత్తుకుపోయిన వాటిలో వున్నట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు

చేసింది. క్రాంతి అనేవాడు వనజకోసం సామర్లకోట వెళ్ళేవాడు క్రాంతి ఆమెకు మరో మేనత్త కొడుకు. క్రాంతివద్ద ముత్యాలహారం ఎలా ప్రత్యక్షమయిందో తెలియదు. క్రాంతి ముత్యాలహారాన్ని వనజకు యిచ్చాడు."

నాకు యిదంతా గందరగోళంగా వుంది. ఒక సంఘటనకూ మరో సంఘటనకూ వున్న సంబంధం అర్థం కావడంలేదు. ఈ సంబంధంలో మోహిని ఏమిటి? తనేమిటి? మా యిద్దరి పాత్రలకూ అర్థం ఏమిటి? మోహిని నన్ను పిలిపించి ట్రాప్ చేయడం ఏమిటి? అసలు మోహినికి నేనెలా తెలుసు?

ఇన్‌స్పెక్టర్ నా ఆలోచనలు పసికట్టినట్టున్నాడు.

"మోహినికి క్రాంతి అనేవాడిమీద వెర్రిమోజు! అతడు ఎలా వుంటాడో, ఏం చేస్తాడో మా పోలీస్ రికార్డ్సులో లేదు. అందుకే ఆమె మిమ్మల్ని 'క్రాంతీ!' అని పిలవగానే మీరే క్రాంతి అని అపోహపడ్డాం!"

'హమ్మయ్యా! బతికిపోయాను!' నిట్టూర్చాను. చివరికి నేను క్రాంతిని కానని ఆయన ఒప్పుకున్నారు. నాకు అదే పదివేలు! కష్టపడనక్కరలేకుండానే పోలీసుల యినుపవలలోకి యిరుక్కుపోవడం తప్పిపోయింది. ముత్యాలహారం కేసు ఏమయితే నాకేం? యాపిల్‌లాంటి మోహిని నన్ను ట్రాప్ చేయాలని కష్టపడితే నాకేం?

"మీరు మరో పదినిమిషాలు యిక్కడే వుండండి! మా సార్జెంటు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడో లేదో చూచి మరల వస్తాను!" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"ఇంక జాగ్రత్త లెందుకు సార్! నేను క్రాంతిని కానని మీరు నమ్ముతున్నారు కదా!"

"ఎఫ్.ఐ.ఆర్. (ప్రాథమిక నివేదిక) లో మేం రాసుకో

వాలి కదా! ప్రాసిక్యూషన్ వారిని నమ్మించాలి కదా! ప్లీజ్ .... వెయిట్ అండ్ సీ ...."

తలూపాను. నేను కోర్టులో హాజరవకుండా వుండటమే నాకు కావలసింది! ఈ వయసులో కోర్ట్ గుమ్మం ఎక్కి దిగి యాతనపడలేను. అక్కడే కూర్చుండిపోయాను.

ఇన్స్పెక్టర్ వెళ్ళి అయిదు నిమిషాలయింది. క్రమంగా పదీ. పదిహేను నిమిషాలయింది. ఇరవైగూడా గడుస్తోంది. లాంజ్‌లోకి తలుపుతెరచుకుని తోటమాలి వచ్చాడు. అతడి చేతిలో కవరుంది. సెంటువాసన వస్తోంది. కవర్‌లో పాకెట్ వుంది. పాకెట్‌కి వుత్తరం తగిలించి వుంది.

"తమరికి యివ్వమన్నారు బాబూ మోహినమ్మగారు!" అన్నాడు తోటమాలి.

"మోహినా!" చటుక్కున ఉత్తరం అందుకున్నాడు. "అయ్యా! ప్రముఖ రచయితగారూ!

బోల్తా పడ్డారు ఈ సెంటు సీసాలు ఒంటినిండా పులుముకోండి! 'మాయమైన ముత్యాల హారం' అనో 'హారం తెచ్చిన తంటా' అనో 'అందమైన అమ్మాయి' అనో 'అపురూపమైన బోల్తా' అనో కథ రాసుకోండి. తెలివైన రచయితలు నిజజీవితంలో అమాయక చక్రవర్తులు!

నవ్వుకుంటూ వుంటాను!....ప్చ్! ప్చ్! ప్చ్!—మీ మోహిని"

నా గదిలోకి పరుగెత్తాను. గాజు అద్దాల బీరువాలు వెలవెల బోతున్నాయి. నా అపురూపమైన సేకరణ మొత్తం మాయమయింది దాదాపు అయిదారు లక్షల రూపాయిలు యిప్పుడు ఖర్చుపెట్టినా నా వస్తువులూ, డాలర్ కరెన్సీ యితర్రా విలువైన సేకరణా రావు. పిచ్చిగా బయటికి పరుగెత్తబోయాను.

"ఎవరండయ్యగారూ?" అడిగాడు తోటమాలి.

చటుక్కున అతడిని పట్టుకున్నాను. "ఎవరెవరు వచ్చారు? ఏం తీసుకువెళ్ళారు? నువ్వేం చేస్తున్నావు?" అతడిని గుంజాను.

"తమరు ఆ యిద్దరు బాబులతో కలిసి పైకి వచ్చారు. పది నిమిషాల తర్వాత సార్జెంట్ బాబట. ఆయన నా వద్దకు వచ్చాడు. అప్పుడే అందమైన పిల్లా, ముసలావిడా గేటు తెరచుకుని లోపలకు వచ్చారు.

"రండి! సాయం పడదాం! రచయితగారు పాక్ చేస్తు న్నారు!" అన్నాడతడు.

ముగ్గురూ కలిసి పైకి వెళ్ళారు. రెండు పాకేజీ పెట్టె లతో ముగ్గురూ వచ్చారు. నేనుకూడా సాయం పట్టాను. పోలీసు జీపులో రెండు పెట్టెలనూ వుంచాం. ఇన్స్పెక్టర్ మరో పాకేజీ పెట్టె మోసుకుంటూ వచ్చాడు. అప్పటికి గానీ నాకు అనుమానం రాలేదండి! ఇన్స్పెక్టర్ స్వయంగా పెట్టెను మోసుకుంటూ రావడం ఏమిటి? ఆడవాళ్ళు రావడం ఏమిటి? మీరు వాళ్ళను సాగనంపడానికి రాకపోవడం ఏమిటి? మోహిని నా చేతిలో ఈ పాకెట్ వుంచింది.

మేడమీదకు పరుగెత్తుకు వచ్చి చూశాను.

తమరు కనిపించలేదు. ఎందుకయినా మంచిదని పోలీసు లకు ఫోన్ చేశాను. తమరికోసం వెతుక్కుంటున్నాను. మేడ వెనకాతల ఆరు బయట కూర్చుండి వుంటారు అని తలచలేదండి? చివరికి మీరు దొరికారు. తర్వాతి సంగతి తమరికి తెలిసిందేకదండీ!" అన్నాడు తోటమాలి.

నాకు తల తిరిగిపోయింది. నన్ను ఎలా ట్రాప్ చేయ గలిగారు? మోహిని మృతా నన్ను ఎంత మోసం చేయగలి గింది? అసలు నేను వాళ్ళకు ఎలా తెలుసు? సోఫాలో కూల

బడిపోయి విషాద పర్వంలో మునిగిపోయాను. అయిదారు లక్షల రూపాయిల ఆస్తి పోవడమే గాకుండా కళ్ళు మూసి నన్ను లెంపకాయ లాగినట్టుగా నాకు గొప్ప అవమానంగా వుంది.

బల్లమీది టెలిఫోన్ మ్రోగింది.

చటుక్కున రిసీవరందుకున్నాను.

"సబ్ యిన్స్పెక్టర్‌ను మాట్లాడుతున్నాను. త్రిభువన్!"

"చెప్పండి సార్!"

"మిమ్మల్ని మోసగించినవాళ్ళు దొరికారు. ఒక్కసారి పోలీస్ స్టేషన్‌కి వస్తారా? స్టేట్‌మెంట్ యివ్వాలి!"

గారేజ్‌లోంచి మోటార్ సైకిలు తీశాను. పది నిముషాలలో సబ్ యిన్స్పెక్టర్ ఎదుట కుర్చీలో కూర్చున్నాను. బయట రోల్స్‌రాయిస్ పార్క్ చేసి వుంది.

కటకటాల వెనుక మోహినీ, ముసలిదీ, నకిలీ యిన్స్పెక్టరూ, నకిలీ సార్జెంటూ మొహాలు చూసుకుంటున్నారు.

"మీ రోల్స్‌రాయిస్‌లో పారిపోతున్నారు వీళ్ళు! మీ కారు గురించి మీ తోటమాలిని అడిగి తెలుసుకున్నాం. నెంబర్ చెప్పాడతడు" అన్నాడు సబ్ యిన్స్పెక్టర్.

తలూపి కటకటాలవైపు తిరిగాను.

"నేను మీకెలా తెలుసు?" అడిగాను.

మోహిని తలొంచుకుని చెప్పింది: "నేను గతంలో ఒక వారపత్రిక నడుపుతూ నష్టపోయాను. కాని రచయితల గురించి సమగ్రంగా తెలుసుకున్నాను. వాళ్ళు తెలివిగా రచనలు చేస్తారు. నిజజీవితంలో వాట్టి అమాయకులు. ఎన్నో కష్టాలు పడి రచనలు చేస్తారు. కనీసం కాగితం ఖర్చూ, సిరా ఖర్చూ యిచ్చేస్తే చాలు తమ మేధస్సును రచనల రూపంలో పత్రికలకు యిచ్చి అచ్చులో చూసుకోవాలని

ఉవ్విళ్ళూరుతారు. కాంప్లిమెంటరీ కాపీ మాత్రమే పంపించినా చాలు పరమానందపడిపోతారు.

"మీ రచనలు మా పత్రికకు వచ్చాయి. ఎవరో చెప్పారు. మీరు బాగా సంపాదించుకున్న వారనీ, కేవలం హాబీగా రచనలు పంపుతారనీ.... అంతే! పథకం వేశాం మా సబ్ ఎడిటర్ సార్జెంటయ్యాడు. బిజినెస్ మానేజర్ క్రయిమ్ బ్రాంచ్ యిన్‌స్పెక్టరయాడు. అతడి తల్లి ఫాన్సీ షాపు యజమానురాలయింది. దాని వెనుకనే ఖాళీగా వున్న మేడ అద్దెకు తీసుకున్నాం."

విచారంగా చూశాను. సాహిత్యాభిమానంతో పత్రికలు పెట్టేవాళ్ళు తక్కువయిపోతున్నారు. చివరకు ప్రజలను ఉత్తేజితులను చేయగల సాహితీ రంగంలో కూడా దోపిడీ మనస్తత్వం వున్న వాళ్ళు ప్రవేశిస్తున్నారన్న మాట! తెలుగు సాహితీరంగాన్ని ఎవరైనా వుద్ధరించగలరా?

"వీళ్ళమీద కంప్లయింట్ రాపివ్వండి!" అన్నాడు సబ్ యిన్‌స్పెక్టర్.

తల అడ్డం తిప్పాను. "వద్దులెండి! నా వస్తువులు నాకు ఒప్పచెప్పండి! అంతేచాలు!" అన్నాను.

మూత పడిపోయిన పత్రిక వాళ్ళ పథకం బెడిసి కొట్టింది. నా వస్తువులు నాకు దొరికాయన్న సంతోషంకంటె రచయిత అమాయక చక్రవర్తే కాక క్షమాహృదయం వున్నవాడని కూడా మోహిని ముఠావాళ్ళకు తెలుస్తోందన్న ఆనందం ఎక్కువయింది.

నాకు 'పరువుతీపిన పథకాలు!' అన్న టైటిలుకు కథ వస్తువు సమకూడింది. థాంక్స్‌టూ మోహినీ... అండ్ ఎట్సెట్రా. □

ప్రతీకారం

"స్సరే:" అన్నాడు చాగరాజు ఆఖరికి.

అలా అనడానికి వెనక కొండంత ఆత్మవిశ్వాసం వుంది. స్నేహితుల ప్రోద్బలం వుంది గతంలో ఓసారి గెలిచానన్న గర్వం వుంది. అన్నింటినీ మించి తేజస్విని అభినందిస్తుందన్న ఆశ వుంది.

లంచ్ టైంలో స్టూడెంట్స్ కొంతమంది రావిచెట్టుకింద సమావేశమై వేళాకోళాలాడుకోవడం ఆ కాలేజీలో పరిపాటే. సైన్స్ స్టూడెంట్స్‌కీ ఆర్ట్స్ స్టూడెంట్స్‌కీ అసలు పడేది కాదు. ఎలక్షన్స్ అయినప్పటినించి అది మరీ ఎక్కువైపోయింది. కాని ఏం చేస్తారు: కట్టుకున్న మొగుడూ పెళ్ళాల్లాగ కీచులాడుకున్నా కాపరం చేస్తూనే వున్నారా కాలేజీలో.

ఇంతకూ పందెం ఏమిటంటే — ఆదివారంనాడు ఉదయం పదిగంటలకి తాడేపల్లిగూడెం పెద్ద వంతెన దగ్గర నుంచి విజయా టాకీస్‌దాకా మెయిన్ రోడ్డుమీద అంటే సంత మార్కెట్‌లో సైకిలు తొక్కుతూ రావడం. షరతు ఏమిటంటే కాలు నేలమీద ఆనడంగానీ చేతులతో ఏ వాహనాన్నీ, మనిషినీ దేన్నీ ఆసరా చేసుకోవడంగానీ చెయ్యకూడదు.

ఆ టైములో గూడెం సంత పరిస్థితి తెలిసిన వాడెవ్వడూ ఆ పందెం జోలికి పోడు. ఒకవేళ పందేనికి ఒప్పుకున్నా తప్పకుండా పప్పులో కాలేస్తాడు.

సముద్రంలో చేప్పిల్లని వదేసి ఓ గంటపోయాక వలేసి మళ్ళీ అదే చేపని పట్టుకోవచ్చు నయాగరామీదనించి ధడేల్మని దూకేసి నవ్వుకుంటూ నడిచొచ్చెయ్యొచ్చు ముళ్ళపూడి వెంకటరమణగారి అప్పారావు కిచ్చిన అప్పు చిటికెలో వసూలు చెయ్యొచ్చు తాడేపల్లిగూడెం సంతలో ఆదివారం సైకిల్ తొక్కడం మాత్రం బ్రహ్మతరం కాదు (సారీ: బ్రహ్మదేవుడికి సైకిల్ తొక్కే ఖర్మేం పట్టలేదు.)

ఆ మాటకొస్తే సైకిల్ తొక్కడం కాదు. సంతలో నడుస్తూ జాగ్రత్తగా యింటికి రమ్మనండి చూద్దాం. మార్కెట్‌లోకి ఎవరైనా ఎంటరయ్యాక ఇక వాళ్ళకి తమ

దేహంమీద అధికారం పోతుంది. జనప్రవాహం దానంతట అదే వాళ్ళని నడిపించి ఏ బెల్లం కొట్లోకో, మిరపకాయల బస్తామీదకో విసిరెయ్యకపోతే వాళ్ళు అదృష్టవంతులే.

ఆ మధ్య ఒకతను జేబులోంచి పెన్ పడిపోతే తీసుకుందామని కిందకి వంగేడట. అంతే. మర్నాడు 'శ్రద్ధాంజలి' కాలంలో అతని ఫొటో వచ్చేసింది పేపర్లో.

అటువంటి సంత మార్కెట్‌లో ఆదివారంనాడు సైకిల్ తొక్కుతానని పందెం కట్టేడు నాగరాజు.

నిజానికి నాగరాజు ఇటువంటి పనులకి దూరంగావుండే బుద్ధిమంతుడు. వేరే ఎక్కడనించో వచ్చి బి.ఎస్సీ లో కొత్తగా జేరిన కొంతమంది కుర్రాళ్ళు అతన్ని రెచ్చగొట్టి పందెం కట్టించారు.

వాళ్ళతో అతనికి ఎక్కువ పరిచయం లేకపోయినా స్నేహితుల అండ చూసుకుని బి.ఏ. వాళ్ళ పరువు నిలబెట్టడంకోసం వెయ్యిరూపాయల పందెం కట్టేడు. నెగ్గితే ఆ డబ్బుతో వచ్చేవారం వాళ్ళన్నయ్య పెళ్ళిలో బాగా ఎంజాయ్ చెయ్యొచ్చు స్నేహితులతో. ఓడిపోతే ఫ్రెండ్సంతా కలిపి ఆ సొమ్ము వంతులేసుకుని కట్టేస్తామని హామీ యిచ్చారు.

తిన్నగా తేజస్విని యింటికెళ్ళాడు నాగరాజు.

ఎప్పుడూ కిటికీ దగ్గరే నిలబెట్టి లోపల్నించి మాట్లాడే తేజ ఆ రోజు వాళ్ళన్నయ్య యింట్లో లేడని చెప్పి అతడ్ని లోపలికి పిల్చి కూర్చోబెట్టింది.

ఆమెను చూస్తూనే నోరు వెళ్ళబెట్టాడు నాగరాజు.

ఎప్పటిలాగా చీర కాకుండా ప్యాంటూ చొక్కా వేసుకున్న తేజస్వినిలో కొత్త అందాలు కనిపిస్తున్నాయతనికి. అతని ఆశ్చర్యాన్ని గమనించి "ఓ యిదా? మా అన్న

య్యావి లే. సర్దాగా తొడుక్కున్నా....ఏం బావులేదా?"
అంది.

"అబ్బే! నువ్వు కట్టుకుంటే బట్టలకే అందం ఒస్తుంది"
కవిత్వం వచ్చింది నాగరాజు నోటివెంట.

తేజ సిగ్గుపడింది.

తేజ తండ్రిలేని బిడ్డ. తల్లి వృద్ధురాలు. అన్న సచ్చి
దానంద పెంపకంలో గారంగా పెరిగింది తేజ. చెల్లెల్ని యే
కోటీశ్వరుడికో కట్టబెట్టాలని అతని తాపత్రయం. సంబం
ధాలు వెతుకుతున్నట్టు తెలుసుకున్న తేజ "తను నాగరాజుని
తప్ప అన్యులెవర్నీ పరిణయం ఆడే ప్రసక్తి లే"దని చెప్పి
భీష్మించుక్కూచుంది.

చెల్లెలికి ఎంతగానో నచ్చచెప్పి చూశాడు సచ్చిదానంద.

కాని ఆమె వినలేదు.

చివరికి సచ్చిదానందే దిగొచ్చాడు. మంచిరోజు చూసుకుని
నాగరాజు నాన్నగారితో పెళ్ళి విషయం మాట్లాడతానని
వాగ్దానం చేశాడు.

తేజ కళ్ళు చారెడంతయ్యాయి. మది ఉయ్యాల లూగిన
ట్టయ్యిందామెకి.

ఇది జరిగి వారమయ్యింది.

తేజ అందించిన మంచినీళ్ళు తాగి పందెం సంగతంతా
చెప్పాడు నాగరాజు.

"ఎందుకు నాగూ ప్రతీవాళ్ళతో పందెం కడతావ్?
అందులోనూ ముక్కూమొహం తెలియని ఆ కొత్త
స్టూడెంట్స్‌తోనా? ఈ కాలేజీ పాలిటిక్స్ నాకు భయం
బాబూ. ఎప్పుడేం చేస్తారో తెలీదు. పందెంలో వాళ్ళు ఓడి
పోతే నిన్నేదయినా చేస్తారేమోనని నాకు భయం. మొన్న
ఎలక్షన్స్‌లో చూశావుగా ఎలా నరుక్కున్నారో. నా మాట

విని విత్ డ్రా చేసుకో బాగూ" అంది ఆప్యాయంగా జ.

"నీకు తెలియదు తేజీ. బిఎస్సీ వాళ్ళకీ మధ్య బాగా పొగరు బలిసింది. అదొకసారి అణచాల్లే"

"పొగరు అణచడానికి సైకిల్ తొక్కాలా బాగూ? మీ క్లాసులో వాళ్ళంతా ఫస్టుకాసులో పాసవ్వండి. వాళ్ళకన్న ఎక్కువ పర్సంటేజీ వచ్చే వాళ్ళ పొగరణచినట్లే కదా?" అంది పూర్వకాలం మనిషిలాగా.

"ఆర్ట్సువాళ్ళకి యెంత రాసినా మార్కులివ్వరు. నీకు తెలియదా? అయినా వాళ్ళు సవాల్ చేస్తున్నప్పుడు మేము చేతులు ముడుచుక్కూర్చోకూడదు కదా?"

"నువ్వెన్ని చెప్పు బాగూ! నిన్ను పందేనికి పంపేది లేదు" అంది అతనిమీద ఆప్యాయంగా అధికారం చూపుతూ.

"ఇంతవరకూ వచ్చేక వెనక్కుతియ్యడం జరగని పని. ఓడిపోయినా ఫరవాలేదు. అయినా తేజీ నువ్వు నాకు ధైర్యం చెప్పాల్సిందిపోయి పిరికిమందు పోస్తావా? అందరి ముందూ నేను చవటలాగా తలొంచుకొని కూర్చుంటే ఆనందిద్దామనుకుంటున్నావా?" ఆవేశంగా కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు బాకరాజు వెళ్ళిపోయే ప్రయత్నంలో.

అతని చెయ్యి పట్టుకుని కూర్చోబెట్టి టేబిల్ మీదున్న తన వ్యానిటీబేగ్ తీసింది తేజ

అందులోంచి నైల్‌కట్టర్ తీసి చటుక్కున బొటనవేలు తెగోసుకొని బొటబొటా రక్తం కారుతున్న ఆ వేలితో అతని నుదుటిమీద 'రక్తతిలకం' దిద్దింది.

"పిరికిమందు పోయటంలేదు బాగూ! నీ కెక్కడ అపాయం జరుగుతుందోనని భయపడ్డానంతే. నీకు ఎనలేని ఆత్మస్థైర్యం వుంది. అదే నీకు శ్రీరామరక్ష. నువ్వు తప్ప

కుండా ఈ పందెం నెగ్గుతావు" అంది ఆవేశంతో బాల చంద్రుడి పెళ్ళాం మాంచాలిలాగా.

ఊహించని ఆ సంఘటనకి చలించిపోయిన నాగరాజు వెంటనే ఆమె బొటనవేలిని పట్టుకుని ధారగా కారుతున్న రక్తాన్ని తన జేబురుమాలుతో నొక్కిపట్టి గట్టిగా చుట్టేశాడు.

"ఏమిటీ పిచ్చిపన్లు తేజీ? ఇదేమన్నా రాజుల కాలమా యుద్ధాని కెళ్ళేటప్పుడు 'వీరతిలకం' దిద్దడానికి?" అని కోప్పడ్డాడు మనసులో ఆమెకు తనమీదున్న ప్రేమకి పరవశించిపోయి.

2

జనం విపరీతంగా వున్నారు సంతలో. తాడేపల్లి గూడెం సంత బెల్లంవ్యాపారానికి పెట్టింది పేరు. బెల్లం లారీలతో బాటు అపరాలు. బియ్యం రవాణాచేసే ట్రక్కులు కూర గాయల బళ్ళు. రిక్షాలు. బస్సులు. చిల్లర వర్తకుల వాహనాలూ, రోడ్ల మీద స్వేచ్ఛగా తిరుగుతూ సినిమాపోస్టర్లు, కూరగాయలూ దొంగతనంగా తినేసే పశువులూ, బెల్లం కోసం వచ్చే కుక్కలూ, పందులూ, సోడాబళ్ళూ సైకిళ్లూ, చిల్లర అమ్మకాల కుర్రకారూ. కొనుగోలు చేయడానికొచ్చే ప్రజలూ—నానారకాల ధ్వనులతో కిక్కిరిసిపోయి యుద్ధ భూమిలాగా వుంది.

సరిగ్గా అప్పుడే ప్రారంభమయింది నాగరాజు సైకిల్ యాత్ర పెద్ద వంతెన వద్ద.

నాగరాజు సైకిల్ తొక్కడంలో నేర్పరి. పైగా గతంలో ఒకసారి యిటువంటి పందెం నెగ్గి వుండడం అతనికి ఎంతో ఉత్సాహాన్నిస్తోంది.

ట్రాఫిక్‌ని వేయికళ్ళతో గనిపెడుతూ వేగాన్ని క్రమ

బద్ధం చేసుకుంటూ బ్యాలన్స్ చేసుకుంటూ తొక్కు-తున్నాడు సైకిల్.

ఇరుపక్షాల స్టూడెంట్స్, వాళ్ళతాలూకు న్యాయనిర్ణేతలూ కొంచెం ఎడంగా జనాల్లో చొరబడి పరిగెడుతూ సైకిల్ని అనుసరిస్తూ వస్తున్నారు.

క్లిష్టపరిస్థితుల్లో కూడా చాకచక్యం ప్రదర్శించి సర్కస్ మనుషుల్ని మరిపిస్తూ ఓ పక్క చెమటలు కక్కుతూ అందరూ అచ్చెరువందేలాగా ఇంచు మించు గమ్యస్థానానికి దగ్గరగా వచ్చేశాడు చాగరాజు దిగ్విజయంగా....

ఇంకో వంద అడుగుల్లో చేరుకుంటాడు విజయా టాకీస్కి. చాగరాజు స్నేహితుల మొహాలు వెలిగిపో తున్నాయి ఆనందంతో.

అప్పుడే విధి వక్రంగా చూసింది చాగరాజు వంక! అతని ఉత్సాహాన్నంతా నీరు కార్చింది!!

వెంకట్రామా టాకీస్ సందులోంచి అడ్డంగా దూసు కొచ్చేసిం దొక లారీ!

మెరుపు వేగంతో వచ్చిన ఆ లారీ చటుక్కున కుడి వైపు తిరిగి చాగరాజు సైకిల్ని వెనకినించి 'ధడేల్మ'ని గుద్ది కీచుమంటూ ఆగిపోయింది.

చాగరాజు గుండె లవిసిపోయాయి.

గాల్లోకి ఎగిరి రెండు పల్టీకొట్టి రోడ్డపతల బండిమీద అమ్మకానికున్న బసీన్లు, డ్రాయర్ల గుట్టమీద పడ్డాడు - చావుకేక పెట్టి.

సైకిలు చక్రాలు ఎనిమిదంకెలు వేసేశాయి. మిగిలిన భాగాలన్నీ సమైక్యంగా కలిసిపోయాయి.

జనం పోగయ్యారు. డ్రైవర్ని బూతులు తిట్టేరు.

చాగరాజు స్నేహితులు వాడికి దేహశుద్ధి చెయ్యడానికి ఉద్య మించారుగానీ ఇంతలో ట్రాఫిక్ పోలీసులొచ్చి తప్పించేరు ఆ ప్రోగ్రాంని.

చాగరాజు హాస్పిటల్లో కళ్ళు తెరిచాడు.

అతడి స్నేహితులంతా మనసులో కుళ్ళికుళ్ళి ఏడ్చి చందాలేసుకుని వెయ్యి రూపాయలూ చెల్లించివేశారు.

అవతలివాళ్ళు మీసాలు మెలేశారు.

3

రెండురోజుల్లో చాగరాజు అన్నయ్య పెళ్ళి.

ఇల్లంతా చుట్టాలతో సందడిగా వుంది.

చాగరాజు మాత్రం విరాగిలా ఉన్నాడు—చేతికీ, నడుంకీ బ్యాండేజీలతో.

అవమాన భారం అతన్ని క్రుంగదీసింది. తండ్రికి పెళ్ళి పనుల్లో సహాయపడుతూ గతాన్ని విస్మరించడానికి విఫల యత్నం చేస్తున్నాడు.

ఆ రోజు ఉదయం—

స్టోరు గదిలోంచి వంటశాలకి సరుకులు కూలీలచేత మోయిస్తున్న చాగరాజు ఒక బెల్లం దిమ్మకి అడుగున అతుక్కుని ఉన్న ఒక గుడ్డనిచూపి అనుమానంగా విప్పి చూశాడు.

ఆశ్చర్యం!! అది తాను తేజ వేలికి కట్టిన 'వీరతిలకం' జేబు రుమాలు!!

రక్తం మరకలుగూడ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అదిక్కడి కెలా వచ్చింది? బెల్లం దిమ్మకి అంటుకుని వచ్చే అవకాశం ఎలా వుంది?

అతని మనస్సు ఏదో శంకిస్తోంది.

పందెంరోజున తనన ఢీకొన్నది బెల్లం లారీయే! అతని

'పిక్స్త్ సెన్స్' ఏదో అస్పష్టంగా గొణుగుతోంది.

వెంటనే తండ్రివద్దకు పరిగెట్టాడు చాగరాజు.

'నాన్నా పెళ్ళికోసం తెచ్చిన బెల్లం దిమ్మలు ఎవరికొట్లో కొన్నారూ?' ఆత్రంగా అడిగాడు.

ఆయన చెప్పారు.

వెంటనే సైకిల్‌మీద ఆ దుకాణానికి వెళ్ళి ఎంక్వయిరీ చేశాడు—వాళ్ళు బెల్లం హోల్‌సేల్‌గా ఎక్కడనుంచి తెప్పిస్తారని.

చాగరాజు మొహంలో ఓ వెలుగొచ్చింది వాళ్ళు సమాధానం చెప్పేసరికి.

వాళ్ళకి బెల్లం హోల్‌సేల్‌గా సప్లయిచేసేవాళ్ళ లారీయే తనని ఢీకొన్న లారీ. అంటే తనని పందెంలో ఓడించడానికి ఓ పథకం ప్రకారం కుట్ర జరిగిందన్న మాట.

ఇందులో తేజపాత్ర ఉన్నట్లు జేబురుమాలే సాక్ష్యం!

అంతే తను ఇంక భవిష్యత్తులో ఏ పందెంలోనూ పాల్గొనకుండా ఉండడానికి ఇలా బెదిరించాలని చూపిందా? తనకి గాయాలు తగిలితే ఇంతవరకూ చూడడానికి కూడా రాలేదే! అంటే తనదంతా కపట ప్రేమన్నమాట!

ఆ వూహ రాగానే అతడ్ని 'నిస్తేజం' ఆవరించింది.

4

అది ఒక పెద్ద రేకుల సావిడి.

అందులో రెండువైపులా వందలకొద్దీ బెల్లం దిమ్మలు ఒకదానిపై ఒకటి పేర్చి లాట్లు కట్టబడ్డాయి.

కూలీలు బెల్లం లోడింగ్ చేస్తున్నారు లారీల్లో.

ఓ వారగా చుట్ట కాలుస్తూ కూర్చుని చూస్తున్నాడు షావుకారు విశనాధంగారు.

చాగరాజు చెప్పగా అంతా విని విశనాధంగారు ముక్కు

మీద వేలేసుకున్నారు.

"కలికాలం" అని గొణుక్కుంటూ ఓ డ్రైవర్ని వేలెట్టి పిలిచి "వీడేనా?" అన్నాడు చాగరాజుకేసి చూపి.

"అవునండీ యితనే!" అన్నాడు చాగరాజు వెంట వచ్చిన అతని స్నేహితుడు ఆవేశంగా.

"ఏరా? ఆరోజు ఈ కుర్రాణ్ణి గుద్దేసినందుకు ఎంత ముట్టింది నీకు?" అన్నాడు చుట్ట దులుపుతూ.

"ముట్టడవేంటండి? సడన్‌గా ఈయనగార్ని సూసి బ్రేకులేశానండి. ఇంతలోకే బండి సరేల్నా సైకిల్ని రాసుకుందండి" చేతులు కట్టుకుని జవాబిచ్చాడు డ్రైవరు.

విశ్వనాథంగారు కుర్చీలోంచి మెల్లగా లేచాడు.

లేస్తూనే మెరుపువేగంతో డ్రైవర్ దవడమీద సాచిపెట్టి ఒక్కటిచ్చాడు.

"ఏరా ఎదవా యాక్సిడెంట్లుచేపి డబ్బులు గుంజటం నీపైడు బిజినెస్సేట్రా? నీకిక్కడ ఉద్యోగం ఇచ్చింది నీచేత ఇలాంటి ఎదవపన్లు చేయించడానికా? చెప్పు ఎంతిచ్చిందాపిల్ల నీకు?" మళ్ళీ చెయ్యెత్తాడు షావుకారు.

బిక్కచచ్చిపోయాడు డ్రైవరు.

జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పేశాడు.

5

జరిగిందంతా విని ఆశ్చర్యపోయింది తేజ.

"సారీ తేజీ! నిన్ననవసరంగా అనుమానించాను. నీది నిష్కళంకమైన ప్రేమ." చాగరాజు ఆమె రెండు చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకున్నాడు కన్నీళ్ళతో.

"ఇట్సాల్ రైట్ చాగూ. నీ స్థితిలో ఎవరున్నా అలాగే అనుమానపడతారు" అంది తేజస్విని.

చాగరాజుని తప్ప వేరెవ్వరినీ పెళ్ళిచేసుకోనని పట్టు

బట్టిన తేజ మనస్సుని మళ్ళించలేక నాగరాజుని అంతం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు ఆమె అన్న సచ్చినాణ.

ఆ ప్రయత్నంలో భాగమే—సైకిల్ పందేనికి ఉసి గొల్పించి ఒప్పించడం!

విశ్వనాథంగారు లేని సమయంలో వాళ్ళ గోడౌన్‌కి వెళ్ళి అక్కడ ఒక డ్రైవర్‌తో మాట్లాడి నాగరాజుని యాక్సిడెంట్‌లో అంతం చెయ్యమనీ, లేకుంటే కనీసం కాలో చెయ్యో విరిగిపోయేలాగా 'ఢీ' కొట్టమని చెప్పి అడ్వాన్సుగా కొంత ముట్టజెప్పాడు సచ్చినాణ.

మనీపర్సు తీసే సమయంలో జేబులోంచి జారిపడి పోయిన రుమాలును సచ్చినాణ గమనించలేదు.

అదృష్టవశాత్తూ ఆ జేబురుమాలు బెల్లం దిమ్మకంటుకుని నాగరాజింటికి చేరింది.

నాగరాజు తేజవేలికి జేబురుమాలు చుట్టేక తేజ దానిని తీసేసి బ్యాండేజీ కట్టుకుంది. ఆ రుమాల్ని యథాలాపంగా తను కట్టుకున్న ప్యాంటు జేబులో పెట్టుకుంది. మర్నాడు ఆ బట్టల్తే వేసుకున్న సచ్చినాణ గోడౌన్‌లో దానిని పారేసు కోవడం యాదృచ్ఛికంగా జరిగి నాగరాజు పరిశోధనకి బాగా పనికొచ్చింది.

జరిగిందంతా తెలుసుకుని సచ్చినాణ తల్లి అతనికి బాగా చీవాట్లు పెట్టి తేజస్వినిని నాగరాజు కిచ్చి వైభవంగా వివాహం జరిపించింది.

ఆ తర్వాత నాగరాజు మరెప్పుడూ పందెం జోలికి పోలేదు. అందుచేత తేజకి ఇక 'వీర తిలకం' దిద్దే అవసరం లేకపోయింది.

☐

సీరియల్

ఏ.వీ.మోహన్రావ్

(గత సంచిక తరువాయి)

జ్వాలా దాదా తదేకంగా గమనించి చూశాడు. వాళ్ళ వేషాన్నిబట్టి అడవి నాయకుడు "మామూ" మనుషుల్లా గున్నారు వాళ్ళు. కానీ తమకన్నా ముందువచ్చి దారికి అడ్డంగా ఎందుకువున్నారో జ్వాలా దాదాకు అర్థంగాలేదు.

నిధికోసం తాము వెళ్తున్న విషయం తెలుసుగాబట్టి, దారి మధ్యలో దాడిచేసి పట్టుకొని. దాని రహస్యం బలవంతంగా తెలుసుకొని, వెళ్ళి దాన్ని కాజేద్దామన్న చెడుబుద్ధి మామూకు పుట్టిందేమో ననుకున్నాడు దాదా.

మేఘనాధ్‌ను సంప్రదించాడు. కాలాతో ఆలోచించాడు. కిశోర్ అభిప్రాయం తెలుసుకున్నాడు.

ఆ తర్వాత దాదా అందరికీ అర్ధమయ్యేట్లుగా ఎదురుగా వున్న ఆపదగురించి దాన్ని ఎదుర్కోవలసిన పద్ధతిగురించి వివరించాడు. ఇంకొంచెం ముందుకువెళ్ళి. ఒక్కొక్కరు ఒక్కొక్క చెట్టుమొదలును అడ్డంగా పెట్టుకొని నిలబడ్డారు.

కాలామాత్రం చకచక చెట్టెక్కి కొమ్మల్లోకి ఎక్కి నక్కి కూర్చున్నాడు.

సెంట్రీ డ్యూటీ చేస్తున్న అడవిమనిషి పైకి, దాదా తుపాకీ పేల్చాడు. అతను లాఘవంగా పిల్లిమొగ్గవేసి తప్పుకున్నాడు. విశ్శబ్దాన్ని చీలుస్తూ ఆ గుండుచేసిన శబ్దానికి, అక్కడ పడుకొనివున్న జనంలో కలకలం పుట్టుకొచ్చింది. అంతా లేచి వాళ్ళవాళ్ళ ఆయుధాలు ధరించారు.

మరో గుండు పేల్చాడు దాదా.

అడవి మనుషుల్లోని ఒకతను, విషంలో ముంచిన అమ్ముని ధనుస్సుకు సంధించి చెవిదాకా నారిని లాగి, ఆ శబ్దంవచ్చిన దిక్కుకు వదిలాడు. దాదా అడ్డుపెట్టుకున్న చెట్టుకు తగిలి గుచ్చుకొనిపోయింది.

ఆ అమ్ముల గురించి దాదాకు తెలుసు. అవి తగిలాయంటే మనిషి, నురుగులు గక్కుకుని, నిముషంలో కన్నుమూస్తాడు. ఎలాగైనా అవి తగలకుండా చూసుకోవాలి. దాదా మళ్ళీ తుపాకీ ఎత్తి కాల్చాడు.

గుండు సర్రున దూసుకునిపోయి సెంట్రీ డ్యూటీ

చేసున్న అడవిమనిషి పొట్టలో దూరింది పెద్దగా అరుస్తూ బాణాల్ని కత్తిని పడేసి. లుంగచుట్టుకుని పడిపోయాడు

చెట్టెక్కిన కాలా అదే అదనుగా చెట్లకొమ్మల్లోంచి గురిచూసి, పందిరి ప్రక్కనున్న జనంపైకి కాల్పులు జరిపాడు. వరుసగా ఆరు తూటాలు వెళ్ళాయి. ఆ గుంపులోని మగ్గురు మనుషులు నేలకూలారు.

మిగిలినవాళ్ళు వెనక్కి పరుగెత్తారు ఆవైపు దట్టంగా చెట్లు వున్నాయి. ఆ చెట్లల్లోకి అంతర్థానమైనారు

కాలా చెట్టుదిగి క్రిందికొచ్చి దాదా దగ్గరకు వెళ్ళాడు.

"మగ్గురు చచ్చారు. శవాలు పడివున్నాయి. మిగిలినవాళ్ళు వెనక్కి వెళ్ళిపోయినట్లున్నారు." అన్నాడు.

"అవును కానీ మనం ముందుకు వెళ్ళొద్దు వాళ్ళు మనం బహిరంగ ప్రదేశంలోకి వెళ్ళగానే అమ్ములు వదలుతారు. అవి విషపూరితమైనవి. మనం జాగ్రత్తగా వుండాలి తెల్లవారిందాకా ఈ చెట్లలోనే కాలక్షేపంచేద్దాం. వెలుగు వచ్చాక ఏం చెయ్యాలో నిర్ణయించుదాం." అన్నాడు దాదా.

"మీ యిష్టం." అన్నాడు కాలా.

దాదా అందరికీ తన పథకం వివరించాడు. అందరూ ఇంకొంత వెనక్కివెళ్ళి కూర్చున్నారు. కిశోర్‌కు సెంట్రీ డ్యూటీ అప్పగించారు. అడవి మనుషుల వెనకనుండిగానీ ప్రక్కనుంచిగానీ వచ్చి. తమని దెబ్బతీయకుండా జాగ్రత్తలో వుండాలని తీర్మానించుకున్నారు.

దాదా తుపాకీ తలక్రింద పెట్టుకుని పడుకున్నాడు. కాలా మేఘనాధ్ లిరువురు కూర్చునే వుండిపోయారు తుపాకులు సిద్ధంగా వుంచుకుని. రాత్రి మెల్లగా, మరీ మెల్లగా కరగనారంభించింది.

అపరాధ పరిశోధన పోటీ-204

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1-00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-7-'85 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు సెప్టెంబరు '85 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. ఇటీవల ప్రజలను ఎక్కువగా హడలగొట్టినవి—? (ట్రాన్సిస్టర్ బాంబులు, వేసవి ఎండలు)
2. వచ్చే సంవత్సరము హైద్రాబాదులో ఇవి జరుగనున్నవి—? (అంతర్జాతీయ చలన చిత్రోత్సవం, జాతీయ క్రీడా పోటీలు)
3. శ్రీలంక అగ్నిజ్వాలల్లో ఎక్కువగా ఆహుతి అవుతున్నవారు—? (సింహళీయులు, తమిళులు)
4. ఇక ఇప్పుడు వారానికి అయిదే పనిరోజులు—? (రాష్ట్ర ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వము)
5. కొందరికి దీన్ని చూస్తే భయం—? (పాము, రక్తం)

44

తెల్లవారింది. తెల్లటి వెలుగు అడవిని అందంగా వెలిగించింది.

దాదా, కాలా ముందుకువెళ్ళి రాత్రి కాల్పులు జరిపిన ప్రదేశంవైపు చూశారు. మూడు శవాలు పడివున్నాయి. బాగా దగ్గర్నుంచి చూశాక వాళ్ళు 'మాముా'కు సంబంధించిన మనుషులని నిర్ధారణ చేసుకున్నారు.

"వీళ్ళిలా మనపైకెందుకు కాల్పులు జరిపినట్లు?" ఆశ్చర్యపోతూ అడిగాడు కాలా.

"అదే అంతుబట్టకుండా వుంది" అన్నాడు దాదా ఆలోచిస్తూ.

ఈలోగా మిగిలినవాళ్ళంతా అక్కడకు చేరుకున్నారు. ఎవరికి తోచింది వాళ్ళు చెప్పసాగారు.

అక్కడ ఆగడంకన్నా ముందుకువెళ్ళి, మరేదైనా అనువైన ప్రదేశంలో మకాం వేసుకోవడం మంచిదని నిర్ణయించుకున్నారు. ఆరునుండి తప్పించుకువెళ్ళిన అడవి జాతి మనుషులు మళ్ళీ కాలుదువ్వి, కాల్పులు జరిపే ప్రమాదం వుందని కూడా ఊహించారు.

అందరూ ముందుకు నడవడం మొదలెట్టారు. దాదా నేలపైన మనుషుల సంచారం తెలిపే గుర్తులేవైనా కన్పిస్తాయేమోనని తదేకంగా చూస్తూ నడవసాగాడు.

నాలుగైదుమైళ్ళు పైగానే నడిచారు. ఎక్కడా, ఎవ్వరూ, కనుపించలేదు. అక్కడో చిన్న నీటి గుంట కనుపించింది. అంతా అక్కడ ఆగిపోయారు.

అపర్ణ వంటను ప్రారంభించింది. కిశోర్ సాయంగా వుండిపోయాడు. కాలా, మేఘనాధ్, కృష్ణమూర్తి, దాదా నలుగురు గంటసేపు కష్టపడి టెంట్ వేశారు. ఆ తర్వాత

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, మీకు ప్రతి పత్రికపైన ఒకరూపాయి తగ్గింపు లభిస్తుంది. పైగా వాటిని పంపుటకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

3. మీరు సభ్యత్వము తీసుకోగానే మొదటిసారి పంపేకాపీలు, అటుతర్వాత ప్రతి ఏడాది జనవరి నెల కాపీలు వి.పి.ద్వారా పంపబడుతాయి. డిసెంబరు నెల వరకు వచ్చే అన్ని సంచికలకు సెట్టుకు రు. 10/-లు చొప్పున లెక్కకట్టి, ఆ మొత్తానికి ఒకేసారి వి. పి. పంపుతాము. మిగతా నెలల కాపీలు మీకు బుక్‌పోస్ట్ లేదా రిజిష్టరు పోస్టులో అందజేయబడుతాయి.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మొత్తం మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా ఖచ్చితంగా అందజేయబడతాయి. ఆ బాధ్యత మాది.

6. మీ చిరునామా మారినప్పుడు, మరియు జనవరి నెలలోను మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంటుంది. కావున మీ పాకెట్‌పై మీ పేరుకు ముందు వుండే కొత్త నెంబరును గుర్తించ కోరాము.

7. ఏ కారణంగానైనా 25వ తేదీలోపల మీకు పత్రికలు చేరకపోతే, ఆ విషయం మాకు తెలుపండి. వాటి బాధ్యత మేము తీసుకుంటాము. ఉత్తర ప్రత్యుత్తరాలలో మీ నెంబరు వ్రాయటం మాత్రం మరచిపోవద్దు. మీ నెంబరు వ్రాయకున్నా, 25 తేదీలోపల తెలిపినా— అవి పరిశీలనకు తీసుకోబడవు.

ప్రతినెలా V.P. కావాలనేవారికి

సెట్టు రు. 15/లు చొప్పున పంపబడుతుంది.

వెళ్ళి మొఖాలు కడుక్కున్నారు. వచ్చి అపర్ణ ఇచ్చిన టీలు తాగి విశ్రాంతి తీసుకుంటూ కూర్చున్నారు.

మధ్యాహ్నం భోజనాలు పూర్తిచేశారు. రాత్రికి క్యాంప్ ఎత్తేసి, వెన్నెల వెలుగులో, వాతావరణం చల్లగా వుంటుంది గాబట్టి, హాయిగా నడవొచ్చని, తీర్మానించు కొన్నారు.

దాదామాత్రం హుషారుగా లేదు. అతని మస్తిష్కం నిండా లెక్కకుమించిన ఆలోచనలు, భయాలు, అనుమానాలు, పెనుభూతాల్లా పట్టుకున్నాయి.

కాలా దాదా ముభావంగా వుండటం చూసి "ఏమిటలా వున్నారు దాదా?" అడిగాడు.

"ఏం లేదు?"

"మీ మనస్సులో మాట నాకు చెప్పండి!"

"చెప్పేందు కేమీలేదు." అన్నాడు దాదా పొడిగా.

"మీరు మామూ మనుషుల గురించి ఆలోచిస్తున్నారనుకుంటాను. ఇది ఖచ్చితంగా మామూ పనికాదు. అతనే మనల్ని ఆపదలచుకుంటే ఆ పని అక్కడే చేసేవాడు. అతని దగ్గర మనుషులున్నారు ఆయుధాలున్నాయి. అయినా మనల్ని ఎంతో గౌరవంగా చూశాడు. దాన్నిబట్టి, ఇదంతా 'రాకా' అనుచరుల పనయివుంటుందని నా అనుమానం." అన్నాడు కాలా.

"మరి రాకా చనిపోయాడుగా?" అడిగాడు దాదా.

"మనల్ని తప్పుదారి పట్టించేందుకు అలా సృష్టించి వుంటారు. అతనికీ నిధి గురించి ఎంతో కొంత తెలిసింది. అందువల్లే మనవెంటబడి వుంటాడు." అన్నాడు కాలా.

"మరి ఆ సంచీ సంగతి ఏమిటి?"

"అది కూడా అతను సృష్టించినదేనని నా అనుమానం.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-7-'85 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు సెప్టెంబరు '85 నెల సంచికలో ప్రకటిస్తాము.

మే '85 పోటీ ఫలితాలు:

(1) మే '85 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

వెనుక రాక్షసబల్లుల పోరు!
ముందర మరతుపాకుల హోరు!!

పంపినవారు: శ్రీ ఎమ్. వి. శ్రీరాంకుమార్, 29-14-9, విశ్వనాథం రోడ్, విశాఖపట్టణం—20.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఏడపోయినాడో చిక్కడు!
కీడు చేయ చాలు ఒక్కడు!!

పంపినవారు: శ్రీ వి. శ్రీనివాస్, ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా, హన్మకొండ—506 001.

అది మనచేతుల్లో పడేట్లు అతను ఏర్పాటు చేసివుంచాడు. దాని ఆధారంగా ముందుకువెళ్ళి ప్రయోజనముండదనిపిస్తుంది. అసలు మార్గం తెలిసే వస్తువుంటే అతని దగ్గరుండాలని నా నమ్మకం!" అన్నాడు కాలా.

ఆ మాటవిని దాదా కళ్ళు మూసుకుని దీర్ఘాలోచనలోకి జారిపోయాడు. మేఘనాథ్ అప్పుడే లోనికొచ్చి "ఏమిటేదో తీవ్రంగా చర్చిస్తున్నారు?" అని అడుగుతూ కూర్చున్నాడు కాలా ప్రక్కనే.

కాలా చెప్పాడు.

"దాదా! మీరేమంటారు?"

"కాలా అభిప్రాయంతో ఏకీభవించక తప్పదనిపిస్తూంది" అన్నాడు దాదా.

"మరి మనమేం చెయ్యాలి?" అడిగాడు మేఘనాథ్.

"మళ్ళీ రాకా, అతని మనుషులు మనపైకి దూకడం తప్పదు. ఆ అవకాశం తీసుకొని, మనం యెలాగైనా రాకాను పట్టుకోవాలి. అతన్ని సామ, ధాన, భేద, దండోపాయాలతో దారికి తెచ్చి, అసలు విషయం రాబట్టాలి" అన్నాడు కాలా.

"మనం యిక్కడ్నుంచి రాత్రికి బయలుదేరుదామనుకున్నాం, అందులో మార్పు లేనట్లేనా?" అడగాడు మేఘనాథ్.

"లేదు! వాళ్ళకు మనం అవకాశం యివ్వాలి. ఎంత తొందరగా వాళ్ళు మనకి చిక్కితే మన పని అంత సులభమవుతుంది" అన్నాడు కాలా.

ఇద్దరూ తలూపారు.

ఆ తర్వాత మిగిలినవాళ్ళను కూడా పిలిచాడు. పరిస్థితి వివరంగా తెలియజేశాడు దాదా. అందరూ యెలా అప్ర

శ్రీమహాలక్ష్మీవారి వెరైటీ నవలలు

మే 25 విడుదలైనవి!

1. ధర్మయుద్ధం (ఆంధ్రభూమి సీరియల్) — మల్లాది వెంకట కృష్ణమూర్తి 25-00
2. నాతిచరామి (ద్వితీయ ముద్రణ) — ,, 16-00
3. ఈ తరం స్త్రీ (స్వాతి వీక్లీ సీరియల్) — రమణీమణి 25-00

మార్చిలో విడుదలైనవి!

1. రెండు రెళ్ళు ఆరు (ఆంధ్రజ్యోతి సీరియల్) — మల్లాది వెంకటకృష్ణమూర్తి 20-00
2. గుడ్‌బై భూదేవీ గుడ్‌బై (ఆంధ్రజ్యోతి సీరియల్) — N.R. నంది 20-00
3. మల్లెలు - మందారాలు (ఆపన సీరియల్ - రక్తపు జేర్లు) — వసుంధర 17-00
4. అనురాగ తరంగాలు — జి. భవానీ కృష్ణమూర్తి 12-00
5. శిక్ష — మాదిరెడ్డి సులోచన 22-00
6. మల్లిక్ కార్టూన్లు — మల్లిక్ 15-00

అడ్వాన్సుతో పాటు నేడే మీ ఆర్డరు పంపండి.

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ - 2.

మ త్తంగా వుండాలో, అడవిజాతి మనుషుల దాడిని యెలా ఎదుర్కోవాలో వివరించాడు.

సాయంత్రం కాబోతూండగా టెంట్ తీసివేశారు. సామాన్లన్నీ కట్టివేసి రెండు ప్లాస్టిక్ డబ్బాల నిండా నీరు నింపుకొన్నారు. సంధ్య చీకటి కమ్ముకుంటూండగా ప్రయాణం మొదలుపెట్టారు.

అడవిలోని సన్నటి కాలిత్రోవగుండా, ఒకరి వెనక ఒకరు నడవడం మొదలెట్టారు. అందరికన్నా ముందు దాదా వున్నాడు. చివర మేఘనాధ్ వున్నాడు. అతని జేబుల నిండా స్మోక్‌బాంబ్‌లు వున్నాయి. స్టెన్‌గన్ లోడ్ చేసి, సేఫ్టీకాచ్ రిలీజు చేసి వుంచుకున్నాడు.

నిండుచంద్రుడు, ప్రసరింప చేస్తున్న చల్లటి తెల్లటి వెంగు చెట్ల ఆకులనుండి దూసుకొని, వాళ్ళపైన పడ సాగింది. ఆ దినమంతా విశ్రాంతి తీసుకొని వుండటం, కడుపునిండా ఆహారం తినడంవల్ల. అందరిలోనూ ఉత్సాహం వచ్చింది వడవడిగా అడుగుల వేస్తూ ముందుకు నడవసాగారు.

రెండు గంటలు పైగా నడిచాక అందరూ, లావుపాటి ఎత్తైన చెట్లున్న అడవిప్రాంతం చేరారు. చెట్లు దగ్గర దగ్గరగా వున్నాయి ఒకదాని కొమ్మలు, మరొకదాని కొమ్మలతో చిక్కుకునిపోయి, ఆకాశంలోంచి వస్తున్న వెలుతురును క్రిందకు రానీకుండా అడ్డుపడటంతో మార్గమంతా చీకటిగా వుండిపోయింది. (ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600001.

Blank Page


Regd.no: H/HD-48